# కర్నూలును కరువు జిల్లాగా ప్రకటించండి

- ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాల లోగో ఆవిష్కరణ

లోపలి పేజీలో..



PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 119 | విజయవాడ, గురువారం 30 నవంబర్ 2023 | 8 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Thursday 30 November 2023 | Rs

# శ్రేయాంక మ్యాజిక్

- ఇంగ్లండ్-ఎపై మూడు పరుగుల తేడాతో భారత్-ఏ మహిళలజట్టు గెలుపు

లోపలి పేజీలో..


## పారిశ్రామిక రంగంపై

# ప్రత్యేక దృష్టి

- పరిశ్రమలకు శంకుస్థాపనలో సిఎం

వివిధ ప్రాజెక్టులకు తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తున్న సిఎం

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక రంగంపై ప్రత్యేక దృష్టి సారించిందని, దీనిలో భాగంగానే గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్లో చేసుకున్న ఒప్పందాల కార్యరూపం దిశగా అడుగులు వేస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సులో చేసుకున్న ఒప్పందాల మేరకు ఏర్పాటు చేయనున్న తొమ్మిది ప్రాజెక్టులకు తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. రూ.1,100 కోట్ల పెట్టుబడితో చేపట్టనున్న ఈ ప్రాజెక్టుల్లో 21,744 మందికి ఉపాధి లభించనుంది. అలాగే రూ.422 కోట్లతో చేపట్టిన ఐదు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను సిఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశ్రామిక రంగంలో ముఖ్యంగా ఎంఎస్ఎంఇ, ఫుడ్ ప్రాసెసింగ్ సెక్టార్‌పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. జిల్లాల్లో కలెక్టర్లు కూడా పారిశ్రామికవేత్తలకు సహకరించాలని కోరారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్లో 386 ఒప్పందాలు చేసుకున్నామని, దీనివల్ల రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చేలా ప్రణాళికలు వేసుకున్నామని తెలిపారు. ఆరు లక్షల మందికి ఉపాధి దొరుకుతుందని పేర్కొన్నారు. ఒప్పందాల్లో భాగంగా ఇప్పటికే 33 యూనిట్లలో ఉత్పత్తులు ప్రారంభమయ్యాయని, 94 ప్రాజెక్టుల పనులు వేగంగా ఉన్నాయని తెలిపారు. వీటిలో మరింత పురోగతి తీసుకొచ్చేందుకు సిఎస్ ఆధ్వర్యంలో పారిశ్రామికవేత్తలకు చేయూతనిచ్చామని వివరించారు. నాలుగున్నర సంవత్సరాల్లో 130 భారీ, అతిభారీ ప్రాజెక్టులు ఏర్పాటు చేశామని, రూ.69 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని పేర్కొన్నారు. 1.88 లక్షల ఎంఎస్ఎంఇలు కొత్తగా వచ్చాయని వివరించారు. పారిశ్రామికవేత్తలకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా చూడటం ద్వారా మరిన్ని పరిశ్రమలు పెట్టేందుకు ప్రోత్సహించినవారిమవుతామని, ఆ దిశగా అధికారులూ చర్యలు తీసుకోవాలని సూచించారు. పత్తికొండలో అతితక్కువ కాలంలో టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు సిద్ధమవడం అభినందనీయమని అన్నారు. ఎంఎస్ఎంఇ రంగంలో ఫిబ్రవరికి ప్రభుత్వం నుండి ఇన్సెంటివ్‌లు అందిస్తామని సిఎం తెలిపారు.

నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలం దొరువులపాలెంలో రూ.250 కోట్లతో ఎడిబుల్ ఆయిల్ ప్లాంటు, ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం కొమ్మూరు వద్ద రూ.144 కోట్లతో శ్రీవెంకటేశ్వర బయోటెక్ ప్రైవేటు లిమిటెడ్, విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం కోనాడ వద్ద రూ.13 కోట్లతో బ్లూఫిన్ ఎంటర్ ప్రైజెస్ పనులకు సిఎం శంకుస్థాపన చేశారు. అలాగే కర్నూలు జిల్లా పత్తికొండ వద్ద రూ.12 కోట్లతో టమోటా ప్రాసెసింగ్ యూనిట్, విజయనగరం జిల్లా రేగ పంచాయతీలో సెనమీ ప్రాసెసింగ్ యూనిట్‌కు శంకుస్థాపన చేశారు. వీటితోపాటు కర్నూలు జిల్లా ఓర్వకల్లులో సిగాచి ఇండ్రీస్, న్యూట్రాస్యూటికల్ ప్లాంటు, కాకినాడలో ఎస్టేట్ ప్రింటింగ్ క్లస్టర్‌లో కామన్ ఫెసిలిటీ సెంటర్లనూ, అలాగే 18 జిల్లాల్లో 21 చోట్ల ఏర్పాటు చేయనున్న వేర్వేరు ప్రాజెక్టులకూ సిఎం శంకుస్థాపన చేశారు.

## నేడు తెలంగాణలో

# పోలింగ్

**ప్రజాశక్తి- యంత్రాంగం**

తెలంగాణలో గురువారం జరిగే శాసనసభ ఎన్నికలకు ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 35,655 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్‌కు ఇసి చర్యలు తీసుకుంది. బుధవారం సాయంత్రానికే ఎన్నికల సామగ్రితో సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. గురువారం ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ జరగనుంది. తీవ్రవాద ప్రభావమున్న 13 నియోజకవర్గాల్లో ఉదయం ఆరు గంటలకు పోలింగ్ ప్రారంభమై సాయంత్రం నాలుగు గంటలకు ముగియనుంది. పోలింగ్ ప్రక్రియ పరిశీలనకు 22 వేల మంది అబ్జర్వర్లను, స్క్వాడ్లను నియమించారు. పోలింగ్ ప్రక్రియలో 1.85 లక్షల మంది సిబ్బంది పాల్గొంటున్నారు. రాష్ట్రంలో మొత్తం ఓటర్ల 3,26,02,799 మంది. వీరిలో పురుషులు 1,62,98,418 మంది, మహిళలు 1,63,01,705 మంది, ట్రాన్స్‌జెండర్లు 2,676 మంది ఉన్నారు. సర్వీసు ఓట్లు 15,406, ప్రవాస భారతీయుల ఓట్లు 2,944 ఉన్నాయి. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ స్థానాల్లో 2,290 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. వారిలో మహిళలు 221 మంది, పురుషులు 2,068 మంది, ట్రాన్స్‌జెండర్ ఒకరు ఉన్నారు. 80 ఏళ్ల పైబడిన వారికి ఉచిత రవాణా సదుపాయం కల్పిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల బందోబస్తు నిమిత్తం కేంద్ర ఎన్నికల సంఘం 375 కంపెనీల సాయుధ కేంద్ర బలగాలను, రాష్ట్ర ప్రభుత్వం 50 వేల మంది పోలీసులను కేటాయించాయి. డిసెంబరు మూడున ఓట్ల లెక్కింపు జరగనుంది.

**సిద్ధంగా ఎపి పోలీసులు**

గుంటూరు జిల్లా మంగళగిరిలోని పోలీసు హెడ్ క్వార్టర్స్ నుంచి గుంటూరుకు 500 మంది, పల్నాడుకు 400 పోలీసులు బుధవారం చేరుకున్నారు. తెలంగాణ ఎన్నికల దృష్ట్యా అవసరం అయితే అక్కడికి పంపేందుకు పోలీసులను సిద్ధంగా ఉంచామని గుంటూరు ఎస్‌పి సుప్రజ తెలిపారు.

## వాతావరణ మార్పులు

# వణికిస్తున్నాయి

### దేశమంతటా ప్రభావం • పెరుగుతున్న నష్టం

**న్యూఢిల్లీ :** వాతావరణ మార్పులు దేశాన్ని వణికిస్తున్నాయి. కొన్నేళ్ల క్రితం కొన్ని ప్రాంతాలకే వీటి ప్రభావం పరిమితం కాగా, ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. ఏదో రూపంలో వాతావరణ మార్పుల ప్రభావం దేశమంతటా పడుతోంది. నష్టతీవ్రత కూడా గణనీయంగా పెరుగుతోంది. ఈ సంవత్సరానికి సంబంధించిన సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సిఎస్ఇ) సంస్థ తాజాగా విడుదల చేసిన నివేదిక లో ఈ విషయం స్పష్టమౌతోంది. తీవ్రమైన వాతావరణ సంఘటనల కారణంగా చోటుచేసుకుంటున్న ఆస్తి, ప్రాణ నష్టాలు ఏటికేడాది పెరుగుతుండటంతో ప్రభుత్వాలు అనుసరించే విధానాలు కీలకంగా మారనున్నాయి. తాజా నివేదిక ప్రకారం ఈ ఏడాది మొదటి తొమ్మిది నెలల్లో (జనవరి నుండి సెప్టెంబర్ 30వ తేది వరకు) 273 రోజులకు గాను 235 రోజులు తీవ్రమైన ఘటనలు దేశ వ్యాప్తంగా నమోదై నాయి. గత ఏడాది (2022లో) 15 రాష్ట్రాల్లోనే తీవ్రమైన వాతావరణ ఘట నలు నమోదుకాగా, ఈ ఏడాది 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఈ తరహా సంఘటనలు విస్తరించాయి. ఫలితంగా ప్రాణనష్టం పెరిగింది. తెలుగు రాష్ట్రాల పైనా వాతావరణ మార్పుల ప్రభావం తీవ్రంగానే ఉంది. 2022లో ఈ తరహా ఘటనల కారణంగా దేశ వ్యాప్తంగా2,755 మంది మరణించగా ఈ ఏడాది మృతుల సంఖ్య 2,923కుచేరింది. అధికారిక సమాచారం గత ఏడాది మాదిరేఈ సంవత్సరం కూడా 1.84 మిలియన్ హెక్టార్లలో

మిగతా 7లో

**తెలుగు రాష్ట్రాల్లో...**

ఆంధ్రప్రదేశ్‌లో జనవరి నుండి సెప్టెంబర్ 30వ తేది వరకు 273 రోజుల్లో 45 తీవ్ర వాతావరణ ఘటనలు చోటుచేసుకోగా తెలంగాణలో వీటి సంఖ్య 52గా నమోదైంది. వీటికారణంగా ఆంధ్రప్రదేశ్‌లో 45 మంది మరణించగా, తెలంగాణలో 33 మంది మృతి చెందారు. తెలంగాణలో 62,811 హెక్టార్లలో పంట నష్టం సంభవించగా, ఆంధ్రప్రదేశ్‌లో 9015 హెక్టార్ల నష్టం వాటిల్లింది.

### ప్రభావం ఇలా

**2015**

మరత్వాడాలో తీవ్ర కరువు (ఈ తరహాలు ఉపద్రవాలు రెట్టింపు అయ్యే అవకాశం)

**1979-2021**

పశ్చిమ తీర ప్రాంతంలో వాతావరణ మార్పుల కారణంగా పెరిగిన తుపాన్ల ముప్పు (సముద్రాల ఉపరితల వాతావరణంలో తీవ్ర మార్పులు కనిపించాయి. తూర్పు అరేబియా సముద్రంలో తుపాన్ల తీవ్రత పెరిగింది.)

**1995-2023**

భూ తాపంలో పెరుగుదల కారణంగా దేశ మంతా వడగాల్పుల తీవ్రత పెరిగింది. (గత 30 సంవత్సరాల్లో వడగాల్పుల రోజులు దేశమంతా సగటున 2.5 రోజులు పెరిగాయి)

**2022**

గంగా పరివాహక ప్రాంతంలో తుపాన్ల సంఖ్య పెరిగినప్పటికీ, తీవ్రత పెరిగింది. 2050 నాటికి తుపాన్ల తీవ్రత మరింత పెరిగే ప్రమాదం

**2023 జూన్-ఆగస్టు**

వాతావరణ మార్పుల కారణంగా ఉత్తరప్రదేశ్‌లో రెండు రెట్లు పెరిగిన వడగాల్పులు. 11 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో భారీగా పెరిగిన ఉష్ణోగ్రతలు

**2041-2080**

ఉష్ణోగ్రతలు పెరగడంతో భూగర్భ జలాలు క్షీణత మూడు రెట్లు పెరిగే ప్రమాదం.


## నేటి నుండి కాప్ - 28

- వాతావరణ మార్పులపై నేతల చర్చలు

లోపలి పేజీలో..


# రెండ్రోజుల పాటు భారీ వర్షాలు

- రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ఆగ్నేయ బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన అల్పపీడనం పశ్చిమం, వాయువ్య దిశగా కదులుతూ మరింత బలపడిందని, దీని ప్రభావంతో రెండు రోజులపాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం వుందని రాష్ట్ర విపత్తుల సంస్థ మేనేజింగ్ డైరెక్టరు బిఆర్ అంబేద్కర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం గురువారానికి వాయుగుండంగా మారే అవకాశం ఉందని, ఆ తర్వాత వాయువ్య దిశగా కదులుతూ శనివారం నాటికి నైరుతిని ఆనుకుని వున్న ఆగ్నేయ బంగాళాఖాతంలో క్రమంగా తుపానుగా మారే అవకాశం ఉన్నట్లు తెలిపారు. సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులు వెంటనే తిరిగి రావాలని, అలాగే ఆదివారం వరకు వేటకు వెళ్లరాదని సూచించారు.

# అడుగంటిన భూగర్భ జలాలు

- సాగు... తాగు నీటికి కటకట
- వర్షాభావంతో ప్రమాదకర స్థాయికి

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ఈ ఏడాది రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులతో భూగర్భ జలమట్టాలు ప్రమాదకర స్థాయికి పడిపోయాయి. సాధారణంగా ఏప్రిల్, మే నెలల్లో వుండే స్థాయి కంటే దిగువకు నవంబర్‌లోనే అడుగంటిపోవడం ఆందోళన కలిగిస్తోంది. దీంతో రాష్ట్రంలో బోరుబావుల కింద సాగుతో పాటు ప్రజల తాగునీటికి తీవ్రమైన కొరత ముంచుకురానుందని అధికారులు ఆందోళన చెందుతున్నారు.

రాష్ట్ర సగటు భూగర్భ జలాల మట్టం 5.83 మీటర్లు కాగా ప్రస్తుతం 8.53 మీటర్లకు పడిపోయింది. ఈ ఏడాది ఇప్పటిదాకా సగటున 824.83 మిల్లీ మీటర్ల వర్షపాతం కురవాల్సి వుండగా కేవలం 569 మిల్లీమీటర్లు కురిసింది. రాష్ట్రంలో సగటున 31 శాతం లోటు వర్షపాతం నమోదైంది. దీనివల్ల చెరువులు, కుంటలు, సాగునీటి ప్రాజెక్టుల నీటి నిల్వలు తగ్గడంతో భూగర్భ జలాలపైనా ప్రతికూల ప్రభావం చూపింది. రాష్ట్రంలో మేజర్ సాగునీటి ప్రాజెక్టుల్లో 865.64 టిఎంసిల సామర్థ్యం కాగా ప్రస్తుతం 340 టిఎంసిలు మాత్రమే అందుబాటులో వున్నాయి. గతేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులు 717 టిఎంసిలతో కళకళలాడాయి. ప్రస్తుతం ప్రాజెక్టులతో పాటు చెరువుల్లోనూ నీరు తగ్గిపోయింది.

రాష్ట్రంలో వున్న 38,372 చెరువులు నీటి సామర్థ్యం 205.58 టిఎంసిలు కాగా ప్రస్తుతం 93 టిఎంసిలు అందుబాటులో వున్నాయి. 6,166 చెరువుల్లో చుక్కనీరు లేదు. 16 వేల చెరువుల్లో 50 శాతం కంటే తక్కువ నీరుంది. 9,800 చెరువుల్లో మాత్రమే పూర్తిస్థాయిలో నీరు వుంది.

రాష్ట్రంలో గుంటూరు, బాపట్ల, కోనసీమ, ఎన్‌టిఆర్, విజయనగరం జిల్లాలు మినహా అన్ని జిల్లాల్లో భూగర్భ జలాలు ప్రమాదకర స్థాయికి పడిపోయాయి. తూర్పు గోదావరి జిల్లాల్లో అత్యధికంగా 22.81 మీటర్ల దిగువకు పడిపోయాయి. ఏలూరు జిల్లాలో 20.26 మీటర్లు, ప్రకాశం జిల్లాలో 17.96 మీటర్లు. పల్నాడులో 11.62, అన్నమయ్య జిల్లాలో 11.35, సత్యసాయి జిల్లాలో 11.08 మీటర్లు, అనంతపురంలో 9.79, కృష్ణాలో 8.96, పశ్చిమ గోదావరిలో 8.33 మీటర్లకు తగ్గాయి. కడపలో 8.32 మీటర్లకు చేరాయి. రబీ సీజన్‌లో ఎక్కువ ప్రాంతాల్లో పంటల సాగు బోరుబావుల కిందే ఉంది. రాష్ట్రంలో 18.5 లక్షల బోరుబావుల కింద 41 లక్షల ఎకరాల సాగవుతోంది. భూగర్భ జలాలు పడిపోవడంతో పంటలకు నీరందక ఎండిపోతున్న పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రంలో ఇప్పటికే మొదలైన తాగునీటి ఎద్దడి సమస్య రానున్న రోజుల్లో మరింత ఆందోళనకరంగా మారే పరిస్థితులు వస్తాయేమోనని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

## కాంట్రాక్టు ఉద్యోగులు, స్కీం వర్కర్ల

# వేతన బకాయిలు వెంటనే చెల్లించాలి

- ముఖ్యమంత్రికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు లేఖ

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

కాంట్రాక్టు ఉద్యోగులు, స్కీమ్ వర్కర్ల వేతనాలు వెంటనే చెల్లించాలని, ఇప్పటికే అప్పులు చేసి వడ్డీలు కట్టలేక అవస్థలు పడుతున్నారని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు బుధవారం లేఖ రాశారు.

రాష్ట్రంలో నెల వేతనంపైనే ఆధారపడి లక్షల మంది రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, స్కీమ్ వర్కర్స్ జీవిస్తున్నారని, అనేక శాఖల వారికి ఐదు నుండి పదినెలలుగా జీతాలు అందక దుర్భర జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఇంటి అద్దెలు, పెరిగిన కరెంటు ఛార్జీలు, గ్యాస్, పిల్లల స్కూలు ఫీజులు కట్టలేక, అప్పులు పాలై నానా అవస్థలు పడుతున్నారని అన్నారు. సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్టు ఎంప్లాయీస్‌కు మూడు నెలలుగా, దిశ (సఖి) ఉద్యోగులకు 13 నెలలు, నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులకు రెండు నెలలు, గ్రీన్ అంబాసిడర్లకు ఎనిమిది నెలలు, పంచాయతీ వర్కర్స్‌కు 6 నుండి 11 నెలల వేతనాలు చెల్లించలేదని తెలిపారు. అలాగే వైద్యారోగ్యశాఖ క్లాస్-4 కాంట్రాక్టు ఉద్యోగులకు 14 నెలలు, ఆశా వర్కర్లకు మూడు నెలలు, ఎన్‌హెచ్‌ంసిహెచ్‌ఒ ఉద్యోగులకు నాలుగు నెలలు, మధ్యాహ్న భోజనం కార్మికులకు ఐదు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదన్నారు. టిఎ, డిఎ వంటి బిల్లులూ చెల్లించలేకపోతున్నారని పేర్కొన్నారు. రెగ్యులర్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కూడా 10వ తేదీకి గానీ వేతనాలు రావడం లేదని, రాష్ట్ర ప్రభుత్వ స్కీం ఉద్యోగులకు, ఇతర కాంట్రాక్టు ఉద్యోగులకు వెంటనే పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని కోరారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సజావుగా లేకుంటే కేంద్రం నుంచి రావాల్సిన జిఎస్‌టి, రెవెన్యూ బకాయిలు, ఇతర ఆదాయాల కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని నిలదీయాలని సూచించారు. ఢిల్లీ వెళ్లి ప్రధాని, ఇతర మంత్రులను కలిసి వస్తున్నారే తప్ప ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కలిసి గళం విప్పడం లేదని విమర్శించారు.

బడా కార్పొరేట్ సంస్థల నుండి రావాల్సిన పన్నుల బకాయిలను రాబట్టడం లేదని, వారికి అనేక రాయితీలిచ్చి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొన్నారు. రాజధాని మార్పు వంటి అదనపు ఖర్చులతో ఖజానాపై భారం పెరుగుతోందని తెలిపారు. అప్రాధాన్యత కలిగిన వాటికి, అనవసరపు ఖర్చులను తగ్గించుకుని తక్షణం బకాయిలతో సహా ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని శ్రీనివాసరావు కోరారు.

# ఉత్తరాంధ్రకు ఉత్తి మాటలే

- సాగునీటి ప్రాజెక్టులపై చిత్తశుద్ధి కరువు
- పూర్తి చేయడానికి కొత్త గడువులు

లోపలి పేజీలో..

## కెజిబివి పార్ట్‌టైమ్ పిజిటిలకు

# రూ. 26,795

- మిగులు పోస్టుల భర్తీకి చర్యలు
- సమగ్ర శిక్ష డైరెక్టరు శ్రీనివాసరావు


# డ్వాక్రా గ్రూపులకు డ్రోన్లు

- ఉచిత రేషన్ పథకం పొడిగింపు
- 16వ ఆర్థిక సంఘం నివేదికకు ఆమోదం
- కేంద్ర మంత్రివర్గం నిర్ణయాలు

మీడియాతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి అనురాగ్

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

మహిళా స్వయం సహాయ బృందాలు (ఎస్‌హెచ్‌జిస్)కు డ్రోన్‌లను అందించడానికి ఉద్దేశించిన సెంట్రల్ సెక్టార్ పథకానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదాన్ని తెలిపింది. ఈ పథకానికి 2024-25 నుండి 2025-26 మధ్య కాలంలో రూ.1,261 కోట్లు ఖర్చు చేయనుంది. ఈ పథకం 2023-24 నుండి 2025-26 మధ్య కాలంలో రైతులకు వ్యవసాయ సంబంధిత పనులకై అద్దె సేవలను అందించడానికి ఎంపిక చేసిన 15,000 డ్వాక్రా గ్రూపులకు డ్రోన్‌లను సమకూర్చనున్నట్లు పేర్కొంది.

అలాగే ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన (పిఎంజికెఎవై) పథకాన్ని మరో ఐదేళ్ల పాటు పొడిగించాలని కేంద్ర కేబినెట్ నిర్ణయించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన బుధవారం నాడిక్కడ సమావేశమైన కేబినెట్ పలు నిర్ణయాలు తీసుకుంది.

దేశంలో 81.35 కోట్ల మంది నిరు పేద ప్రజలకు ఇచ్చే ఐదు కిలోల ఉచిత రేషన్ పథకం 2024 జనవరి 1 నుంచి అమల్లోకి వస్తుంది. పిఎంజికెఎవై కింద అంత్యోదయ అన్నయోజన (ఎఎవై) హౌస్‌హోల్డ్స్, ప్రియారిటీ హౌస్ హెల్డ్స్ (పి హెచ్ హెచ్) లబ్ధిదారులకు ఏడాది పాటు ఉచితంగా ఆహార ధాన్యాలు అందించే ఈ పథకం 2023 జనవరి 1న ప్రారంభించారు. ఐదేళ్ల కాలంలో రూ.11.80 లక్షల కోట్ల వ్యయంతో ఈ పథకం అమలు కానుంది.

కేబినెట్ నిర్ణయాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ మీడియాకు వెల్లడిస్తూ, . ఉచితంగా సరఫరా చేసే ఆహార ధాన్యాలు (బియ్యం, గోధుమలు, ముతక ధాన్యాలు, చిరుధాన్యాలు) ఆహార భద్రతను పటిష్టం చేస్తాయన్నారు. జనాభాలోని పేద, బలహీన వర్గాలకు చెందిన ప్రజల ఆర్థిక సమస్యలు తగ్గుతాయని తెలిపారు. ఒకే విధమైన లోగో కింద దేశంలో ఐదు లక్షలకు పైగా సరసమైన ధరల దుకాణాలతో అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో ఉచితంగా ఆహార ధాన్యాల పంపిణీ జరుగుతుందన్నారు. పేదరికపు రేఖకు ఎగువకు చేరిన వారి సంఖ్య గత ఐదేళ్లలో 13.50 కోట్లకు పెరిగిందని చెప్పారు. ఇది మోడీ ప్రభుత్వం సాధించిన ఘనతగా చెప్పారు. కోవిడ్ మహమ్మారి సమయంలో ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన ప్రవేశపెట్టారని, దీనిని 2024 జనవరి 1 నుంచి ఐదేళ్ల పాటు ఈ పథకాన్ని పొడిగించాలని నిర్ణయించారని తెలిపారు.

**16వ ఆర్థిక సంఘం నిబంధనలకు ఆమోదం**

16వ ఆర్థిక సంఘానికి సంబంధించిన నిబంధనలను కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. 16వ ఫైనాన్స్ కమిషన్‌కు సంబంధించిన నియమ, నిబంధనలు నిర్ణీత సమయంలో తెలియజేయబడతాయి. 16వ ఆర్థిక సంఘం సిఫార్సులు, ప్రభుత్వం ఆమోదించిన తర్వాత 2026 ఏప్రిల్ 1 నుండి ప్రారంభమయ్యే ఐదేళ్ల కాలవ్యవధిని కవర్ చేస్తుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 280(1) ప్రకారం కేంద్రం, రాష్ట్రాల మధ్య పన్నుల నికర రాబడి పంపిణీపై సిఫార్సు చేయడానికి ఫైనాన్స్ కమిషన్ ఏర్పాటుకు సంబంధించిన విధానాలు ఉన్నాయి. అటువంటి రాబడిలో సంబంధిత వాటాల రాష్ట్రాల మధ్య కేటాయింపు, గ్రాంట్స్-ఇన్-ఎయిడ్, రాష్ట్రాల ఆదాయాలు, అవార్డు వ్యవధిలో పంచాయతీల వనరులకు అనుబంధంగా అవసరమైన చర్యలు వివరించబడ్డాయి.

15వ ఫైనాన్స్ కమిషన్ 2017 నవంబర్ 27న ఏర్పాటైంది. ఇది తన మధ్యంతర, తుది నివేదికలతో 2020 ఏప్రిల్ 1 నుండి ప్రారంభమయ్యే ఆరు సంవత్సరాల కాలానికి సంబంధించిన సిఫార్సులను చేసింది. 15వ ఆర్థిక సంఘం సిఫార్సులు 2025-26 ఆర్థిక సంవత్సరం

మిగతా 7లో

# రెండేళ్లుగా బిల్లులను ఎందుకు తొక్కిపట్టారు?

- శాసన తయారీకి అడ్డుపడడమే పనా!
- ఇటువంటి చర్యలను అనుమతించం
- కేరళ గవర్నర్‌కు సుప్రీం సీరియస్ వార్నింగ్

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

కేరళ శాసనసభ ఆమోదించిన బిల్లులను ఏళ్ల తరబడి తొక్కిపట్టిన గవర్నర్ అరిఫ్ మహ్మద్ ఖాన్ చర్యను సుప్రీం కోర్టు తీవ్రంగా ఆక్షేపించింది. శాసన తయారీ ప్రక్రియను పాజ్ చేసే అధికారం గవర్నరకు లేదని స్పష్టం చేసింది. ఇటువంటి చర్యలను ఎంతమాత్రం అనుమతించబోమని చీఫ్ జస్టిస్ డి వై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీం ధర్మాసనం తేల్చి చెప్పింది. విచారణ జరగడానికి ముందు రోజు గవర్నరు ఒక బిల్లును ఆమోదించి, మిగతా ఏడు బిల్లులను రాష్ట్రపతి పరిశీలనకు నివేదించారని అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి బుధవారం కోర్టుకు తెలియజేశారు. దీనిపై స్పందించిన సుప్రీం కోర్టు "రెండేళ్లుగా గవర్నర్ ఏం చేస్తున్నారు? బిల్లులు ఎందుకు నిలిపిఉంచారు?. ఇంతకాలం పాటు బిల్లులను తొక్కిపట్టడానికి కారణం ఎందుకు చెప్పలేదు అని ప్రశ్నించింది. ఈ వ్యవహారంలో కోర్టు జోక్యం చేసుకోవడంతో బిల్లులను రాష్ట్రపతికి పంపారు. చట్టాలను రూపొందించే శాసనసభల అధికారాల్లో జోక్యం చేసుకునే విధంగా గవర్నర్ అధికారాలను దుర్వినియోగం చేయరాదు. గవర్నర్‌కు రాజ్యాంగ బాధ్యత ఉంది. అది నెరవేరలేదని తేలితే కోర్టు జోక్యం చేసుకోవాల్సి ఉంటుంది. లేకుంటే ప్రజలే మనల్ని అడుగుతారు" అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ తీవ్రంగా మండిపడ్డారు.

రాష్ట్ర అసెంబ్లీ అమోదించిన బిల్లులకు అంగీకారం తెలపకుండా గవర్నర్ ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేస్తున్నారని కేరళ ప్రభుత్వ తరపు న్యాయవాది కె కె వేణుగోపాల్ వాదించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 ప్రకారం, బిల్లులపై గవర్నర్లు నిర్ణయాలు తీసుకునే విషయంలో సుప్రీంకోర్టు స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేయాలన్న డిమాండ్‌ను పరిశీలిస్తామని సుప్రీంకోర్టు పేర్కొంది. గవర్నర్ తీరులో మార్పు రాకుంటే ఆయనకు మార్గదర్శకాలు జారీ చేసేందుకు వెనుకాడబోమని

మిగతా 7లో

## అంగన్‌వాడీల ఆహారంలో నాణ్యతాలోపం

- చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి ఐద్వా లేఖ

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

అంగన్వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న ఆహారంలో కల్తీలు, పురుగు మందులు, నాణ్యతాలోపంతో ఉన్నాయని, తీవ్ర నిర్లక్ష్యం కొనసాగుతోందని, దీనిపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఐద్వా రాష్ట్ర కమిటీ కోరింది. ఈ మేరకు రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి బుధవారం ముఖ్యమంత్రికి లేఖ రాశారు. లబ్ధిదారులందరికీ సరుకులు సరఫరా చేయడం లేదని పేర్కొన్నారు. అక్టోబరు నెలలో చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో ఖర్జూరం ప్యాకెట్లో పాము కళేబరం ఉన్నట్లు వార్తలు వచ్చాయని తెలిపారు. దీన్ని రబ్బరు ముక్కని అధికారులు తేల్చారని పేర్కొన్నారు. అయినా కాంట్రాక్టరును కొనసాగిస్తున్నారని వివరించారు. రాగిపిండిలో పురుగులు వస్తున్నాయని, అటుకులలో ఇసుక ఉంటోందని, చిక్కీలు మెత్తగా ఉంటున్నాయని పేర్కొన్నారు. పాలు కూడా కొన్నిసార్లు లేటుగా సరఫరా చేయడంతో పాడవుతున్నాయని వివరించారు. కోడిగుడ్లు చిన్నసైజులో ఉంటున్నాయని వివరించారు. 25 రోజులకు సరిపడా ఆహారం సరఫరా చేయాల్సి ఉండగా, 15 నుంచి 20 రోజులకు సరిపడా మాత్రమే ఇస్తున్నారని పేర్కొన్నారు. దీనివల్ల బాలింతలు, గర్భిణులు, పిల్లలకు పోషకాహారం అందించాలనే ఉద్దేశం నెరవేరడం లేదని అన్నారు. వీటిపై వెంటనే విచారణ చేయించి లబ్ధిదారులకు అనుగుణంగా నాణ్యమైన ఆహారాన్ని సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006**

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501**కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

## ఆర్‌టిఐ వెబ్ పోర్టల్ ఏర్పాటు చర్యలు చెప్పండి : హైకోర్టు

**ప్రజాశక్తి-అమరావతి**

సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ) ప్రకారం పౌరులు సమాచారం తెలుసుకునేందుకు ఆర్‌టిఐ వెబ్ పోర్టల్‌ను ఏర్పాటు చేయాలన్న సుప్రీంకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని రాష్ట్రానికి హైకోర్టు ఆదేశించింది. వెబ్ పోర్టల్ ఏర్పాటు అంశంపై స్థాయీ నివేదిక ఇవ్వాలంది. విచారణను 4 వారాలకు వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ దీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశించినా రాష్ట్ర ఆర్‌టిఐ వెబ్‌పోర్టల్‌ను ఏర్పాటు చేయలేదని పేర్కొంటూ హైకోర్టు న్యాయవాది వివిఎస్ఎస్ శ్రీకాంత్ దాఖలు చేసిన పిల్ బుధవారం విచారణకు వచ్చింది.

## ప్రభుత్వ కార్యక్రమంలో అధికారులు పాల్గొనకుండా ఉత్తర్వులివ్వలేం : హైకోర్టు

**ప్రజాశక్తి-అమరావతి**

రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి.. పేరిట రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమంలో అధికారులు పాల్గొనకుండా ఉత్తర్వుల జారీకి హైకోర్టు నిరాకరించింది. ఆ కార్యక్రమానికి ప్రభుత్వ ధనాన్ని ఖర్చు చేయకుండా ఉత్తర్వులు ఇవ్వాలన్న పిటిషనర్ల అభ్యర్థనను కూడా తోసిపుచ్చింది. ప్రభుత్వం చేసిన పనుల గురించి ప్రజలకు చెప్పుకుంటే తప్పు ఏమిటని ప్రశ్నించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలన్నీ చేసిన పనుల పురోగతి గురించి పత్రికల్లో ప్రకటనలూ ఇస్తున్నాయని గుర్తు చేసింది. కార్యక్రమంపై ఏ విధమైన మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయలేమని హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన ధర్మాసనం తేల్చి చెప్పింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి నోటీసులు జారీ చేసింది. రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి.. కార్యక్రమం తొలుత వైసిపి కార్యక్రమంగా సజ్జల ప్రకటించారని, తర్వాత దానిని అధికారిక కార్యక్రమంగా మార్పు చేయడాన్ని సవాల్ చేస్తూ కట్టెపోగు వెంకయ్య పిల్ దాఖలు చేశారు. తదుపరి విచారణను హైకోర్టు నాలుగు వారాలకు వాయిదా వేసింది.

## నేడు ఎఆర్ఆర్ సమర్పించనున్న డిస్కంలు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి)కి 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆదాయ వార్షిక నివేదిక (ఎఆర్ఆర్)లను మూడు విద్యుత్ పంపిణీ సంస్థలు (ఎపిఇపిడిసిఎల్, ఎపిఎస్‌పిడిసిఎల్, ఎపిసిపిడిసిఎల్) సమర్పించనున్నాయి. ఎపిఇఆర్‌సి ఛైర్మన్ నాగార్జునరెడ్డి, ఇతర అధికారులు గురువారం గుంటూరులో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా గుంటూరులోనే పంపిణీ సంస్థల అధికారులు కలిసి ఎఆర్ఆర్‌ను సమర్పించనున్నారు.

# కర్నూలును కరువు జిల్లాగా ప్రకటించండి

- ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాల లోగో ఆవిష్కరణ

**ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్**

కర్నూలు జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి సహాయక చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాల ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాల లోగోను బుధవారం నగరంలోని కార్మిక కర్షక భవన్‌లో ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్‌రెడ్డి, చీఫ్ ప్యాట్రన్స్ శివరాం ప్రసాద్, మల్లెలపుల్లారెడ్డి, జి.రామకృష్ణ, ఇరిగినేని పుల్లారెడ్డి, జెఎన్.శేషయ్య, జె.నాగేశ్వరరావు, టి.రాముడు ఆవిష్కరించారు. డిసెంబర్ 15, 16, 17న నిర్వహించే ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని కోరారు.

ఈ సందర్భంగా కె.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. కర్నూలు జిల్లాల్లో కరువు విలయతాండవం చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో 400 మండలాల్లో కరువు పరిస్థితులు ఉంటే కేవలం 103 మండలాలను మాత్రమే ప్రకటించడం సరికాదన్నారు. ప్రభుత్వం పునః పరిశీలించి గ్రామాల వారీగా అధ్యయనం చేసి కరువు మండలాలను ప్రకటించాలని కోరారు. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని కరువు సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 15న ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సందర్భంగా బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఆహ్వాన సంఘం నాయకులు శివరాం ప్రసాద్ మాట్లాడుతూ.. కృష్ణ, తుంగభద్ర నదులు ఉన్నప్పటికీ నీటిపారుదల రంగాన్ని పాలకులు విస్మరించడం వల్లే ప్రస్తుతం ఈ పరిస్థితి నెలకొందన్నారు. మల్లెలపుల్లారెడ్డి మాట్లాడుతూ.. రైతును విస్మరించడం వల్లనే అప్పులపాలై చాలామంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జి. రామకృష్ణ మాట్లాడుతూ.. డిసెంబర్ 15న జరిగే ర్యాలీ, బహిరంగ సభలను జయప్రదం చేయాలని కోరారు.

ఎఐకెఎస్ లోగోను ఆవిష్కరిస్తున్న నాయకులు

## కెజిబివి పార్ట్‌టైమ్ పిజిటిలకు రూ.26,795

- మిగులు పోస్టుల భర్తీకి చర్యలు
- సమగ్ర శిక్ష డైరెక్టరు శ్రీనివాసరావు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు (కెజిబివి)లో పనిచేస్తున్న పార్ట్‌టైమ్ పిజిటిల వేతనాన్ని రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. ప్రస్తుతం రూ.12 వేలుగా ఉన్న వేతనాన్ని రూ.26,795లకు పెంచుతున్నట్లు సమగ్ర శిక్ష డైరెక్టరు బి శ్రీనివాసరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వారానికి 24 పీరియడ్‌లకు మించి తీసుకుంటున్న వారికి మాత్రమేనని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పెరిగిన వేతనం డిసెంబరు నుంచి అమల్లోకి వస్తుందని తెలిపారు. అలాగే కెజిబివిల్లో మిగిలిన పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని అన్ని జిల్లాల విద్యాశాఖ అధికారులు, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్స్‌కు మరో ఆదేశాలు జారీ చేశారు. ఈ ఏడాది మేలో 1,555 పోస్టుల భర్తీకి సమగ్ర శిక్ష నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్‌లో 176 పోస్టులు భర్తీ కాలేదు. గతంలో వచ్చిన దరఖాస్తులు ఆధారంగా మెరిట్ జాబితాను ప్రకటించి డిసెంబరు 4లోపు భర్తీ చేయాలని తెలిపారు.

## కలెక్టర్ల తీరు సరికాదు

- ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలి
- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారితో టిడిపి

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ప్రభుత్వ కుట్రలకు వత్తాసు పలుకుతూ వైసిపి కార్యకర్తలకంటే దారుణంగా 8 జిల్లాలకు చెందిన కలెక్టర్లు పనిచేస్తున్నారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు విమర్శించారు. శ్రీకాకుళం, అంబేద్కర్ కోనసీమ, గుంటూరు, బాపట్ల, నెల్లూరు, అనంతపురం, అన్నమయ్య, తిరుపతి జిల్లాల కలెక్టర్లు పూర్తిగా లొంగిపోయారని ఆరోపించారు. ఈ అంశంపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనాను టిడిపి నాయకులతో కలిసి సచివాలయంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కలెక్టర్ల పనితీరుపై ఆధారాలతో సహా మీనాకు ఫిర్యాదు చేశామన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో ఉన్న 20 వేల బోగస్ ఓట్లను తక్షణమే తొలగించాలని తమ పార్టీ ఇన్‌ఛార్జి పరిటాల సునీత ఫిర్యాదు చేస్తే అనంతపురం కలెక్టరు పట్టించుకోలేదని తెలిపారు. రాష్ట్రంలో దాదాపు 11 లక్షల వరకు ఇలాంటివి ఉన్నాయని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పనిచేసే అధికారి, కలెక్టర్లకు మెమోలు ఇస్తామని మీనా హామీ ఇచ్చారని తెలిపారు. అనంతపురం జిల్లా కలెక్టరు నియోజకవర్గానికో విధంగా నిబంధనలు మారుస్తున్నారని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు, ఎమ్మెల్సీ అశోక్ బాబు, మాజీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## అడవిలో దారి తప్పిన అయ్యప్ప భక్తులు

- 11మందిని కాపాడిన పోలీసులు, స్థానికులు

**ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి**

నెల్లూరు జిల్లా రాపూరు మండలం పెంచలకోన జలపాతం వద్ద స్నానాలు ఆచరించడానికి వెళ్లిన అయ్యప్ప భక్తులు అడవిలో దారి తప్పిపోయారు. మీడియాలో విస్తృత ప్రచారమవ్వడంతో పోలీసులు, స్థానికులు గాలింపు చర్యలు చేపట్టి..ఎట్టకేలకు వారిని క్షేమంగా బయటకు తీసుకువచ్చారు. పోలీసుల వివరాల మేరకు.. బుచ్చిరెడ్డిపాళెం, గొలగమూడి, గూడూరు, నెల్లూరు ప్రాంతానికి చెందిన 15 మంది అయ్యప్ప భక్తులు బుధవారం మధ్యాహ్నం పెంచల కోనవెళ్లారు. దేవాయలం వెనుక మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న జలపాతం వద్ద స్నానాలు ఆచరించడానికి వెళ్లారు. జలపాతం చేరుకున్న తర్వాత వరద ఉధృతి అధికమవ్వడంతో అక్కడి ఉండిపోయారు. మరోవైపు చీకటి పడుతుండడంతో తలోదారిన అక్కడి నుంచి బయలుదేరారు. నలుగురు సురక్షితంగా పెంచలకోన చేరుకున్నారు. 11 మంది దారి తప్పిపోయారు. ఎటు వెళ్లాలో తెలియక తమ బంధువులకు సమాచారం ఇచ్చారు. పెంచలకోనలో 11 మంది గల్లంతు అయినట్లు మీడియాలో ప్రచారమవ్వడంతో పెంచలకోన అవుట్ పోస్టు సిబ్బంది, స్థానికులు గాలింపు చర్యలు చేపట్టారు. అడవిలో చిక్కుకున్న స్వాములను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఎలాంటి ప్రమాదమూ జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

## నండూరి సేవలు అజరామరం

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

సిపిఎం కేంద్ర కమిటీ మాజీ సభ్యులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సిఐటియు వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ నండూరి ప్రసాదరావు సమసమాజ స్థాపన కోసం, కార్మికవర్గ రాజ్యం కోసం సాగించిన సిద్ధాంత బాటలో ముందుకు వెళ్లడమే ఆ మహనీయునికిచ్చే నివాళి అని సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నరసింగరావు పేర్కొన్నారు.

విజయవాడలోని సిఐటియు రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఎవి నాగేశ్వరరావు అధ్యక్షతన నండూరి 22వ వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. కార్మికోద్యమానికి ఆయన చేసిన కృషిని వివరించారు. కార్మికోద్యమ నిర్మాతల్లో అగ్రగణ్యులని, చట్ట సభల్లో కార్మిక వాణిని వినిపించిన నేత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి అజయ్‌కుమార్, సిఐటియు నాయకులు పాల్గొన్నారు. అంతకముందు నండూరి చిత్రపటానికి సిహెచ్ నరసింగరావు పూలమాల వేసి నివాళు లర్పించారు.

## ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

- ముఖ్యమంత్రికి ఆప్కాస్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ లేఖ

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో పనిచేస్తున్న ఆప్కాస్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని, ఈలోగా కాంట్రాక్టు పద్ధతిలోకి మార్చాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆప్కాస్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ కోరింది. ఈ మేరకు ముఖ్యమంత్రికి బుధవారం ఫెడరేషన్ గౌరవాధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు పి వెంకటసుబ్బయ్య, రజిని లేఖ రాశారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ మినిమం టైంస్కేల్ అమలు చేయాలని, మూడేళ్లు పూర్తి చేసుకున్న వారిని కాంట్రాక్టులోకి మార్చాలని, సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. ప్రతి ఆరు నెలలకూ కరువుభత్యం చెల్లించి, సిక్ లీవులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కారుణ్య నియామకాలు ఇవ్వాలని, రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచాలని కోరారు. ఆప్కాస్‌లో చేర్చని వారిని అందులో చేర్చాలని, శానిటేషన్, సెక్యూరిటీ, తదితర ఏజెన్సీలను రద్దుచేసి ఉద్యోగులందరినీ ఆప్కాస్‌లో చేర్చి వారందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. అలాగే 2014 నుంచి పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడాన్ని ఫెడరేషన్ తరపున స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు. అదే పద్ధతిలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులనూ చేర్చాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 2.5 లక్షల మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు 17 ఏళ్ల నుంచి చాలీచాలని జీతాలతో పనిచేస్తున్నారని, ఉద్యోగం ఎప్పుడు పోతుందో కూడా తెలియని అభద్రతాభావంలో పనిచేస్తున్నారని వివరించారు. ఆప్కాస్‌ను తీసుకురావడం వల్ల దళారులు లేకుండా చేశారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందరినీ రెగ్యులరైజ్ చేస్తుందన్న ఆశతో ఎదురుచూస్తున్న సమయంలో తక్కువ వేతనాలతో కూడిన జిఓ ఇచ్చారని, ఇప్పటికైనా స్పందించి వారికి న్యాయం చేయాలని కోరారు.

## ఓటర్ల జాబితాలో అవకతవకలు

- సిఇఒ ముఖేష్‌కుమార్ మీనాకు వైసిపి ఫిర్యాదు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రాష్ట్రంలో ఓటర్ల జాబితాలో బోగస్ ఓటర్లు పెద్ద సంఖ్యలో వున్నారని, తక్షణం వాటిని తొలగించాలని వైసిపి ఫిర్యాదు చేసింది. రాష్ట్ర సచివాలయంలో ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనాను వైసిపి తరపున రాష్ట్ర మంత్రులు మేరుగ నాగార్జున, జోగి రమేష, మండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మల్లాది విష్ణు బుధవారం కలిసి ఫిర్యాదు చేశారు. ఓటర్ల జాబితాలో చోటుచేసుకున్న అవకతవకలు, డూప్లికెట్ ఓట్లు, తెలంగాణలో ఓట్లు కలిగి వుండటం వంటి అంశాలపై ఫిర్యాదు చేశారు. అనంతరం మంత్రులు మేరుగ నాగార్జున, జోగి రమేష్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో రెండుచోట్ల 16 లక్షల మందికి ఓట్లు వున్నట్లు గుర్తించామని తెలిపారు. వాటిపై చర్యలు తీసుకోవాలని కోరామన్నారు.

## నేడు వేతనంతో కూడిన సెలవు

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

తెలంగాణలో ఓటు హక్కు కలిగి ఉండి, రాష్ట్రంలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఈ నెల 30న వేతనంతో కూడిన సెలవును మంజూరు చేసినట్లు సిఇఒ ముకేష్‌కుమార్ మీనా పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం ఇవ్వాలని ఉద్యోగ సంఘాల నుంచి వచ్చిన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## 3 నెలల్లో భవన నిర్మాణాలు పూర్తి

- సిఎస్ కెఎస్ జవహర్‌రెడ్డి

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

రాష్ట్ర వ్యాప్తంగా మంజూరు చేసిన గ్రామ సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ ఆరోగ్య కేంద్రాల భవనాలు రానున్న మూడు నెలల్లో పూర్తి చేయాలని అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. జల్ జీవన్ మిషన్, ప్రాధాన్యత భవన నిర్మాణాలపై బుధవారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్దిష్ట గడువులోగా పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ ప్రాధాన్యత భవనాల ప్రగతినిరాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి రాజశేఖర్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్‌శాఖ కమిషనరు సూర్యకుమారి, ఇఎన్‌సి బి బాలునాయక్, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఎన్‌సి ఆర్‌వి కృష్ణారెడ్డి, సిఇ బి రాజు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎమ్‌టి కృష్ణబాబు, ఆర్థికశాఖ కార్యదర్శి కెవివి సత్యనారాయణ, వైద్యారోగ్యశాఖ కమిషనరు జె నివాస్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ తీరుపై గొంతెత్తుదాం

- ఎపి సర్పంచుల సంఘం, పంచాయతీరాజ్ ఛాంబర్

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

గ్రామాలను, ప్రజలను అభివృద్ధికి నోచుకోనివ్వకుండా అడ్డుపడుతున్న ప్రభుత్వ తీరుపై గొంతెత్తి, పాలకులను నిలదీద్దామని ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంఘం, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ ఉమ్మడిగా పిలుపునిచ్చాయి. ప్రస్తుత, మాజీ పంచాయతీరాజ్ ప్రతినిధులకు, ప్రజలకు పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు వైబి రాజేంద్రప్రసాద్, సర్పంచుల సంఘం అధ్యక్షులు వి లక్ష్మీముత్యాలరావు బుధవారం లేఖ రాశారు. గ్రామ స్వరాజ్యానికి కారణమైన పంచాయతీ వ్యవస్థను వైఎస్ జగన్ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని విమర్శించారు. స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులను ఉత్సవ విగ్రహాలుగా మార్చి వారిపై పెత్తనం చేస్తోందని పేర్కొన్నారు. గ్రామాల్లో మంచినీటి సరఫరా లేదని, గుంతలు పడిన రోడ్ల వల్ల ప్రజలు అవస్థలు పడుతున్నారని తెలిపారు. కనీసం చెడిపోయిన మంచినీటి మోటార్లను, వీధి బల్బులను బాగు చేయించడానికి కూడా సర్పంచుల వద్ద డబ్బుల్లేవని వివరించారు. స్వతంత్రంగా ఉండాల్సిన గ్రామ పంచాయతీ ఖాతాలన్నీ ప్రభుత్వ ఆధీనంలోకి వెళ్లిపోయాయన్నారు. ఈ నియంత పాలనకు చరమగీతం పాడేందుకు అందరం ఏకమవ్వాలని కోరారు.

## 'ఉండవల్లి' పిటిషన్‌పై విచారణ వాయిదా

**ప్రజాశక్తి-అమరావతి**

స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం దర్యాప్తును సిబిఐకి అప్పగించాలని కోరుతూ మాజీ ఎంపి ఉండవల్లి అరుణ్‌కుమార్ దాఖలు చేసిన పిల్‌పై విచారణ డిసెంబర్ 13కు వాయిదా పడింది. ఈ పిల్‌లో ఇప్పటికే నోటీసులు అందుకున్న ప్రతివాదులు కౌంటర్ దాఖలు చేయాలంది. నోటీసులు అందుకోని వారికి పిటిషనర్ ఉండవల్లి స్వయంగా అందజేసేందుకు అవకాశం కల్పించింది. ఈ మేరకు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ మండవ కిరణ్మయితో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. సిఐడి వద్ద అడ్రస్‌లు ఉంటాయని, సిఐడి ద్వారా నోటీసులు జారీకి ఉత్తర్వులు ఇవ్వాలని ఉండవల్లి తరపున సీనియర్ న్యాయవాది కెజి కృష్ణమూర్తి చేసిన వినతిని హైకోర్టు తోసిపుచ్చింది.

మురుగు నీటిని శుభ్రం చేసే వాహనాలు
(ఇన్‌సెట్‌లో) వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న సిఎం జగన్

## మురుగునీటి శుద్ధి వాహనాలను ప్రారంభించిన సిఎం

**ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి**

స్వచ్ఛత ఉద్యమి యోజన పథకం కింద స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా ఎంపిక చేయబడిన లబ్ధిదారులకు వంద మురుగు శుద్ధి వాహనములను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం అందజేశారు. తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయం వద్ద ఈ వాహనాలను ఆయన లాంఛనంగా జెండా ఊపి ప్రారంభించారు. వివిధ మున్సిపాలిటీల్లో మురుగునీటి శుద్ధి కోసం ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా మహిళలకు బ్యాంకుల నుంచి రుణం ఇప్పించి వాహనాల కొనుగోలుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున, పార్లమెంట్ సభ్యులు వి.విజయసాయిరెడ్డి, నందిగం సురేష్, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ స్పెషల్ సిఎస్ వై.శ్రీలక్ష్మి, సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి, గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, ఐజి పాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేటీకరించొద్దు

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

**ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖ)**

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో చేపట్టిన దీక్షలు బుధవారం నాటికి 1021వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ కోక్ ఓవెన్ విభాగ కార్మికులు కూర్చున్నారు. దీక్షలనుద్దేశించి పోరాట కమిటీ నాయకులు మోహిద్దీన్, జె.రామకృష్ణ మాట్లాడుతూ.. పోరాట కమిటీ నిర్ణయాలను తప్పకుండా అమలు చేయాలని కార్మికులను కోరారు. స్టీల్‌ప్లాంట్ అమ్మకం నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకునే వరకూ ఈ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. దీక్షా శిబిరంలో కోకో ఓవెన్ విభాగ అఖిలపక్ష కార్మిక నాయకులు దేవుడునాయుడు, సోమేష్, నర్సింగరావు, కార్మికులు పాల్గొన్నారు.

## కోర్టుకు జగన్ హాజరై సాక్ష్యం చెప్పాలి

- కెవిపిఎస్ డిమాండ్

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై జరిగిన దాడి కేసులో కోర్టుకు హాజరై సాక్ష్యం చెప్పాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓ నల్లప్ప అంద్ర మాల్యాద్రి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దాడి కేసులో నిందితుడైన దళితుడు జనపల్లి శ్రీనివాసరావు బెయిల్ రాక ఐదేళ్లుగా రిమాండ్ ఖైదీగా జైల్లో మగ్గుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసులో విచారణ పూర్తయిందని, మరోసారి అవసరం లేదని ఎన్‌ఐఎ కోర్టుకు తెలిపిందని తెలిపారు. కేసు ట్రయల్ ముగిసేంత వరకు నిందితుడిని బెయిల్‌పై వెంటనే విడుదల చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటనలో కుట్ర జరిగి ఉంటే ఎవరు చేశారు? ఎందుకు చేయించారన్నది ఎన్‌ఐఎ బయటపెట్టాలన్నారు. ఎమ్మెల్సీ అనంతబాబు తన డ్రైవరు దళితుడైన సుబ్రమణ్యాన్ని హత్య చేసి శవాన్ని డోర్ డెలివరీ చేశారని గుర్తుచేశారు. ఎలాంటి శిక్ష లేకుండా దర్జాగా సిఎం బస్సుల్లో అనంతబాబు తిరుగుతుంటే అమాయకుడైన శ్రీనివాసరావు ఐదేళ్లుగా జైల్లో ఉండాలా? అని ప్రశ్నించారు. మళ్లీ దర్యాప్తు కోరడం వెనుక నిందితుడిని శాశ్వతంగా జైల్లో ఉంచాలన్న కుట్ర దాగి ఉందని విమర్శించారు. రాజకీయ క్రీడల్లో దళితులను బలి పశువులను చెయ్యొద్దని, వెంటనే శ్రీనివాసరావుకు బెయిల్ వచ్చేందుకు దోహద పడాలని కోరారు.

## రుషికొండపై నిర్మాణాల నిలిపివేత ఉత్తర్వులకు హైకోర్టు నిరాకరణ

**ప్రజాశక్తి-అమరావతి**

విశాఖపట్నంలోని రుషికొండపై నిర్మాణాల నిలుపుదల ఉత్తర్వుల జారీకి హైకోర్టు నిరాకరించింది. పర్యాటకశాఖ రిసార్ట్ పునరుద్ధరణ పనులను, నిర్మాణాలు ఉల్లంఘనకు పాల్పడిందీ లేనిదీ పరిశీలించే నిమిత్తం కేంద్ర ప్రభుత్వ కమిటీ నివేదిక ఇవ్వాల్సివుందని గుర్తు చేసింది. ఆ నివేదిక వచ్చాకే ఏం చేయాలో నిర్ణయిస్తామని చెప్పింది. ఉల్లంఘనల గురించి కమిటీకి చెప్పేందుకు అనుమతినివ్వాలన్న పిటిషనర్ల అభ్యర్థనను తోసిపుచ్చింది. కమిటీ నిర్ణయం తీసుకునే వరకు వేచి ఉండాలని స్పష్టం చేసింది. డిసెంబరు మొదటి వారంలో కేంద్ర ప్రభుత్వ కమిటీ రుషికొండను సందర్శించి నిర్మాణాలను పరిశీలించి నివేదిక ఇస్తుందని కేంద్ర ప్రభుత్వ కౌన్సిల్ జూపూడి యజ్ఞదత్ చెప్పారు. దీంతో విచారణను డిసెంబరు 27కు వాయిదా వేస్తున్నట్లు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ప్రకటించింది.

యందాడ గ్రామంలోని సర్వే నెంబరు 19 పరిధిలోని కోస్టల్ రెగ్యులేషన్ జోన్‌లో చెట్ల నరికివేత, భూమి తవ్వకాలకు అనుమతినివ్వడం కేంద్ర అటవీ, పర్యావరణ చట్టాలకు, విశాఖపట్నం పట్టణ ప్రాంతాభివృద్ధి సంస్థ మాస్టర్ ప్లాన్‌లకు వ్యతిరేకమని దాఖలైన పిల్స్‌ను హైకోర్టు విచారణ జరిపింది.

## డిప్యూటీ సిఎం 'కొట్టు'పై పిల్ డిస్మిస్

### పిటిషనర్‌కు రూ.50 వేలు జరిమానా

**ప్రజాశక్తి-అమరావతి**

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ, ధర్మదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణపై టిడిపి నేత వలవల మల్లికార్జునరావు దాఖలు చేసిన పిల్‌ను హైకోర్టు కొట్టేసింది. రాజకీయ ప్రేరేపితంగా పిల్ దాఖలు చేశారని పిటిషనర్‌కు రూ.50 వేలు జరిమానా విధించింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం తీర్పు చెప్పింది. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని కడకట్ల గ్రామం గణేష్ నగర్ నుంచి జాతీయ రహదారి వరకు కొత్త రోడ్డు నిర్మాణం కోసం టెండర్లను పిలిచారు. దీనిపై పిటిషనర్ అనేక సందేహాలను లేవనెత్తుతూ ఆఫీసర్లకు వినతిపత్రాలు ఇచ్చారు. వాటిని ఆఫీసర్లు పట్టించుకోలేదంటూ పిటిషనర్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. మంత్రి కొట్టు సత్యనారాయణ భూముల కోసమే రోడ్డు నిర్మాణం చేస్తున్నారని పిటిషనరు వాదన. జాతీయ రహదారితో అనుసంధానం కోసం రోడ్డు నిర్మాణం చేస్తున్నారని హైకోర్టు తేల్చి చెప్పింది. కోర్టు సమయాన్ని వృథా చేసినందుకు పిటిషనరుకు రూ.50 వేలు జరిమానా విధిస్తున్నట్లు తెలిపింది.

## ఎయు విసి నియామకాల ప్రక్రియ నిలివేతకు నిరాకరణ

**ప్రజాశక్తి-అమరావతి**

ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ చేపట్టిన నియామక ప్రక్రియను నిలిపివేసేందుకు హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన ధర్మాసనం నిరాకరించింది. విసిగా ప్రసాద్‌రెడ్డి పనిచేసిన కాలంలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై పిటిషనర్ ఇచ్చిన వినతిపత్రంపై ఛాన్సలర్ (గవర్నర్) తగిన నిర్ణయం తీసుకునేందుకు సమయం ఇవ్వాలంది. ప్రసాద్‌రెడ్డి విసిగా ఉండగా అక్రమాలు జరిగాయంటూ ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ పూర్వ విద్యార్థుల సంఘం పిల్ దాఖలు చేసింది. విసి చేపట్టిన నియామకాలు చట్ట వ్యతిరేకంగా ఉన్నాయని పిటిషనర్ తరపున న్యాయవాది పిచ్చయ్య వాదించారు. విసిపై ఛాన్సలర్‌కు ఈ నెల 1న ఫిర్యాదు చేశామని, ఇప్పటి వరకు చర్యల్లేవన్నారు. విసిగా ప్రసాద్‌రెడ్డి కాలపరిమితి నవంబరు 24తో ముగిసిందని వర్సిటీ న్యాయవాది వి సాయికుమార్ తెలిపారు. పూర్తి వివరాలు ఇచ్చేందుకు గడువు కావాలన్నారు. దీంతో విచారణ 8 వారాలకు వాయిదా పడింది.

# ఉత్తరాంధ్రకు ఉత్తి మాటలే

- సాగునీటి ప్రాజెక్టులపై చిత్తశుద్ధి కరువు
- పూర్తి చేయడానికి కొత్త గడువులు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతమయిన ఉత్తరాంధ్ర జిల్లాల సాగునీటి ప్రాజెక్టుల పూర్తిపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి కరువైంది. దశాబ్దాల తరబడి ఈ ప్రాజెక్టులు పూర్తికి నోచుకోని పరిస్థితి వుంది. వైసిపి ప్రభుత్వం వచ్చిన తొలినాళ్లలో రాష్ట్రంలో 54 ప్రాజెక్టులను ప్రాధాన్యతా ప్రాజెక్టులుగా గుర్తించి వాటిని 2024 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నాలుగన్నర ఏళ్లలో ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఒక్క ప్రాజెక్టునూ పూర్తి చేయలేదు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో కీలక ప్రాజెక్టులు పూర్తికి ప్రభుత్వం వాయిదాల మీద వాయిదాలు వేస్తున్న తీరుపట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో తాగు సాగునీటికి కీలకమైన ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు దశాబ్దాలుగా సాగుతూనే వుంది. 2009లో మొదలు పెట్టిన ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు నత్తనడకన సాగుతోంది. ఈ ప్రాజెక్టును 2020 జూన్ నాటికి పూర్తి చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఈ నాలుగన్నర ఏళ్లలో ఒక్క రూపాయి ఖర్చు చేయలేదు. ఇప్పుడు 2026 జూన్ నాటికి పూర్తిచేస్తామని అంటోంది. మరో కీలకమైన ప్రాజెక్టు వంశధార ప్రాజెక్టుది అదే దారి. రూ.1,616 కోట్లతో చేపట్టిన ఈ ప్రాజెక్టును జూన్ 2020 నాటికి పూర్తి చేస్తామని ప్రకటించగా, ఇప్పటివరకు మొదటిఫేజ్ మాత్రమే పూర్తయింది. 2024 ఫిబ్రవరిలో రెండో ఫేజ్ పూర్తి చేస్తామంటూ కొత్త లక్ష్యాన్ని ప్రకటించింది.

ఈ ప్రాజెక్టుకు ఈ నాలుగన్నర ఏళ్లలో రూ.90 కోట్లను ఖర్చు చేసింది. తోటపల్లి రిజర్వాయర్ కూడా నత్తనడకన సాగుతోంది.

ప్రాజెక్టు లక్ష్యం 2020 జూన్ కాగా 2025 జూన్‌కు లక్ష్యాన్ని మార్చింది. రూ.198 కోట్లు ఖర్చు చేస్తే పూర్తయ్యే తారకరామ తీర్థసాగర్‌ను కూడా 2020 సెప్టెంబర్ నాటికి లక్ష్యంగా పెట్టుకొని ఇప్పుడు 2025 జూన్ నెలకు మార్చారు. 18,500 ఎకరాలకు నీరందించే వంశధార నాగావళి ప్రాజెక్టు గత ప్రభుత్వ హయాంలో 70 శాతం పనుల వద్ద నిలిచిపోయింది. మద్దువలస ఫేజ్-2 ప్రాజెక్టు ఈ ప్రభుత్వం వచ్చే నాటికే దాదాపు 80 శాతం పనులు పూర్తికాగా ఈ నాలుగన్నర ఏళ్లలో ఖర్చు చేసింది దాదాపుగా ఏమీ లేదు. మహేంద్రతనయ ప్రాజెక్టుల పరిస్థితి కూడా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైంది. రూ.854 కోట్ల వ్యయమయ్యే ఈ ప్రాజెక్టు కింద భూసేకరణ పనులు కూడా నోచుకోని పరిస్థితి వుంది. దాదాపు 15 వేల కోట్లు ఖర్చు చేస్తే పూర్తయ్యే ఉత్తరాంధ్ర జిల్లాల్లో అన్ని ప్రాజెక్టులకు ఈ నాలుగన్నర ఏళ్లలో రూ 450 కోట్లను మాత్రమే ఖర్చు చేసింది. రాష్ట్రంలో అత్యంత తక్కువ సాగునీటి వసతి వున్న ఉత్తరాంధ్ర జిల్లాలకు సాగునీటి ప్రాజెక్టుల విషయంలో తీవ్ర అన్యాయం చేస్తోందనే విమర్శలూ ఉన్నాయి.

## గ్యాస్ లీక్ ఘటనలో నలుగురూ మృతి

**ప్రజాశక్తి-మధురవాడ (విశాఖ)**

విశాఖ జివిఎంసి ఏడవ వార్డు పరిధి వాంబే కాలనీలో ఈ నెల 24న వంట గ్యాస్ లీకైన ఘటనలో తీవ్రగాయాలపాలై కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న ఒకే కుటుంబంలోని నలుగురూ మృతి చెందారు. వాంబే కాలనీలో వేముల బాలరాజు (50), ఆయన భార్య చిన్ని (45), కుమారులు గిరి (25), కార్తీక్ (23) నివాసముంటున్నారు. నలుగురూ భవానీ మాల ధరించి ఉన్నారు. పూజ అనంతరం వంట చేసేందుకు వెళ్లగా గ్యాస్ అయిపోవడంతో కొత్త సిలిండర్‌కు రెగ్యులేటర్ మార్చే క్రమంలో గ్యాస్ లీకై అగ్నిప్రమాదం సంభవించింది. ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో నలుగులూ మంటల్లో చిక్కుకుని తీవ్ర గాయాలపాలయ్యారు. విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న వారిలో బాలరాజు చిన్న కుమారుడు కార్తీక్ సోమవారం, పెద్ద కుమారుడు గిరి మంగళవారం మృతిచెందారు. భార్యభర్తలు బుధవారం తెల్లవారుజామున మరణించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ల్యాబ్ నిర్వాహకుడి ఆత్మహత్య

- ఆర్థిక ఇబ్బందులే కారణం

**ప్రజాశక్తి-మార్కాపురం (ప్రకాశం జిల్లా)**

ఓ ప్రయివేటు ల్యాబ్ నిర్వాహకుడు ల్యాబ్‌లోనే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మార్కాపురం పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మార్కాపురం పట్టణానికి చెందిన తాటిశెట్టి కేశవ (45) తొలుత ల్యాబ్ టెక్నీషియన్‌గా కాంట్రాక్ట్ పద్ధతిపై మార్కాపురంలోని ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో పనిచేసేవారు. అనంతరం నెహ్రూ బజారులో విజయలక్ష్మి క్లినికల్ అండ్ బయో కెమికల్ ల్యాబొరేటరీ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు.

నాలుగేళ్ల క్రితం నూతన గృహం నిర్మించుకున్నారు. దానికి కొంత, పిల్లల చదువులకు కొంత అప్పు చేశారు. దీంతో తెచ్చిన అప్పు వడ్డీతో కలిపి భారంగా మారింది. ఆదాయం పెద్దగా లేకపోవడం.. రుణదాతలు బాకీ తీర్చాలని ఒత్తిడి చేయడంతో అయ్యప్ప దీక్షలో ఉన్న కేశవ తాను నిర్వహిస్తున్న ల్యాబ్‌లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ట్రైనీ డిఎస్‌పి సహనాజ్ అహ్మద్, మార్కాపురం పట్టణ ఎస్ఐ పి కోటేశ్వరరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. కేశవకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పిల్లలు ఇద్దరూ బి.టెక్ చదువుతున్నారు.

## బి.టెక్ రవికి బెయిల్ మంజూరు

**ప్రజాశక్తి - వైఎస్ఆర్ జిల్లా ప్రతినిధి**

టిడిపి మాజీ ఎమ్మెల్సీ బి.టెక్ రవికి బుధవారం బెయిల్ మంజూరైంది. ఈ నెల 14 నుంచి రవి వైఎస్ఆర్ జిల్లా సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న సంగతి తెలిసిందే. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పది నెలల కిందట జిల్లా పర్యటన సందర్భంగా కడప విమానాశ్రయం వద్ద పోలీసులతో జరిగిన వాగ్వాదం నేపథ్యంలో వల్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 14న పులివెందుల నుంచి కడపకు వస్తున్న సందర్భంగా యోగి వేమన యూనివర్శిటీ సమీపంలో పోలీసులు ఆయనను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. కోర్టు నవంబర్ 27 వరకు ఆయనకు రిమాండ్ విధించింది. రిమాండ్ గడువు పూర్తి కావడంతో కేంద్ర కారాగారం పోలీసులు ఈ నెల 27న మొదటి అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఎదుట రెండోసారి హాజరుపరచగా మెజిస్ట్రేట్ మరో 15 రోజులపాటు రిమాండ్‌ను విధించారు. బి.టెక్ రవి తరుపు న్యాయవాదులు బుధవారం బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా మొదటి అదనపు జిల్లా కోర్టు బెయిల్ మంజూరు చేసింది. బుధవారం సాయంత్రం ఆయన జైలు నుండి విడుదలయ్యారు.

## స్టేడియాలను ప్రయివేటీకరించొద్దని ఆందోళన

**ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖ)**

జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వార్వా, నివాస్ ప్రతినిధులు

విశాఖ నగరంలోని స్పోర్ట్స్ ఎరీనాలు, స్టేడియాల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖపట్నం అపార్ట్‌మెంట్స్ రెసిడెన్షియల్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ (వార్వా), నివాస్ ఆధ్వర్యాన బుధవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వార్వా అధ్యక్షులు ఎన్.ప్రకాశరావు, నివాస్ అధ్యక్షులు పిట్టా నారాయణమూర్తి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నగరంలోని పోర్టు స్టేడియం, ఎంవిపి.కాలనీలోని ఇండోర్ స్టేడియం, బీచ్‌లోని అక్వా స్పోర్ట్స్ స్టేడియం, కైలాసగిరి వాకర్స్ ట్రాక్ తదితర రూ.వందల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను కారు చౌకగా ప్రయివేటు వ్యక్తులకు అప్పగించడం దుర్మార్గమన్నారు. ఇప్పటికే పోర్టు స్టేడియంలో నిర్వహిస్తోన్న క్రీడలకు ప్రయివేటు వారు వేలకు వేల రూపాయలు అద్దెల రూపంలో వసూలు చేస్తున్నారని, ఇది మధ్యతరగతి, సాధారణ ప్రజానీకానికి అందుబాటులో లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైల్వే స్టేడియంలోకి వెళ్లేందుకు పెట్టిన ఎంట్రీ ఫీజు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉన్నత వర్గాలకు ఉపయోగపడే ఈ చర్యలను విద్యార్థులు, యువకులు, ప్రజానీకం అందరూ వ్యతిరేకించాలని, ప్రయివేటీకరణ నిర్ణయాలు వెనక్కు తీసుకునే విధంగా ఆందోళన చేపట్టాలని కోరారు. ప్రయివేట్ కాంట్రాక్టర్లతో చేసుకున్న ఒప్పందాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో నాయుడుబాబు, హరిప్రసాద్, పులి గురప్ప, కిరీటం, లచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

## లింగేశ్వర్‌రెడ్డిని అరెస్ట్ చేయాల్సిందే

- కర్నూలు కలెక్టరేట్ ఎదుట ధర్నా

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

మహిళలు, విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన నారాయణ విద్యాసంస్థల కోర్‌డీన్ లింగేశ్వర్‌రెడ్డిని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ కర్నూలు కలెక్టరేట్ ఎదుట ధర్నా జరిగింది. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా మాట్లాడారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సింది పోయి వారిని లైంగికంగా వేధించడం దుర్మార్గమన్నారు. ఈ విషయమై జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రజాప్రతినిధుల అండ, డబ్బు ఉంటే ఏం చేసినా చెల్లుతుందా? అని పోలీసులను ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్, ఎస్‌పి వెంటనే స్పందించి లింగేశ్వర్‌రెడ్డిని తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. విద్యార్థులకు, మహిళలకు విద్యాసంస్థల్లో రక్షణ కల్పించాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షులు అమర్, నగర ఉపాధ్యక్షులు భాస్కర్, సహాయ కార్యదర్శి మల్లేష్, నగర నాయకులు తేజ, యోగి, మధు పాల్గొన్నారు.

## బిసిల సాధికారతే లక్ష్యం

- సజ్జల రామకృష్ణారెడ్డి

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

వెనుకబడిన తరగతులు, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలకు రాజకీయ సాధికారతను సాధించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. విజయవాడలో బిసిల ఐక్యత- సమగ్రాభివృద్ధి అనే అంశంపై బిసి కులాలతో రౌండ్‌టేబుల్ బుధవారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సజ్జల మాట్లాడుతూ.. ఆర్థిక వెనుకబాటుతనం పోగొట్టాలన్నదే లక్ష్యంగా అనేక పథకాలను ముఖ్యమంత్రి అమలు చేయడంతోపాటు రాజకీయంగా పదవులు ఇచ్చి అవకాశాలు కల్పించారన్నారు. కత్తెర్లు, ఇస్త్రీ పెట్టెలు ఇచ్చి సరిపెట్టుకోమంటున్న చంద్రబాబుకు మద్దతు ఇవ్వాలా? మారుతున్న భవిష్యత్ వైపు అడుగులు వేయిస్తున్న జగన్‌కు మద్దతు ఇవ్వాలా? అనేది ఆలోచించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, బిసి జెఎసి అధ్యక్షులు అంగిరేకుల ఆదిశేషు, బిసి సంఘాల నాయకులు మారేషు, సూర్యారావు, ఎన్‌వి రావు తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ టిసిల అరెస్టు

**ప్రజాశక్తి-చీరాల (బాపట్ల జిల్లా)**

రైల్వే టికెట్ లేకుండా ప్రయాణం చేస్తున్న ప్రయాణికులను టార్గెట్ చేసుకొని వారి నుండి డబ్బులు వసూలు చేస్తున్న ముగ్గురు నకిలీ టిసిల గుట్టును చీరాల రైల్వే పోలీసులు మంగళవారం అర్ధరాత్రి రట్టు చేశారు. రైల్వే పోలీసుల సమాచారం మేరకు..తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా గొడ్లకొండ గ్రామానికి చెందిన బనోత్ కల్యాణ్, మహబూబాబాద్ జిల్లా నెల్లికుదూర్ మండలానికి చెందిన బాధవత్ ప్రవీణ్, వరంగల్ జిల్లా పార్వతిగిరికి చెందిన గుగులోత్ గణేష్ కొంతకాలంగా రైల్వే టిసిలుగా నకిలీ ఐడి కార్డు, ఛార్టులతో చెలామణి అవుతూ వచ్చారు. టికెటు లేకుండా ప్రయాణించే వారి నుంచి డబ్బులు వసూలు చేసేవారు. మంగళవారం రాత్రి ఈ ముగ్గురూ చీరాల రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో పోలీసులకు టిసిరాజేష్ సమాచారం ఇచ్చారు. ఈ ముగ్గురినీ పోలీసులు అరెస్టు చేశారు.

# మరో మూడు నెలల్లో వైసిపి ప్యాకప్

- యువగళం బహిరంగ సభలో నారా లోకేష్

**ప్రజాశక్తి - అమలాపురం, ముమ్మిడివరం(డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ)**

జగన్ పని అయిపోయిందని, మరో మూడు నెలల్లో వైసిపి ప్యాకప్ చేసుకోవాల్సిందేనని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పాదయాత్ర 212వ రోజు ముమ్మిడివరం నియోజకవర్గంలో సాగింది. ఈ సందర్భంగా ముమ్మిడివరంలో ఈ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దాట్ల సుబ్బరాజు అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో లోకేష్ మాట్లాడారు. లోక్‌సభ స్పీకర్‌గా ఎదిగిన బాలయోగి రాజకీయం ప్రస్థానం మొదలైంది ముమ్మిడివరం నియోజకవర్గంలోనే అని గుర్తు చేశారు. ఎంతో ఘన చరిత్ర ఉన్న ముమ్మిడివరంలో పాదయాత్ర చేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. జగన్ ఒకటి ఊహిస్తే మరొకటి జరిగిందని, చంద్రబాబును అరెస్ట్ చేసి 53 రోజులు న్యాయానికి సంకెళ్లు వేశారని, చివరికి నిజమే గెలిచిందని పేర్కొన్నారు. మరో మూడు నెలల్లో టిడిపి, జనసేన ప్రభుత్వం వస్తుందన్నారు. అక్రమ కేసులకు అరెస్టులకు భయపడేది లేదని తెలిపారు. ఉపాధ్యాయులపై జగన్ కక్ష సాధింపు చర్యలు దిగుతున్నారని విమర్శించారు. ఎలాంటి తప్పులూ లేకున్నా ఉపాధ్యాయులకు మెమోలు ఇస్తూ భయాందోళనకు గురిచేస్తున్నారని తెలిపారు. టిడిపి ప్రభుత్వం

నేతన్నలతో లోకేష్

రాగానే ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జరగబోయేది పేదలకు, దోపిడీదారులకు మధ్య యుద్ధమని తెలిపారు. జాబ్ కేలండర్‌ను జాబ్ లెస్ కేలండర్‌గా మార్చేసి ప్రభుత్వం యువత భవిష్యత్తుపై దెబ్బకొట్టిందని విమర్శించారు.

డిఎస్‌సిని చెత్తకుప్పలో పడేశారన్నారు. తాము అధికారంలోకి వస్తే యువతను అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ప్రతి ఏడాదీ ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేపడతామని, నిరుద్యోగ భృతి నెలకు రూ. మూడు వేలు అందిస్తామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేనకు పట్టం కట్టాలని కోరారు. సభ అనంతరం భోజన విరామానికి వెళ్లి మధ్యాహ్నం మూడు గంటల నుంచి యాత్రను కొనసాగించారు. మహిళలు, యువత, దళితులతో సమావేశమయ్యారు. సాయంత్రానికి యాత్ర సుంకరపాలెంలో ఏర్పాటు చేసి క్యాంపు సైటుకు చేరుకుంది. గురువారం యాత్ర కాకినాడ జిల్లాలో ప్రవేశించనుంది.

# ఎల్ఐసి బంపర్ పాలసీ ఆవిష్కరణ

- కొత్తగా జీవన్ ఉత్సవ్ ప్లాన్
- ఐదేళ్లు చెల్లిస్తే చాలు..
- ప్రతి ఏడాది గ్యారంటీ ఆదాయం

**హైదరాబాద్ :** ప్రభుత్వ రంగంలోని దిగ్గజ బీమా సంస్థ ఎల్ఐసి పాలసీదారులను మరింత ఆకర్షించడానికి మరో వినూత్న పాలసీని ఆవిష్కరించింది. పొదుపు బీమాతో పాటు గ్యారంటీ రాబడిని ఇచ్చే జీవన్ ఉత్సవ్ ప్లాన్‌ను బుధవారం విడుదల చేసింది. ప్లాన్ నెంబర్ 871తో ఆవిష్కరించిన ఈ నాన్ లింక్డ్, నాన్ పార్టిసిపేటింగ్, వ్యక్తిగత, పొదుపు, జీవితాంతం బీమా అందించే పాలసీని అందుబాటులోకి తెచ్చినట్లు ఎల్ఐసి వెల్లడించింది. ఈ పరిమిత ప్లాన్‌లో 5 ఏళ్ల నుంచి 16 ఏళ్ల వరకు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. కనిష్ఠ బీమా మొత్తం రూ.5 లక్షలుగా నిర్ణయించింది. ప్రీమియం చెల్లింపు, వెయిటింగ్ పీరియడ్ ముగిసిన తర్వాత పాలసీదారుడికి జీవితాంతం ఈ ప్లాన్ కింద ప్రయోజనాలు లభిస్తాయి. ఈ పాలసీపై రుణం తీసుకునే సౌలభ్యం కూడా కల్పించింది. ఈ పాలసీని ముంబయి సెంట్రల్ ఆఫీస్‌లో ఆవిష్కరించగా.. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను హైదరాబాద్‌లోనూ అధికారులు విడుదల చేశారు.

జీవన్ ఉత్సవ్ ప్లాన్ వివరాలు.. ప్రీమియం చెల్లింపు వ్యవధి ముగిసిన తర్వాత జీవితాంతం ఆదాయం పొందడానికి వీలుంది. ప్రీమియం టర్మ్, వెయిటింగ్ పీరియడ్ తర్వాత ఏటా ఆదాయాన్ని పొందవచ్చు. రెగ్యులర్ ఆదాయం వద్దనుకుంటే పాలసీదారు ఫ్లెక్సీ విధానం ఎంచుకోవచ్చు. దీనికి చక్రవడ్డీ అందిస్తుంది.

పాలసీ ప్రారంభమైన ఏడాది నుంచి జీవించి ఉన్నంత వరకు బీమా సదుపాయం కల్పించింది. ఈ ప్లాన్‌లో మూడు నెలల చిన్నారుల నుంచి 65 ఏళ్ల లోపు వారు చేరవచ్చు. కనీసం 5 ఏళ్ల నుంచి 16 ఏళ్ల వరకు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. పాలసీదారు ఐదేళ్ల పాటు ప్రీమియం చెల్లింపు వ్యవధి ఎంచుకుంటే 5 సంవత్సరాలు ఆగాల్సి ఉంటుంది. ఒకవేళ 6 ఏళ్ల ప్రీమియం ఎంచుకుంటే 4 సంవత్సరాలు, 7 సంవత్సరాలు ఎంచుకుంటే 3 సంవత్సరాలు, 8-16 సంవత్సరాలు ప్రీమియం చెల్లింపు వ్యవధి ఎంచుకుంటే 2 ఏళ్ల తర్వాత బీమా హామీ మొత్తంలో ఏటా 10 శాతం చొప్పున జీవితాంతం ఆదాయం పొందేలా ఈ పాలసీలో ఆకర్షణీయ ఫీచర్లను రూపొందించారు. ఒకవేళ పాలసీదారుడు మరణిస్తే చెందితే డెత్ బీమా మొత్తం లేదా వార్షిక ప్రీమియానికి 7 రెట్లు ఏది ఎక్కువైతే ఆ మొత్తాన్ని నామినీకి చెల్లిస్తుంది. ఈ పాలసీని ఎల్ఐసి ఏజెంట్ లేదా ఆన్‌లైన్‌లో గాని కొనుగోలు చేయవచ్చని ఆ సంస్థ తెలిపింది. హైదరాబాద్‌లో జీవన్ ఉత్సవ్ ప్లాన్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జోనల్ మేనేజర్ ఎల్‌కె శ్యామ్ సుందర్, సీనియర్ డివిజనల్ మేనేజర్ రాజీబ్ బిశ్వాస్, ఎస్‌బిఎ సుబ్బా రావు ఇతర ఉన్నతాధికారులు ఆర్ సతీష్ బాబు, రాజేష్ భరద్వాజ్, ఉతుప్ జోసెఫ్, ఎంఎంపి శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

## థర్మకోల్ ఫ్యాక్టరీలో భారీ అగ్నిప్రమాదం

- ఆర్పేందుకు ప్రయత్నిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్‌లో మరో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. థర్మకోల్ ఫ్యాక్టరీలో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ ఆర్‌జిఐఎ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గగన్‌పహాడ్ పారిశ్రామికవాడలో థర్మకోల్ ఫ్యాక్టరీలో సాయంత్రం వెల్డింగ్ చేస్తుండగా షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ఇవి ఫ్యాక్టరీ మొత్తం వ్యాపించాయి. వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఫ్యాక్టరీ లోపల సిలిండర్లు ఉన్నందున అవి పేలే అవకాశం ఉందని పరిసర ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అగ్ని ప్రమాదం కారణంగా ఫ్యాక్టరీలో పెద్దఎత్తున ఆస్తి నష్టం జరిగినట్టు అంచనా వేస్తున్నారు. అయితే ప్రాణనష్టం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. థర్మకోల్ ఫ్యాక్టరీ చుట్టూ ఇతర కంపెనీలూ ఉన్నాయి. ఆ కంపెనీలకూ మంటలు వ్యాపించాయి. భారీగా మంటలు ఎగిసి పడుతుండటంతో పాటు దట్టమైన పొగ కమ్ముకుంది. దీంతో పరిసర ప్రాంతాల ప్రజలు ఉక్కిరి బిక్కిరయ్యారు.

## వచ్చే ఎన్నికల్లో విశాఖ నుంచే పోటీ

- అవసరమైతే కొత్త రాజకీయ పార్టీ
- సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ

**ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖ)**

వచ్చే ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా విశాఖ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయనున్నట్లు సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వివి.లక్ష్మీనారాయణ తెలిపారు. విశాఖలోని విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో తాను విశాఖ నుంచి పోటీ చేయగా సుమారు మూడు లక్షల ఓట్లు వచ్చాయని తెలిపారు. విశాఖ ప్రజలు తనను ఎంతగానో ఆదరించారని చెప్పారు. వారి ఆదరణను చూసి మళ్లీ ఇక్కడి నుంచే పోటీ చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కొన్ని రాజకీయ పార్టీలు తనను ఆహ్వానిస్తున్నాయని, వాటిని పరిశీలిస్తున్నానని చెప్పారు. తనకు పార్టీ నచ్చితే దాని తరుపున పోటీ చేసేందుకు అభ్యంతరం ఉండదన్నారు.

రాజకీయాలలో నిజాయితీగా ప్రజాసేవ చేసేందుకు వచ్చే వారికి ప్రజల ఆదరణ ఉంటుందని తెలిపారు. దీనికి రాజకీయాలతో పనిలేదన్నారు. అందుకే తాను కొత్తగా రాజకీయ పార్టీని స్థాపించాలని కూడా ఆలోచిస్తున్నానని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో కొల్లాపూర్ అసెంబ్లీ స్థానం నుంచి స్వతంత్రంగా పోటీ చేస్తున్న బర్రెలక్కకు (శిరీష) ప్రజల నుంచి మద్దతు లభిస్తోందన్నారు. ఉన్నత విద్యనభ్యసించి ఉద్యోగం లభించక బర్రెల



లక్కగా మారిన ఆమె, ప్రజాసేవ చేయాలని భావించి, ఎన్నికల బరిలోకి దిగిన విషయాన్ని గుర్తు చేశారు. ఓటర్ల జాబితాలో బోగస్ ఓట్లను కచ్చితంగా తొలగించాలన్నారు. ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

**2న మెగా జాబ్ మేళా**

పిఎం.పాలెం క్రికెట్ స్టేడియం వెనుక ఉన్న సాంకేతిక ఇంజనీరింగ్ కళాశాలలో జెడి.ఫౌండేషన్ ఆధ్వర్యాన డిసెంబర్ 2న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు వివి.లక్ష్మీనారాయణ ప్రకటించారు.

జాబ్ మేళాలో 50కిపైగా కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. పదో తరగతి ఆపై విద్యార్హతలున్నవారు జాబ్ మేళాలో పాల్గొనవచ్చని చెప్పారు. జాబ్‌మేళాలో ఉద్యోగం సాధించలేని వారికి ప్రత్యేకంగా స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇచ్చి ఉపాధి వచ్చేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జెడి ఫౌండేషన్ కన్వీనర్ ప్రియాంక దండి, కృష్ణమోహన్, నిశ్చల్, నాగరాజు, సాంకేతిక కాలేజీ ప్రతినిధి కృష్ణకుమార్ పాల్గొన్నారు.

## టాప్ 20 కుబేరుల్లోకి మళ్లీ అదాని



**న్యూఢిల్లీ :** ప్రపంచ సంపన్నుల్లో అదాని మళ్లీ 20వ స్థానంలోకి వచ్చారు. అదాని గ్రూపు తీవ్ర ఆర్థిక మోసాలకు పాల్పడుతుందని ఈ ఏడాది జనవరిలో అమెరికన్ సంస్థ హిండెన్‌బర్గ్ ఇచ్చిన రిపోర్ట్‌కు అదాని సంపద లక్షల కోట్లు ఆవిరై.. ప్రపంచ కుబేరుల్లో మూడో స్థానంలో ఉన్న అదాని 30వ స్థానానికి పడిపోయారు. కాగా ఇటీవల అదాని గ్రూపు కంపెనీల షేర్లు మళ్లీ పెరగడంతో అదాని ఆస్తి క్రమంగా పెరుగుతోంది. బ్లూమ్‌బర్గ్ రిపోర్ట్ ప్రకారం.. గౌతమ్ అదానీ 66.7 బిలియన్ డాలర్ల సంపదతో 19వ స్థానంలోకి వచ్చారు. టెస్లా అధినేత ఎలన్ మస్క్, జెఫ్ బెజోస్, బెర్నార్డ్ ఆర్నాల్డ్ వరుస అగ్రస్థానాల్లో నిలిచారు. కాగా గతేడాదితో పోల్చితే అదాని సంపద 53.8 బిలియన్ డాలర్లు తక్కువగా ఉంది.

## ఎఐలో అమెజాన్ క్యూ వచ్చేసింది..

**వాషింగ్టన్ :** దిగ్గజ టెక్, ఇ-కామర్స్ కంపెనీ అమెజాన్ కూడా కృత్రిమ మేధా (ఎఐ) 'చాట్‌బోట్-క్యూ'ను ప్రారంభించింది. చాట్‌జిపిటికి పోటీగా దీన్ని ఆవిష్కరించింది. ఈ విషయాన్ని లాస్‌వేగాస్‌లో జరిగిన అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఎడబ్ల్యూఎస్) క్లౌడ్ వార్షిక సదస్సులో ఎడబ్ల్యుఎస్ సిఇఒ ఆడం సెలీప్ స్కై వెల్లడించారు. దీన్ని త్వరలోనే వినియోగదారులకు అందుబాటులోకి తేనున్నామన్నారు. కంటెంట్ తయారీ, రోజువారీ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ క్రమబద్ధీకరణ, బ్లాగ్ పోస్ట్‌ల రచన వంటి పనులను క్యూ తేలిగ్గా చేస్తుందని ఆడం పేర్కొన్నారు.

## జెన్3 నోవా ఎలివేటర్ల కోసం ఓటిస్ బుకింగ్స్

**న్యూఢిల్లీ :** జెన్3 నోవా శ్రేణీ ఎలివేటర్ల కోసం ఆన్‌లైన్ ఆర్డర్‌బుకింగ్స్‌ను తెరిచినట్లు ఓటిస్ ఇండియా తెలిపింది. వీటిని దేశంలోని భవన యజమానులు, ఫెసిలిటీ మేనేజర్లు ఇప్పుడు ఆన్‌లైన్‌లో కొనుగోలు చేయవచ్చని ఓటిస్ ఇండియా ప్రెసిడెంట్ సెబి జోసెఫ్ పేర్కొన్నారు. "ఎలివేటర్ల ప్రత్యక్ష విక్రయం కోసం మా ఇ-కామర్స్ పోర్టల్‌కు జెన్3 నోవా శ్రేణిని జోడించడానికి మేం సంతోషిస్తున్నాం" అని జోసెఫ్ అన్నారు.

## తీర్థయాత్రలకు ప్రత్యేక రైలు

**ప్రజాశక్తి- ఆమదాలవలస**

తీర్థయాత్రలకు వెళ్లాలనుకునే యాత్రికులకు రైల్వేశాఖ ప్రత్యేక రైలు నడుపుతోందని ఐఆర్‌సిటిసి సౌత్ సెంట్రల్ జోన్ ఏరియా మేనేజర్ బి.చంద్రమోహన్ తెలిపారు. శ్రీకాకుళం రోడ్ (ఆమదాలవలస) రైల్వే స్టేషన్‌లోని విఐపి లాంజ్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పుణ్యక్షేత్ర యాత్ర పేరిట పూరి, కాశి, అయోధ్య క్షేత్రాలను దర్శించుకునేలా 'భారత్ గౌరవ్ టూరిస్టు' రైలును డిసెంబరు తొమ్మిదిన సికింద్రాబాద్ నుంచి ప్రయాగ్ రాజ్ వరకు నడపనున్నట్లు తెలిపారు. ఒడిశా రాష్ట్రంలోని పూరి జగన్నాథం దేవాలయం, బీహార్ రాష్ట్రం గయలోని విష్ణు పాద టెంపుల్, ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి కాశీవిశ్వనాథ ఆలయం, కారిడార్, కాశీ విశాలాక్షి, అన్నపూర్ణాదేవి ఆలయం, గంగాహారతి, అయోధ్యలోని రామజన్మభూమి, హనుమాన్ గర్హి, హారతి, సరయునది, ప్రయాగరాజ్‌లో త్రివేణి సంగమం, హనుమాన్ ఆలయం, శంకర్ విమన్ మండపం వంటి ఆధ్యాత్మిక పర్యాటక ప్రాంతాలను దర్శించుకోవచ్చన్నారు. ఎనిమిది రాత్రులు తొమ్మిది రోజుల టూర్ ప్యాకేజీకి సంబంధించి ఎకానమీలో స్లీపర్ క్లాస్ రూ.15,200, స్టాండర్డ్‌లో థర్డ్ ఎసి రూ.24 వేలు, కంఫర్ట్‌లో సెకండ్ ఎసి రూ.31,500, అలాగే ఐదు నుంచి 11 ఏళ్లలోపు చిన్నారులకు ఎకానమీ స్లీపర్ క్లాస్‌లో రూ.14,200, స్టాండర్డ్ థర్డ్ ఎసిలో రూ.22,900, కంఫర్ట్ సెకండ్ ఎసిలో రూ.30,100లుగా నిర్ణయించినట్లు తెలిపారు. ట్రావెల్ ఇన్స్యూరెన్స్ కూడా ఉంటుందన్నారు. టూర్ ప్యాకేజీకి సంబంధించిన వివరాలను www.irctc-tourism.com వెబ్‌సైట్‌లో చూడవచ్చునని తెలిపారు. అనంతరం బోచర్లను ఆవిష్కరించారు. సమావేశంలో స్టేషన్ మేనేజర్ మొదలవలస రవి, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ గణేష్ తాప పాల్గొన్నారు.

JAWAHARLAL NEHRU TECHNOLOGICAL UNIVERSITY ANANTAPUR,
ANANTHAPURAMU - 515 002 (A.P.) INDIA

**XIII CONVOCATION NOTIFICATION**

The Thirteenth Convocation of JNTUA, Ananthapuramu will be held in the first week of January, 2024. All UG, PG and Ph.D. candidates who are qualified for the award of degree during the Academic Year 2021-22 and 2022-23 are hereby informed to submit the applications through Online only (https://jntuaebranchpayment.in/originaldegree/) on or before 16.12.2023. For details web site: www.jntua.ac.in under Examinations section.

Date:29.11.2023

Sd./- REGISTRAR

సంపాదకీయం

# సుఖాంతం

ఉత్తరాఖండ్ సొరంగం కథ సుఖాంతం కావడం యావత్ దేశానికి పెద్ద ఊరట. చార్‌ధామ్ యాత్రా స్థలాలను కలుపుతూ చేపట్టిన జాతీయ రహదారి ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ఉత్తరకాశి జిల్లా సిల్క్యారా వద్ద భారీ సొరంగ తవ్వకాలు జరుపుతుండగా ఈ నెల 12న ఒక్క ఉదుటున కొండ చరియలు విరిగి పడటంతో 41 మంది కార్మికులు లోపల చిక్కుకుపోయారు. ఈ ఉదంతం జాతిని కదిలించగా, ఏకంగా 17 రోజులు సొరంగంలోనే కార్మికులు దిక్కుతోచని స్థితిలో గడపాల్సి రావడం మరింత ఆందోళన కలిగించింది. ఎప్పుడు తమ వారు బయట పడతారా అని కళ్లుకాయలు కాసేలా నిరీక్షించిన కూలీల కుటుంబాలు పడ్డ క్షోభ మాటలకందనిది. పైగా కార్మికులందరూ పనుల కోసం పొట్ట చేతపట్టుకొని రాష్ట్రాలు దాటొచ్చిన వలస కార్మికులు. అటువంటి వారి క్షేమ సమాచారం కుటుంబాలకు అంత తొందరగా అందదు. ఇటువంటి ఉద్విగ్నతల మధ్య సహాయ కార్యక్రమాలు రోజుల తరబడి సాగాయి. ఎట్టకేలకు మంగళవారం సాయంత్రానికి ప్రయత్నాలు ఫలించి సొరంగంలో చిక్కుకున్న వారందరూ సురక్షితంగా బయట పడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అలుపెరగకుండా సహాయ చర్యల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రజానీకం, ముఖ్యంగా కార్మికలోకం జేజేలు పలికింది. మనోధైర్యం కోల్పోకుండా క్షేమంగా బయటపడ్డ కార్మికులు అభినందనీయులు.

టన్నెల్‌లో కార్మికులు చిక్కుబడిన తక్షణం తీవ్రతను అంచనా వేసి పకడ్బందీగా రెస్క్యూ ఆపరేషన్ చేపట్టడంలో ఉత్తరాఖండ్ బిజెపి ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. డబుల్ ఇంజన్ సర్కారు పాట పాడే ప్రధాని మోడీ, తమ పాలనలోని ఉత్తరాఖండ్‌లో కూలీలు ప్రమాదంలో చిక్కుకుంటే ఆ వైపు కన్నెత్తి చూడలేదు. ప్రధాన స్రవంతి మీడియా ప్రమాదాన్ని పట్టించుకోలేదు. రోజులు గడుస్తున్నా పరిస్థితిలో మార్పు లేకపోవడంతో సిపిఎం, వామపక్షాలు, కార్మిక సంఘాలు, విపక్షాలు గళం విప్పాకనే కేంద్రం, ఉత్తరాఖండ్ ప్రభుత్వాల్లో కదలికొచ్చింది. డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఒఎన్‌జిసి, సైన్యంలోని ఇంజనీర్లు, ఇలా ఏడు ఏజెన్సీలు పూర్తి స్థాయిలో రంగంలో దిగినా, అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన భారీ యంత్రాలు తెచ్చినా సాధ్యం కాలేదు. చివరికి అత్యంత నిపుణత కలిగి బొగ్గును వెలికి తీసే డజను మంది కార్మికులు చిన్న పనిముట్లతో చాకచక్యంగా తవ్వకాలు జరిపి అనువైన మార్గాలు వేసి ఎట్టకేలకు లోపల చిక్కుకున్న కార్మికులను వెలుపలకు తెచ్చారు. మానవ శ్రమ ఔన్నత్యాన్ని మరోసారి ప్రపంచానికి చాటిచెప్పిన ఆ కార్మికుల కృషికి విలువ కట్టే షరాబు ఇప్పటికి పుట్టలేదు, ఇకపైనా పుట్టడు.

కార్మికులు టన్నెల్‌లో చిక్కుకుపోయినప్పుడు నిమ్మకు నీరెత్తినట్లున్న ప్రధాని మోడీ, ఇతర బిజెపి పెద్దలు, తీరా కార్మికులు బయటికొచ్చాక మాత్రం ఆ ఘనత తమదేనని ప్రచారం చేసుకోవడం నీతి బాహ్యం. ఉత్తరాఖండ్‌లో చేపట్టిన చార్‌ధామ్ జాతీయ రహదారి ప్రాజెక్టు మొత్తం హిమాలయ సానువుల్లోనే ఉంది. ఆ ప్రాంతం తీవ్ర భూకంప జోన్‌లో ఉంది. భూగర్భంలో పొరలు, మట్టి పెళుసుగా ఉంటాయి. గ్లోబల్ వార్మింగ్, వాతావరణంలో మార్పుల కారణంగా హిమాలయాల్లోని మంచు కరుగుతోంది. ఆ ప్రభావాలతో అకాల వర్షాలు, వరదలు ముంచెత్తుతున్నాయి. చార్‌ధామ్‌కు ముఖద్వారంగా ఉండే జోషీమఠ్ గ్రామం కుంగిపోతోందన్న ఆందోళనలున్నాయి. ఇవన్నీ సహజ వనరులపై కార్పొరేట్ గద్దల దోపిడీ, వాటికి సహకరించే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వల్లనే సంభవిస్తున్నాయి. ఈ పూర్వరంగంలోనే సిల్క్యారా టన్నెల్‌ను చూడాలి. టూరిజం, కార్పొరేట్ల వ్యాపార లాభాల కోసం పర్యావరణపరంగా అత్యంత సున్నితమైన ఉత్తరాఖండ్‌లో ఇష్టారీతిన భారీ ప్రాజెక్టులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతించడం దుర్మార్గం. పర్యావరణ ప్రభావాన్ని సరిగ్గా అంచనా వేయకుండా నిర్మాణాలకు, సరైన భద్రతా చర్యలు లేకుండా వలస కార్మికులతో టన్నెల్ పని చేయించిన నిర్మాణ సంస్థపై వెంటనే చట్టపరమైన చర్యలు చేపట్టాలి. ఇటువంటి నిర్మాణాలకు అనుమతించిన డబుల్ ఇంజన్ సర్కారే దోషి. ఈ వాస్తవం నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే మోడీ, బిజెపి ప్రచార హడావుడి. ఈ సత్యాన్ని అర్థం చేసుకోలేనంత అమాయకులేం కాదు ప్రజలు.

మహనీయుల మాట



**స్త్రీల జీవిత లక్ష్యం ప్రేమ, పెళ్లి, పిల్లల్ని కనడం మాత్రమే కాదు. మహిళలు తమ కాళ్ల మీద తాము నిలబడాలి. అందుకు వారికి ఉద్యోగం కావాలి. పని చేయడానికి వీలుగా మహిళల వేషధారణ లోనూ మార్పు రావాలి.**

**- బార్బరా బోడికన్,**
**19వ శతాబ్దపు మహిళా హక్కుల కార్యకర్త.**

# విద్యుత్ సంస్కరణలతో రైతులపై పెనుభారం

విశ్లేషణ

డా॥ విజూకృష్ణన్

నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం, విద్యుత్‌రంగ సంస్కరణలతో, అత్యంత వేగంగా ముందుకు సాగుతోంది. రైతాంగం ఆందోళనతో 2021 నవంబర్‌లో, వ్యవసాయ చట్టాలను అనివార్యంగా వెనక్కు తీసుకోవలసిన పరిస్థితి మోడీ ప్రభుత్వానికి ఏర్పడింది. ఆ సందర్భంగా రైతుల ప్రయోజనాలకు భిన్నంగా విద్యుత్ సవరణ బిల్లును అమలు చేయనని ఆయన హామీ ఇచ్చారు. అయితే, దొడ్డిదోవన ఆ విధానాలనే అమలులోకి తెచ్చారు. ఫలితంగా మరో పోరాటం అనివార్యమైంది. నిజానికి ఈ విధానాలకు బిజెపి ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి హయాంలోనే బీజం పడింది.

1948 నుండి అమలవుతున్న విద్యుత్ చట్టం వ్యవసాయ అభివృద్ధికి అధిక రాయితీలు ఇవ్వడం, దేశ ఆహార భద్రతను, పేదలకు రాయితీతో కూడిన విద్యుత్తును అందించే లక్ష్యంగా ఉంటుంది. దీంతోపాటు, వినియోగదారులకు సరసమైన ధరలకు, విద్యుత్‌ను అందించడానికి ఉపకరిస్తుంది. ఈ విధానాన్ని అమలు చేయడానికి అవసరమైన ఖర్చును ఇతర మార్గాల ద్వారా తిరిగి పొందుతుంది. అయితే, బిజెపి ప్రభుత్వాలు విద్యుత్‌ను కార్పొరేట్లకు అప్పచెప్పాలనే లక్ష్యంతోనే పనిచేస్తున్నాయి. వ్యవసాయ చట్టాలతో సహా అనేక చట్టాల మాదిరిగానే, తీవ్రమైన కరోనా మహమ్మారి, కఠినమైన లాక్‌డౌన్‌తో ప్రజలు కొట్టుమిట్టాడుతున్న సమయంలో, గుత్త పెట్టుబడి దారుల ఆదేశానుసారం, లేబర్ కోడ్స్ తీసుకు వచ్చారు. 17 ఏప్రిల్ 2020, తిరిగి 8 ఆగస్టు 2022న విద్యుత్ రంగంలో కూడా కార్పొరేట్లకు అనుకూలంగా బిల్లును ప్రవేశపెట్టారు.

విద్యుత్, ఇతర సరుకుల కంటే భిన్నంగా ఉంటుంది. ప్రజలు తమ అవసరాల కోసం, విద్యుత్తును నిల్వ చేయడం సాధ్యం కాదు. అందువల్ల వినియోగదారులను పూర్తిగా గుత్తాధిపత్యంపై ఆధారపడేలా చేస్తుంది. కాలిఫోర్నియా, ఇతర ప్రాంతాలలో విద్యుత్ రంగంలో గుత్తాధిపత్యం అనే ప్రయోగం, సంస్కరణల ఉద్దేశం ప్రభుత్వ రంగానికి పోటీగా ఉండడమే. హోల్‌సేల్ విద్యుత్ మార్కెట్‌లో, ప్రైవేటు పవర్ జనరేటర్ల గుత్తాధిపత్యానికి సంబంధించిన ఈ కసరత్తు ద్వారా విద్యుత్‌ను ఒకవైపు యుటిలిటీ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలకు విక్రయిస్తారు. మరొకవైపు రిటైల్ మార్కెట్లో విద్యుత్‌ను అంతిమ వినియోగదారులకు ప్రైవేటు సర్వీస్ ప్రొవైడర్‌కు విక్రయిస్తారు. ఈ రంగంలో వేగవంతమైన మార్పులు, వినియోగదారుల జీవితాలలో గందరగోళానికి దారితీస్తాయని హెచ్చరించడానికి కారణం లేకపోలేదు. ఖీవిద్యుత్ సంస్కరణలు ప్రతిఘటనలను ఎదుర్కొంటు న్నందున భారతదేశంలోని పాలక వర్గాలు మొదట కేంద్రపాలిత ప్రాంతాల్లో సంస్కరణలను అమలు చేయడానికి ప్రయత్నించాయి. దాదర్ మరియు నాగర్ హవేలీ లోని ఆస్తులన్నీ గుజరాత్‌కు చెందిన టొరెంట్ కంపెనీకి బదిలీ చేశారు. మహారాష్ట్రలో అదానీలకు, చండీగఢ్‌లో ఆర్.పి గోయెంకా గ్రూప్‌కు, జమ్మూ కాశ్మీర్, పాండిచ్చేరిలలో ప్రైవేటు కంపెనీలకు అప్పగించే ప్రయత్నాలను, విద్యుత్ కార్మికులు, వినియోగదారులు ఐక్య పోరాటాల ద్వారా విజయవంతంగా ప్రతిఘటించారు. అదానీలు, అంబానీలతోపాటు, టాటాలు కూడా విద్యుత్ రంగంలోకి పెద్దఎత్తున ప్రవేశించారు. అదానీ ప్రైవేట్ లిమిటెడ్ తన సైట్‌లో 13,650 మెగావాట్ల సామర్థ్యంతో, యన్‌టిపిసి తరువాత రెండవదిగా, తమది భారత దేశంలోనే అతి పెద్ద థర్మల్ పవర్ ఉత్పత్తిదారుగా పేర్కొంది. అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ కూడా పునరుత్పాదక ఇంధన రంగంలో అతి పెద్ద భాగస్వామిగా ఉంది.

**ఈ విధానాల వల్ల రైతులకు ఒరిగేదేమిటి? అన్ని గొట్టపు బావులు, నీటిపారుదల మోటార్లు, స్మార్ట్ మీటర్లతో అనుసంధానిస్తారు. మీటరును మార్చడానికి ప్రతి ఆరు సంవత్సరాలకు ఒకసారి పునరావృతం అయ్యే ఖర్చు రూ.15 వేలు వినియోగదారులపై పడుతుంది. ఇది రైతులకు, పేదలకు ఇచ్చే ఉచిత విద్యుత్ శాశ్వత రద్దుకు దారితీస్తుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రస్తుతం చేస్తున్న విధంగా, ప్రత్యక్ష నగదు బదిలీ వంటివి తాత్కాలిక ప్రలోభాలుగానే మారతాయి.**

వ్యవసాయ వినియోగదారులు, రైతులకు లభించే సబ్సిడీలపై ప్రజల్లో వ్యతిరేక అభిప్రాయాన్ని కలిగించడం భారత కార్పొరేట్లు, పాలక వర్గాల లక్ష్యంగా ఉంది. కార్మికులు, కర్షకుల ఐక్య పోరాటాల ద్వారా తమకు ఎదురైన నష్టాల నుండి బయట పడేందుకు వారు ప్రయత్నిస్తున్నారు. స్మార్ట్ మీటర్లు దీనిలో భాగమే. అది ప్రీ పెయిడ్ మీటర్లకు నాంది పలికింది. వీటికి అంగీకరించకపోతే దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామజ్యోతి యోజన వంటి పథకాలు, ప్రభుత్వ స్కీములలో, సబ్సిడీలతోపాటు నిధుల కేటాయింపుల్లో కూడా కోతలు విధిస్తామని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలను బెదిరిస్తోంది. స్మార్ట్ మీటర్లను ప్రతి ఆరు సంవత్సరాలకు ఒకసారి మార్చాల్సి వస్తుంది. ఫలితంగా సుమారు రెండు లక్షల కోట్ల రూపాయల భారీ వ్యయం రాష్ట్రాల పైన, వినియోగదారులపైనా పడుతుంది. అదే సమయంలో విద్యుత్ రంగంలోని దిగ్గజ కంపెనీల ఖజానాలు నిండుతాయి. ప్రీ పెయిడ్ మీటర్లు సున్నాకు చేరుకుంటే, అది తక్షణం వినియోగం నుండి తొలగించాల్సి ఉంటుంది. తిరిగి కనెక్షన్ పొందడానికి రూ.500 చెల్లించాల్సి ఉంటుంది.

ప్రధానంగా వేసవి, కరువు పరిస్థితులలో పంటలకు నీరందాల్సిన సమయంలో ఇటువంటి పరిస్థితి ఏర్పడితే ఎలా ఉంటుందో ఊహించండి. ఈ విధానాన్ని అమలు చేసిన కాలిఫోర్నియాలో గడ్డకట్టే చలికాలంలో, హీటర్ల వాడకం తప్పనిసరైన వేళ ప్రజానీకానికి విద్యుత్ సరఫరా చేయడానికి కంపెనీలు నిరాకరించాయి. రేట్లు ఎక్కువగా పెంచి అదనంగా చెల్లించిన వారికే కరెంటు ఇచ్చారు. లాభాలను ఆర్జించాలనే ఉద్దేశంతో మాత్రమే నడిపే కంపెనీలు, ప్రజల సమస్యలపై కనీసం ఆందోళన చెందవు. ఇది తీవ్రమైన పరిస్థితులకు దారితీయవచ్చు. వినియోగదారులు అనివార్యంగా, అదనంగా చెల్లించే విధంగా చేస్తారు. ఇవే విధానాలు కొనసాగితే, మన దేశంలోనూ అటువంటి పరిస్థితి ఏర్పడదని గ్యారంటీ ఏమీ లేదు. 2025 ఏప్రిల్ నాటికి వ్యవసాయ ఫీడర్లన్నిటినీ వేరు చేయడం, బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. గడువులోగా దానిని చేరుకోవడానికే బెదిరింపులకు పాల్పడుతోంది. వారి బెదిరింపులకు లొంగని రాష్ట్రాలకు, కేటాయింపుల్లో, సబ్సిడీలలో కోత విధిస్తుంది.

ఈ విధానాల వల్ల రైతులకు ఒరిగేదేమిటి? అన్ని గొట్టపు బావులు, నీటిపారుదల మోటార్లు, స్మార్ట్ మీటర్లతో అనుసంధానిస్తారు. మీటరును మార్చడానికి ప్రతి ఆరు సంవత్సరాలకు ఒకసారి పునరావృతమయ్యే ఖర్చు రూ.15 వేలు వినియోగదారులపై పడుతుంది. ఇది రైతులకు, పేదలకు ఇచ్చే ఉచిత విద్యుత్ శాశ్వత రద్దుకు దారితీస్తుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రస్తుతం చేస్తున్న విధంగా, ప్రత్యక్ష నగదు బదిలీ వంటివి తాత్కాలిక ప్రలోభాలుగానే మారతాయి. విజయనగరంలో రైతులు 3 హెచ్‌పి పంపునకు నెలకు రూ.7,500 వస్తున్నట్లు చెబుతున్నారు. అయితే, వైసిపి ప్రభుత్వం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రైతుల ఖాతాలకు నేరుగా నగదు జమ అవుతుందని చెబుతోంది. అయితే, దీనికి గ్యారంటీ ఏమిటి? అందుకే ఈ విధానం వ్యవసాయానికి, ఆహార భద్రతకు మరణ శాసనం అవుతుంది. ఇది అన్ని వర్గాలు ఏకమై ప్రతిఘటించాల్సిన విషయం. కేరళ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం టోటెక్స్ (టోటల్ ఎక్స్‌పెండీచర్ మోడల్) నమూనా, స్మార్ట్ మీటర్లను నిరోధించడానికి మార్గాన్ని చూపింది. రైతులు, వినియోగదారులపై ప్రతికూల ప్రభావం పడే విధానాలను అనుమతించబోమని కేరళ ప్రభుత్వం తేల్చిచెప్పింది. కేంద్రప్రభుత్వం నిర్దేశించిన రోడ్ మ్యాప్‌తో రహస్యంగా ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించిన ఉన్నతాధికారుల బుకాయింపులను, మోసం చేసే కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాలను సిఐటియు, ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సకాలంలో బయట పెట్టాయి. ఇటువంటి ప్రతిఘటనలు మరెన్నో రావాలి. విధ్వంస చర్యలకు, మోసంతో కూడిన కార్పొరేట్ దోపిడీకి వ్యతిరేకంగా అందరం ఏకం కావాలి.

**(వ్యాసకర్త ఎఐకెఎస్ జాతీయ కార్యదర్శి)**

★

సందర్భం

## ఆధునికతకు ఆద్యుడు గురజాడ



తెలుగు భాషా సాహిత్యాలను, సామాజిక చైతన్యాన్ని గొప్ప ముందంజ వేయించిన సంస్కర్త–మహాకవి గురజాడ అప్పారావు. రాజు నుంచి రోజు కూలీ దాకా సమకాలీనులను అమితంగా ప్రభావితం చేసిన నవయుగ వైతాళికుడు. స్త్రీలను తొక్కిపెట్టే నాటి శిథిల సమాజంపై 'కన్యాశుల్కం' నాటకంతో అగ్నివర్షం కురిపించిన కలం యోధుడు గురజాడ. 'బ్రతికిచచ్చియు ప్రజలకెవ్వరు ప్రీతి కూర్చునో వాడే ధన్యుడు' అంటారు ఆయనే ఒకానొక సందర్భంలో! అయన రచనలూ నేటికీ సమకాలీనతను, ప్రాసంగికతను కలిగి వుంటాయి. కేవలం 52 సంవత్సరాల జీవితంలోనే అనల్పమైన దార్శనికతతో కాలాన్ని ముందుకు నడిపిన ప్రతిభామూర్తి, కలం యోధుడు గురజాడ అప్పారావు. దేశభక్తి, ఆధునిక కవిత్వం, ప్రేమ, స్త్రీ సంస్కరణ: సంఘ చైతన్యం...వంటివెన్నో ఉదాత్త వినూత్న భావాలను నిర్వచించి, నిర్వహించిన కార్యకర్త గురజాడ. నెలలు నిండకుండానే పుట్టి (21-9-1862) షష్టి పూర్తి కాకుండానే క(పె)న్ను మూసి 30–నవంబర్ 1915 తెలుగుజాతి హృదయాల్లో శాశ్వతంగా జీవిస్తున్న ధన్యుడు గురజాడ. మరణించిన తర్వాతే జీవించడం మొదలు పెట్టాడు. సృజనాత్మకత– సాహిత్య భాషగా వాడుక భాషకై తపించిన గురజాడ సర్వ ప్రపంచ దేశాలు తమ దేశగేయంగా పాడుకొనే స్థాయిలో 'దేశమును ప్రేమించుమన్న' అంటూ దేశభక్తి గేయం (9 ఆగస్ట్ 1913లో) రాశారు.

1892 లోనే కన్యాశుల్కం, 1906లో కొండుభట్టీయం–రాసినా ...వ్యవహారిక భాషోద్యమంకై బలమైన పోరాటం నాటికాలం పండింతులపై చేశాడు. సాంప్రదాయ వాదుల్ని మట్టికరిపించాడు. భిన్న కులాల సహపంక్తి భోజనం పెట్టించడం–కన్యల కన్నీటిని కన్యక–పూర్ణమ్మ గేయాల్లో తుడిచి పరామర్శిచి ముత్యాల సరాల మాల కట్టి...."మీ పేరేమిటి?" అంటూ దైవాన్ని ప్రశ్నించిన హేతువాది అతడు. ఆధునిక కథకు "దిద్దుబాటు" జరిపి సుభద్ర లాంటి పద్యకావ్యం రాయగలను అన్న భాషాశాస్త్రవేత్త గురజాడ...'మంచి అన్నది మాల అయితే, మాలనేనగుదున్' అని సామాజిక సంస్కరణకు గొంతిచ్చాడు.

'అలనాటి అగ్రేసర భాషా పండితులైన కాశీభట్ల బ్రహ్మయ్య, కాశీ కృష్ణమాచార్యులు, కొక్కొండ వెంకటరత్నం, వావిల కొలను సుబ్బారావు, కూచి నరసింహ, మోచర్ల రామచంద్రరావులు, జయంతి రామయ్య, వేదం వెంకట్రామ శాస్త్రి, పానుగంటి లక్ష్మీనరసింహ, కొమర్రాజి లక్ష్మణరావు లాంటి కరుడుకట్టిన గ్రాంథిక భాషావాదులు పన్నిన వ్యూహాలు ఛేదించుకొని ప్రజల భాషయైన వాడుక భాష కోసం గిడుగు రామ్మూర్తి నీడలో పోరాడిన మహా యోధుడు గురజాడ" అంటారు పురిపండా అప్పలస్వామి. సాంప్రదాయ కుటుంబంలో పుట్టి "దేవుళ్లారా మీ పేరేమిటి"? అని కథ రాయడం మామూలు విషయం కాదు. రాచరికపు హద్దులు బద్దలు కొట్టి రాజభక్తిని, దైవభక్తిని వీడి దేశభక్తి వరకు నడిపించిన దార్శనిక అక్షర యోధుడు గురజాడ అప్పారావు. రేపటి తరానికి నిత్య మార్గదర్శి, జన పక్షపాతి, అభ్యుదయ పథగామి.

**(నేడు గురజాడ 108వ వర్ధంతి)**

**– తంగిరాల చక్రవర్తి, సెల్ : 9393804472**

# ప్రజల్ని చూడండి - అంకెలను కాదు

చర్చ

అరుణ్ మైరా

భారత ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొనేది అభివృద్ధి సమస్య కాదు, ఆదాయాల సమస్య. తగినంతగా ఆదాయాలు పెరగడం లేదు. అధిక సంఖ్యాకులకు అవి నిలకడగా లేవు. మొత్తం మీద స్థూల జాతీయ ఆదాయ అభివృద్ధి జరుగుతున్నా కూడా కులం, మతంతో సంబంధం లేకుండా ఆర్థిక బలహీనులకు ఉద్యోగాలలో రిజర్వేషన్లు ఉండాలని ఒత్తిడి పెరుగుతోంది.

ప్రభుత్వానికి అనుకూలంగా, వ్యతిరేకంగా ఉన్న ఆర్థికవేత్తలు ఆర్థిక వ్యవస్థ సరిపోయినన్ని ఉద్యోగాలు సృష్టిస్తున్నదా లేదా అని చర్చిస్తున్నారు. ప్రభుత్వ గణాంకాల్లో వున్న వాస్తవాన్ని ప్రశ్నిస్తున్నారు. ఇంతకు ముందున్న ప్రభుత్వం కాకుండా ప్రస్తుత ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల కారణంగానే అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో తగినన్ని ఉద్యోగాలు సృష్టి కావడం లేదని ప్రభుత్వ వ్యతిరేక ఆర్థికవేత్తలు చెప్తున్నారు. గణాంకాలు సమస్యను వివరించలేవని, సరైన పరిష్కారాలు చూపించలేవని అంటున్నారు.

**అమెరికా ఆర్థిక వ్యవస్థ**

అమెరికా ఆర్థిక వ్యవస్థ గణాంకాలను చూస్తే అంతా బాగున్నట్లు అనిపిస్తుంది. కానీ అత్యధిక మంది ప్రజానీకం ఆర్థిక వ్యవస్థ పట్ల అసంతృప్తితో ఉన్నారు. వచ్చే సంవత్సరం నవంబర్‌లో జరిగే అధ్యక్ష ఎన్నికల సంధర్భంలో ఇదో పెద్ద సమస్య కానుంది. తమ యజమానుల నుండి సరైన వేతన సవరణ కావాలంటూ సమ్మెలో ఉన్న మోటారు రంగ కార్మికుల దగ్గరకెళ్ళి అమెరికా అధ్యక్షుడు సంఘీభావం తెలపాల్సిన పరిస్థితి వచ్చింది. కార్మికులు తమకు న్యాయమైన ఒప్పందం కావాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా తమ ఆదాయాలకు రక్షణ కావాలన్నారు. మోటారు కంపెనీల అధిపతులు అత్యధిక స్థాయిలో వేతనాలు తీసుకుంటూ పోటీని తట్టుకునేందుకు తాము త్యాగాలు చేయాలని చెప్పటాన్ని విమర్శించిన కార్మికులతో అధ్యక్షుడు ఏకీభవించారు.

**అవి మంచి ఉద్యోగాలు కావు**

ఆర్థికవేత్తల ప్రకారం భారతదేశంలో ఉన్న ఆదాయాల సమస్య ఏమంటే వ్యవసాయం నుండి పారిశ్రామిక రంగం వైపు సరిపడినంతగా ప్రజలు తరల లేదు. భారతదేశ విధానకర్తలు 1990వ దశకంలో దగ్గర దారి కనిపెట్టామని భావించారు. వ్యవసాయ రంగం నుండి నేరుగా సర్వీసు రంగాన్ని అభివృద్ధి చేయాలనుకున్నారు. అమెరికా, చైనాల మాదిరిగా నిలకడైన అభివృద్ధి వైపు ఆలోచించలేదు. సమాచార సాంకేతిక రంగం నుండి ఎగుమతుల ద్వారా ఆర్థిక వ్యవస్థకు ఊపును తెచ్చారు. ఈ దగ్గర దారి విఫలమైంది. భారతదేశంలో వున్న అత్యధిక యువతను ఈ అత్యున్నత స్థాయి రంగం తనలో ఇముడ్చుకోలేదు. ఈ రంగంలో పని చేయాలంటే అధికస్థాయి విద్య ఉండాలి. ఇది గ్రామీణ ప్రజలకు లేదు.

వ్యవసాయం నుండి బయటకు వచ్చినపుడు వారి శక్తిసామర్థ్యాలకు తగిన ఉపాధి కావాలి. అక్కడి నుండి నిచ్చెనమెట్లు ఎక్కాలంటే అధిక నైపుణ్యాలను నేర్చుకుని అధిక ఆదాయం సంపాదించగలిగే ఉద్యోగాలు వారికి కావాలి. మొదటి అంచెలో శ్రమ తీవ్రత ఉండే ఉత్పాదక, సర్వీసు, నిర్మాణ రంగాలు ఆ అవకాశం కల్పిస్తాయి. వ్యవసాయ రంగం నుండి బయటకు వచ్చిన లక్షల మంది అటువంటి ఉద్యోగాల్లోకి ప్రవేశించారు.

సమస్య ఏమంటే రంగంతో సంబంధం లేకుండా వారికి దొరికిన ఉద్యోగాలు అంత మంచివి కావు. వేతనాలు సరిగా ఉండవు. పైగా వారికి దొరికేది తాత్కాలిక లేదా కాంట్రాక్ట్ ఉద్యోగాలు మాత్రమే. సామాజిక భద్రత ఉండదు. నైపుణ్యాలు పెంచుకునేందుకు సహాయం ఉండదు. భారీ, ఆధునిక మాన్యుఫాక్చరింగ్ పరిశ్రమల్లో కూడా కాంట్రాక్టర్ల ద్వారానే నియామకాలు జరుగుతున్నాయి. యజమానులు తమ ఖర్చును తగ్గించుకుంటున్నారు. పర్మినెంట్ కార్మికుల కంటే చాలా తక్కువగా వేతనాలు చెల్లిస్తున్నారు. వారి ఉపాధికి రక్షణ లేదు.

**ఆర్థిక సామర్థ్యాలు, మిగులును సృష్టించే కార్పొరేట్ సంస్థలకు బదులుగా వాస్తవ సామాజిక సంస్థలను సృష్టించే వైపు దృష్టి మరల్చాలి. సహాయకులు చేసే పనికి ఆర్థికవేత్తలు అధిక విలువ కట్టాలి. సాంప్రదాయకంగా కుటుంబ సేవలో ఉన్న మహిళలు పరిశ్రమలు, కార్యాలయాలు, మాల్స్ వైపు తరలించబడుతున్నారు. వేతనాల కోసం సంఘటిత రంగంలో పని చేసే మహిళల పనికి మాత్రమే ఆర్థికవేత్తలు విలువ కడుతున్నారు. సంపాదన కోసం ఇతరుల ఇళ్లల్లో సహాయకులు చేసే పని లేదా కుటుంబ వ్యవసాయ క్షేత్రాల్లో చేసే అసంఘటిత పనికి విలువ లెక్కించడం లేదు. తమ కుటుంబీకుల సేవలో ఉన్న మహిళల పనిలో ఉన్న విలువను చూడటం లేదు.**

ప్రపంచం ఒక మూల మలుపులో ఉంది. ఆర్థిక రంగంలో కొత్త ఆలోచనలు రావాలి. పర్యావరణ సహితమైన, సామాజిక సామరస్యమైన భవిష్యత్తును సృష్టించాలి. ఆ ఆలోచనల ప్రకారం అభివృద్ధిని, ఉద్యోగితను లెక్కించాలి. పనికి సంబంధించిన కొత్త భావాలు కావాలి. పని చేసే సంస్థల రూపకల్పన కూడా జరగాలి. ఈ సంస్థల్లో భాగస్వాముల మధ్య ఉండాల్సిన ఆర్థిక, సామాజిక సంబంధాలను కూడా మదింపు చేయాలి. పర్యావరణం పట్ల శ్రద్ధ పెరిగితే మరలా చిన్న సంస్థల అభివృద్ధి జరుగుతుంది.

స్థిర పెట్టుబడిని పెంచి వేతనాల ఖర్చును తగ్గించుకునే భారీ సంస్థలకు బదులుగా వివిధ సంస్థలు తమ అభివృద్ధి కోసం ఒక దానికి మరోటి సహాయపడేవి నిలకడగా అభివృద్ధి చెందాలి. ప్రపంచం లోని దూరపు ప్రాంతాల వినిమయదారుల కోసం జరిగే ఉత్పత్తులకు బదులుగా స్థానిక వినిమయానికి, మార్కెట్లకు ఉత్పత్తి జరిగితే స్థానిక పరిశ్రమలు అభివృద్ధి అవుతాయి.

**సహాయకుల సేవలకు విలువ కట్టాలి**

ఆర్థిక సామర్థ్యాలు, మిగులును సృష్టించే కార్పొరేట్ సంస్థలకు బదులుగా వాస్తవ సామాజిక సంస్థలను సృష్టించే వైపు దృష్టి మరల్చాలి. సహాయకులు చేసే పనికి ఆర్థికవేత్తలు అధిక విలువ కట్టాలి. సాంప్రదాయకంగా కుటంబ సేవలో ఉన్న మహిళలు పరిశ్రమలు, కార్యాలయాలు, మాల్స్ వైపు తరలించబడుతున్నారు. వేతనాల కోసం సంఘటిత రంగంలో పని చేసే మహిళల పనికి మాత్రమే ఆర్థికవేత్తలు విలువ కడుతున్నారు. సంపాదన కోసం ఇతరుల ఇళ్లల్లో సహాయకులు చేసే పని లేదా కుటుంబ వ్యవసాయ క్షేత్రాల్లో చేసే అసంఘటిత పనికి విలువ లెక్కించడం లేదు. తమ కుటుంబీకుల సేవలో ఉన్న మహిళల పనిలో ఉన్న విలువను చూడటం లేదు.

సంఘటిత ఆర్థిక సంస్థలుగా ఉన్న కార్పొరేట్ సంస్థలకు అనుకూలించే విధంగా సామాజిక సంస్థలను వక్రీకరించే ఆర్థిక సిద్ధాంతాలు ప్రస్తుతం చలామణిలో ఉన్నాయి. మానవులు ఒకరికొకరు సహాయపడటం తగ్గిపోయి డబ్బు ప్రధానంగా ఉన్న ఆర్థిక వ్యవస్థ పెరుగుతోంది. ఇరవయ్యవ శతాబ్దపు ఆర్థికాభివృద్ధి భావనలోకి మరింత కాలంపాటు ఆర్థికాభివృద్ధి మరియు ఉద్యోగిత కొలమానాలు కూరుకుపోకూడదు. మనకు భవిష్యత్తులో అవసరమయ్యే పని రూపాలు సంస్థల్లో ప్రతిబింబించే విధంగా వాటిని సంస్కరించాలి.

కార్మికులు, చిన్నరైతులు, చిన్న పెట్టుబడిదారులు, మహిళలకు ప్రస్తుత ఆర్థిక నమూనా విలువ ఇవ్వడం లేదు. వారు చెప్పేది వినే విధంగా విధాన రూప ప్రక్రియ వైపు మరలాలి. ప్రస్తుతం అధికారంలో ఉన్న ఆర్థిక నిపుణులు, పెద్ద ఆర్థిక సంస్థలు, బడా వ్యాపార కార్పొరేషన్లు వారి భావాలను కొట్టివేస్తున్నాయి. భవిష్యత్తులో మంచి విధానం కోసం చారిత్రిక గణాంకాలకు బదులుగా...తాము ఎదుర్కొనే సమస్యల గురించి పజలు చెప్పే వాటిని వినాలి.

**('ది హిందూ' సౌజన్యంతో స్వేచ్ఛానుసరణ)**

★

జనవాక్యం

## పుక్కిటి పురాణాలతో చదువులా!

రామాయణం, భారతం, గీత, వేదాలు, భూత వైద్యం, బల్లి శాస్త్రం, పిల్లి శాస్త్రం...కాదేదీ చదువులకనర్హం అన్నట్లుగా 7వ తరగతి నుండి 12వ తరగతి వరకు బోధించాలి అని ఎన్‌సిఇఆర్‌టి చైర్మన్ ఐజాక్ నిన్న ప్రకటించటం విద్యావ్యవస్థను సర్వనాశనం చేసేందుకు కంకణం కట్టుకున్నట్లుగా భావించాలి. రామాయణం, భారతం, గీత, వేదాలు ఇవి కేవలం ఒక మతానికి చెందినవిగానే గుర్తించాలి. ఖురాన్, బైబిల్ కుడా భోదించండి. వాటితోపాటు చార్వాకులు ఏం చెప్పారు, జైన మతం ఏం చెప్పింది? బౌద్ధం ఏం చెప్పింది? కుడా చెప్తే చరిత్ర కుడా నేర్చుకుంటారు. అయితే ఇది ఇతిహాసము....దీనికి రుజువులు ఉండవు అని చెప్పాలి. ఇది చరిత్ర వీటికి ఇవి రుజువులు అని కూడా చేప్తే బాగుంటుంది. అపుడే విద్యార్థి ఏది ఏమిటి అని అవగాహన కలిగి ఉంటాడు. మొన్ననే చంద్రునిమీదకి రాకెట్ పంపి శాస్త్రసాంకేతిక రంగాలలో ఇండియా కూడా ఎంతో ముందు ఉంది అని గొప్పగా చెప్పుకున్నాము. ఇతిహాసాలు ఏవీ కూడా పరిశోధనకు, రుజువుకి నిలబడవు. అవి కేవలం నమ్మకాలు మాత్రమే. ఇతిహాసాలలో ఏముందని విద్యార్థులకు బోధించటానికి యుజిసి నిర్ణయించింది? అసలు వేదం చదివితే శంభుకుని తలనరికినవారు ఇపుడు సూద్రులకు వేదం ఎలా భోదిస్తారు? వేదము విన్న సూద్రుల చెవుల్లో సీసము పోసి, చదివిన సూద్రుల నాలుకలు కోసినవారు సూద్రులకు వేదాలు ఎలా బోధిస్తారు? పాయసానికి పిల్లలు పుట్టవచ్చని, నాగలితో పొలం దున్నుతుంటే పిల్లలు దొరుకుతారని, పిండాన్ని కోసి వంద ముక్కలు చేసి కుండల్లో పెడితే పిల్లలు తయారౌతారని, మంత్రాలతో శత్రువును జయించవచ్చని ఇకముందు విద్యార్థులు చదువుకోవాలా! ఇప్పటికే కొన్ని యూనివర్శిటీలు వాస్తు, జ్యోతిష్యం, భూతవైద్యం కోర్సులుగాపెట్టి మోసం చేసి బతకండని పట్టాలు ఇచ్చి దేశం మీదికి వదులుతున్నాయి. మరి ఇతిహాసాలు చదివిన వారు ఎవరిని ఉద్ధరిస్తారు? ఇందంతా ప్రజలను ఆటవికానికి తీసుకపోవటం కాదా!! ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ఆవు పేడ, ఆవు మూత్రం చుట్టూ ప్రజలను తిప్పుతున్నది. గాయత్రీ మంత్రాన్ని పార్లమెంటులో ప్రార్ధనా గీతంగా చెయ్యాలని చూస్తున్నది. విద్య శాస్త్రీయంగా ఉంటేనే దేశం ముందుకు పోతుంది. శాస్త్రీయ విద్యను విద్యార్థులకు అందించాలి. పుక్కిటి పురాణాలను పాఠ్యాంశాలుగా పెట్టడం తక్షణం విరమించుకోవాలి.

**– నార్నె వెంకట సుబ్బయ్య,**
**ఎ.పి హేతువాద సంఘం అధ్యక్షుడు.**

# భారీ యంత్రాలతో ఇసుక తవ్వకాలు ఆపండి

## ధవళేశ్వరం వద్ద గోదావరిలో తవ్వకాలపై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

**ప్రజాశక్తి-అమరావతి**

ధవళేశ్వరం వద్ద గోదావరి నదిలో భారీ యంత్రాలతో ఇసుక తవ్వకాలు చేయరాదని హైకోర్టు బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తామిచ్చిన స్టే ఆదేశాల్ని ఉల్లంఘిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని అధికారులను ఉద్దేశించి చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ హెచ్చరించింది. రాజమహేంద్రవరం గ్రామీణ, పట్టణ ప్రాంతాల పరిధిలో గోదావరి నదిలో భారీ యంత్రాలతో ఇసుక తవ్వకాలు చేస్తున్నారని వంశీ దినేష్‌రెడ్డి దాఖలు చేసిన పిల్ తరుపున న్యాయవాది నర్రా శ్రీనివాసరావు వాదించారు. చట్ట వ్యతిరేకంగా భారీ యంత్రాలతో ఇసుక తవ్వుతున్నారని చెప్పారు. ధవళేశ్వరం వద్ద గోదావరి నదిలో భారీ యంత్రాలతో చేస్తున్న ఇసుక తవ్వకాలపై స్టే విధించిన హైకోర్టు విచారణను వాయిదా వేసింది.

**బౌద్ధమత ఆనవాళ్లను గుర్తించాలి..**

విశాఖ జిల్లా, భీమునిపట్నం మండలం, తొట్లకొండలోని బౌద్ధక్షేత్ర పరిధిలో ప్రభుత్వం డీ నోటిఫై చేసిన భూమిని సర్వే చేయాలని ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియాను హైకోర్టు బుధవారం ఆదేశించింది. ఆ భూముల్లో బౌద్ధమత నిర్మాణాలు, ఆనవాళ్లు ఉన్నాయో లేదో కూడా గుర్తించాలంది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది. తొట్లకొండ బౌద్ధ క్షేత్రం పరిధిని తగ్గిస్తూ ప్రభుత్వం 2021లో జారీ చేసిన జీవో 131ను జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ పర్యావరణవేత్త ఎల్ రాణిశర్మ పిల్ దాఖలు చేశారు. చారిత్రక ప్రాముఖ్యత ఉన్న బౌద్ధ క్షేత్ర పరిధి తగ్గింపు చెల్లదని సీనియర్ న్యాయవాది కెఎస్ మూర్తి వాదించారు. దీంతో హైకోర్టు పైవిధంగా ఆదేశించి విచారణను వాయిదా వేసింది.

# నివేదికపై ఏం చర్యలు తీసుకున్నారు?

- టిటిడిని ఆదేశించిన హైకోర్టు

**ప్రజాశక్తి-అమరావతి**

తిరుమల నడక మార్గంలో వన్యప్రాణుల నుంచి యాత్రికులను రక్షించే విషయంలో వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలోని నిపుణుల కమిటీ నివేదిక మేరకు తీసుకున్న చర్యలను వివరించాలని టిటిడిని హైకోర్టు ఆదేశించింది. నడక దారి మార్గంలో చిరుతపులి దాడిలో మరణించిన చిన్నారి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేయాలన్న ఉత్తర్వులు అమలు చేయకపోవడంపై అసంతృప్తిని వ్యక్తం చేసింది. అలిపిరి నుంచి తిరుమల వరకు నడక దారి వెంట ఇనుప కంచె ఏర్పాటు చేసేలా టిటిడి అధికారులను, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలంటూ తిరుపతికి చెందిన గుడిపల్లి భానుప్రకాశ్‌రెడ్డి దాఖలు చేసిన పిల్‌ను చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం విచారణ జరిపింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

# జనవరి 4 నుంచి పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్

- సాంకేతిక విద్య కమిషనర్ నాగరాణి

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ప్రతియేటా పాలిటెక్నిక్ విద్యార్థులకు నిర్వహించే పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2023-24 కార్యక్రమాన్ని జనవరి 4, 5, 6 తేదీల్లో నిర్వహించనున్నట్లు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సిహెచ్ నాగరాణి తెలిపారు. అనంతపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 26వ మీట్ జరగనుందని చెప్పారు. ఇందుకు సంబంధించిన వాల్ పోస్టరును సాంకేతిక విద్య కమిషనరేట్ కార్యాలయంలో బుధవారం ఆమె ఆవిష్కరించారు. డిసెంబర్ 5 నుంచి 9 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రాంతీయ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లు వివిధ ప్రాంతాల్లో జరుగుతాయని వివరించారు. రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కళాశాలల్లో యువ అథ్లెట్లను ప్రోత్సహిస్తూ నిజమైన నాయకత్వ, క్రీడాస్ఫూర్తిని పెంపొందించేలా కార్యక్రమానికి రూపకల్పన చేశామన్నారు. పట్టుదల, సహనం గురించి జీవితంలో అత్యంత పాఠాలను బోధించేది క్రీడా రంగం మాత్రమేనని అన్నారు. జాతీయ అత్యవసర సమయాల్లో దేశ ప్రయోజనాలను కాపాడేందుకు, విద్యార్థులను శారీరకంగా దృఢంగా, సామాజికంగా అప్రమత్తంగా ఉండేందుకు క్రీడలు దోహదం చేస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక విద్య సంయుక్త సంచాలకులు వి పద్మారావు, ప్రాంతీయ సంయుక్త సంచాలకులు నిర్మల్ కుమార్ ప్రియ, సత్యనారాయణ మూర్తి, సాంకేతిక విద్య శిక్షణ మండలి కార్యదర్శి రమణ బాబు, సంయుక్త కార్యదర్శి జానకి రామయ్య పాల్గొన్నారు.

# నన్నయలో 'సంపూర్ణత ద్వారా శ్రేష్ఠత'పై సెమినార్

**ప్రజాశక్తి-రాజానగరం (తూర్పుగోదావరి జిల్లా)**

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఓటుకు నోటు కేసుపై విచారణ సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఈ కేసులో చంద్రబాబును పార్టీ చేయాలని, సిబిఐతో దర్యాప్తు చేయించాలని వైసిపి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి దాఖలు చేసిన పిటిషన్ బుధవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ అరవింద్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. అయితే సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూథ్రా అందుబాటులో లేకపోవడంతో విచారణ వారంపాటు వాయిదా వేయాలని ధర్మాసనానికి చంద్రబాబు తరపు న్యాయవాది గుంటూరు ప్రభాకర్ లిఖితపూర్వకంగా అభ్యర్థించారు. ఈ మేరకు విచారణను జనవరి రెండో వారానికి వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది.

## వాతావరణ మార్పులు వణికిస్తున్నాయి

(మొదటి పేజీ తరువాయి)

పంట నష్టం జరిగినట్లు నివేదికలో పేర్కొన్నారు. అయితే, పంట నష్ట తీవ్రత కూడా గత ఏడాదితో పోలిస్తే అధికంగా ఉంటుందని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.

**జనవరి - ఫిబ్రవరి నెలల్లో**

ఈ ఏడాది జనవరి-పిబ్రవరి నెలల్లో 28 రోజులు తీవ్ర ఘటనలు చోటుచేసుకున్నాయి. వీటిలో 21 రోజులు తీవ్రమైన చలిగాలులు దేశాన్ని వణికించాయి. పిడుగుపాటు ఘటనలు, భారీ వర్షాల వంటి సంఘటనలు కూడా ఉత్తర భారతంలో చోటుచేసుకున్నాయి. ఫలితంగా దేశ వ్యాప్తంగా ఎనిమిది మంది మృత్యువాత పడ్డారు. జనవరి నెలలో ఎనిమిది సంవత్సరాల్లోనే అత్యధిక ఉష్ణోగ్రత కలిగిన రోజు దక్షిణ భారతంలో నమోదైంది. ఆ రోజున సగటున 30.59 సెల్సియస్ ఉష్ణోగ్రత దక్షిణ భారతంలో నమోదైంది. ఈ నెలల్లో పంజాబ్, హర్యానా రాష్ట్రాలపై తీవ్ర ప్రభావం పడింది. ఆ రాష్ట్రాల్లో 15 రోజుల్లో తీవ్ర వాతావరణ సంఘటనలు చోటుచేసుకున్నాయి.

**మార్చి నుండి మే వరకు**

మార్చి - మే నెలల మధ్య కూడా అనేక రాష్ట్రాలో వర్షాలు, వరదలు, పిడుగుపాట్ల వంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. 16 రోజులు భారీ వర్షాలు, వరదలు సంభవించగా, 79 రోజుల్లో పిడుగులు పడ్డాయి. 28 రోజులు దేశ వ్యాప్తంగా తీవ్ర వడగాల్పులు వీచాయి. ఫలితంగా దేశ వ్యాప్తంగా 321 మంది మరణించారు. మార్చి నుండి మే నెల వరకు గత ఏడాది 10 వేల హెక్టార్లలో పంట నష్టం చోటుచేసుకోగా, ఈ ఏడాది 6 లక్షల 40 వేల హెక్టార్లలో నష్టం జరిగింది. భారీ వర్షాలు, వరదల ప్రభావం మహారాష్ట్ర, రాజస్తాన్‌లపై తీవ్రంగా పడింది.

**జూన్ నుండి సెప్టంబర్ వరకు**

జూ నుండి సెప్టెంబర్ వరకు దేశ వ్యాప్తంగా 122 తీవ్ర వాతావరణ సంఘటనలు నమోదైనాయి. వీటిలో 115 రోజుల్లో భారీ వర్షాలు, కొండ చరియలు విరిగిపడటం వంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. వీటి బారిన పడి దేశ వ్యాప్తంగా 2,594 మంది మరణించారు. 2022లో ఈ కాలంలో తీవ్ర వాతావరణ సంఘటనల కారణంగా 2,431 మంది మరణించారు. రుతుపవనాలు ఆలస్యంగా ప్రారంభమైనప్పటికీ, సీజన్ ప్రారంభంలోనే వచ్చిన బిపర్ జాయ్ తుపాన్ పశ్చిమ రాష్ట్రాలపై తీవ్ర ప్రభావం చూపింది. జులై నెలల్లో హిమాచల్ ప్రదేశలో అకస్మిక వరదలు చోటుచేసుకున్నాయి.

# ఉన్నత విద్యలో ముస్లిం విద్యార్థుల వెనుకబాటు

**న్యూఢిల్లీ :** దేశంలో ముస్లిం విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడంలో వెనుకబడుతున్నట్లు నివేదికలు స్పష్టం చేశాయి. ఏడాదికేడాదికి ఉన్నత విద్యను చదివే ముస్లిం విద్యార్థుల సంఖ్య గణనీయంగా పడిపోతుందని ఇండియా సర్వే ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ (AISHE),యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్(UDISEP)లు విడుదల చేసిన నివేదిక స్పష్టం చేసింది. 18-23 సంవత్సరాల వయస్సు గల ముస్లిం విద్యార్థుల విద్యపై విశ్లేషణ జరిపి సేకరించిన ఆధారాల ప్రకారం 2020-21లో గత ఏడాది కంటే 8.5 శాతం తగ్గింది. 2019-20లో 21 లక్షల మంది ముస్లిం విద్యార్థులు ఉన్నత విద్య కోసం దరఖాస్తు చేసుకోగా, 2020-21 నాటికి వారి సంఖ్య 19.21 లక్షలకు పడిపోయింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్ మాజీ ప్రొఫెసర్ అరుణ్ సి.మెహతా "భారతదేశంలో ముస్లిం విద్య స్థితి" అనే నివేదికను రూపొందించారు. 2016-17లో 17,39,218 మంది ముస్లిం విద్యార్థులు ఉన్నత విద్యలో చేరగా, 2020-21 నాటికి వారి సంఖ్య 19,21,713కి పెరిగింది. అయితే 2019-20లో 21,00,860 మందికి చేరగా, 2020-21లో 19,21,713 మందికి పడిపోయింది.

ఉన్నత విద్యలో షెడ్యూల్డ్ కులాలు మరియు షెడ్యూల్డ్ తెగల కంటే ముస్లింలు వెనుకబడి ఉన్నారు. దరఖాస్తు చేసుకున్న మొత్తం విద్యార్థుల సంఖ్యతో పోలిస్తే ఉన్నత విద్యలో చేరిన ముస్లిం విద్యార్థుల శాతం కూడా స్వల్పంగా తగ్గింది, ఇది 2016-17లో 4.87 నుండి 2020-21లో 4.64కి పడిపోయింది. మొత్తం నమోదు చేసుకున్న 6.67 కోట్ల మంది ముస్లిం విద్యార్థులలో ఎగువ ప్రాథమిక స్థాయిలో (6-8వ తరగతి) దాదాపు 14.42% ఉండగా, ద్వితీయ స్థాయిలో (9-10వ తరగతి) 12.62%, ఉన్నత

మాధ్యమిక స్థాయిలో (11-12వ తరగతి) స్వల్పంగా తగ్గి 10.76% గా ఉందని నివేదిక పేర్కొంది. సెకండరీ లెవల్‌లో చేరిన ముస్లిం విద్యార్థుల్లో 18.64 శాతం మంది విద్యకు దూరమవుతున్నారని, మొత్తం విద్యార్థుల్లో వీరి డ్రాపౌట్ రేటు 12.6 శాతం కంటే ఎక్కువగా ఉందని నివేదిక పేర్కొంది. అస్సాం (29.52శాతం), పశ్చిమ బెంగాల్ (23.22 శాతం ) ముస్లిం విద్యార్థులలో అధిక డ్రాపౌట్ రేటు నమోదు కాగా, జమ్మూ మరియు కాశ్మీర్‌లో 5.1 శాతం మరియు కేరళలో 11.91శాతం నమోదయ్యాయి. "సమగ్ర విధానాలను అమలు చేయడం ద్వారా అంతరాలను తగ్గించడంలో మరియు అందరికీ సమాన విద్యా అవకాశాలను అందించడంలో సహాయపడుతుంది" అని నివేదిక స్పష్టం చేసింది.

తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాలు కావడంతో ఉన్నత విద్యకు ఖర్చును భరించలేకపోతున్నారని నివేదిక పేర్కొంది. దీంతో ఈ సమస్యను పరిష్కరించడానికి .. అర్హులైన విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించాల్సి వుందని పేర్కొంది. ముస్లిం విద్యార్థుల కోసం కేటాయించిన స్కాలర్‌షిప్‌లు, గ్రాంట్లు మరియు ఆర్థిక సహాయ అవకాశాల సంఖ్యను గణనీయంగా పెంచాల్సి వుందని తెలిపింది. దీంతో అర్హులైన అధిక శాతం మంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు అవకాశం కలుగుతుందని నివేదిక సూచించింది.

## శ్వాసకోశ ఇన్ఫెక్షన్లపై కేంద్రం అప్రమత్తం

- 6 రాష్ట్రాలకు సూచనలు

**న్యూఢిల్లీ :** శ్వాసకోశ ఇన్ఫెక్షన్లపై కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ముఖ్యంగా ఆరు రాష్ట్రాలకు కేంద్రం పలు సూచనలు చేసింది. రాజస్థాన్, కర్ణాటక, గుజరాత్, ఉత్తరాఖండ్, హర్యానా, తమిళనాడు రాష్ట్రాలను అలర్ట్ చేసింది. దీంతో శ్వాసకోశ సమస్యలను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉండాలని ఆస్పత్రులు, ఆరోగ్య సిబ్బందిని ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు ఆదేశించాయి. సీజనల్ ఫ్లూ పట్ల అప్రమత్తంగా ఉండాలని కర్ణాటక ఆరోగ్యశాఖ సూచించింది. సీజనల్ ఫ్లూ లక్షణాలను వివరిస్తూ ఓ నివేదిదకను జారీ చేయడంతో పాటు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను జాబితా చేసింది. తుమ్ము, దగ్గు వచ్చినప్పుడు నోరు, ముక్కును కవర్ చేయాలని, తరచూ చేతులు శుభ్రం చేసుకోవాలని, రద్దీ ప్రాంతాల్లో మాస్కులు ధరించాలని, చేతులతో ముఖాన్ని తాకవద్దని హెచ్చరించింది. ఈ వ్యాధి పట్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాజస్థాన్ ఆరోగ్య శాఖ పేర్కొంది. అయితే ఈ వ్యాధి వ్యాప్తిని అడ్డుకునేందుకు పలు చర్యలు చేపట్టాలని వైద్య సిబ్బందిని హెచ్చరించింది. చర్యలు చేపట్టాలని వైద్య సిబ్బందిని ఆదేశించింది. పిడియాట్రిక్ యూనిట్లు, మెడికల్ విభాగాల్లో తగిన ఏర్పాట్లు చేయాలని తెలిపింది. కొవిడ్ సమయంలో అప్రమత్తమైనట్లు ప్రస్తుత పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు గుజరాత్ ఆరోగ్య మంత్రి రుషికేశ్ పటేల్ తెలిపారు. శ్వాసకోశ సమస్యలతో ఆస్పత్రిలో చేరితే తక్షణమే రిపోర్టు చేయాలని హర్యానా ఆరోగ్య శాఖ ఆదేశించింది. తమిళనాడు, ఉత్తరాఖండ్‌లోనూ ఇదే విధమైన హెచ్చరికలు జారీ అయ్యాయి.

## 20 ఖనిజ బ్లాకుల వేలం ప్రక్రియ ప్రారంభం

**న్యూఢిల్లీ :** దేశంలో కీలకమైన, వ్యూహాత్మకమైన ఇరవై ఖనిజ బ్లాకులను మోడీ ప్రభుత్వం వేలం వేస్తోంది. ఈ బ్లాకుల మొత్తం విలువ సుమారు రూ. 45 వేల కోట్లు ఉంటుందని కేంద్రం అంచనా వేస్తుంది. ఈ ప్రక్రియకు సంబంధించిన టెండర్ పత్రాల అమ్మకం బుధవారం ప్రారంభమైంది. ఖనిజ బ్లాకులను రెండు దశలుగా ఆన్‌లైన్‌లో వేలం వేస్తారు. పునరుద్పాదక ఇంధనం, రక్షణ, వ్యవసాయ రంగాల అవసరాలకు ఈ ఖనిజాలు కీలకంగా ఉన్నాయి. వేలం వేసే ఖనిజ బ్లాకులు, వేలం నిబంధనలు, సమయం తదితర వివరాలు ఎంఎస్‌టీసీ వేలం వేదికలో పొందవచ్చునని గనుల మంత్రిత్వ శాఖ ఓ అధికారిక ప్రకటనలో తెలిపింది. వేలం ద్వారా లభించే సొమ్మును ఆయా రాష్ట్రాలకు అందజేస్తారు. ఖనిజ బ్లాకుల వేలం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని, దేశ భద్రత పెరుగుతుందని, భవిష్యత్తులో స్వచ్ఛమైన ఇంధనం కోసం చేసే ప్రయాణానికి మద్దతు లభిస్తుందని గనుల మంత్రిత్వ శాఖ వివరించింది. 'కీలక, వ్యూహాత్మక ఖనిజాలకు చాలా డిమాండ్ ఉంది. ప్రస్తుతం దిగుమతుల ద్వారా ఆ డిమాండ్‌ను తీర్చుకుంటున్నాం. దేశంలో ఖనిజాల లభ్యత తక్కువగా ఉంది. కొన్ని దేశాల్లో వాటి తవ్వకాలు, ప్రాసెసింగ్ తక్కువగా జరుగుతున్నాయి. దీంతో సరఫరాలలో ఇబ్బందు లు ఎదురవుతున్నాయి. లిథియమ్, గ్రాఫైట్, కోబాల్ట్, టిటానియం వంటి ఖనిజా లపై ఆధారపడిన సాంకేతికత భవిష్యత్తులో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఎంతగానో ఉపకరిస్తుంది' అని మంత్రిత్వ శాఖ తెలియజేసింది.

2030 నాటికి విద్యుచ్ఛక్తి స్థాపక సామర్థ్యంలో 50 శాతాన్ని శిలాజ యేతర వనరుల నుండి పొందాలని భారత్ లక్ష్యంగా నిర్దేశించుకుంది. దీనివల్ల విద్యుత్ కార్లు, పవన-సౌర విద్యుత్ ప్రాజెక్టులు, బ్యాటరీ నిల్వ వ్యవస్థలకు డిమాండ్ ఏర్పడుతుంది. ఫలితంగా కీలక ఖనిజాలకు గిరాకీ వస్తుంది. మైనింగ్ నిబంధనల్లో సవరణలు చేయడం ద్వారా ప్రభుత్వం ఇటీవల 24 ఖనిజాలను కీలక, వ్యూహాత్మకమైనవిగా నోటిఫై చేసింది.

# కాల్పుల విరమణ మరోసారి పొడిగించే యోచన

- ముమ్మరంగా చర్చలు
- రెండు దేశాల ఏర్పాటే పరిష్కారం : ఐరాస

**గాజా :** గాజాలో కాల్పుల విరమణను మరోసారి పొడిగించే విషయమై ముమ్మరంగా చర్చలు జరుగుతున్నాయి. ఇవి ఒక కొలిక్కి వచ్చినట్టేనని భావిస్తున్నారు. కాల్పుల విరమణ పొడిగింపునకు హమాస్ సుముఖంగానే వుంది. అయిదో విడత బందీలు, ఖైదీల విడుదలలో భాగంగా ఇజ్రాయిల్ జైళ్ళ నుండి 30మంది పాలస్తీనియన్లు, పిల్లలు విడుదల కాగా, పది మంది ఇజ్రాయిలీలను, ఇరువురు విదేశీ జాతీయులను హమాస్ విడుదల చేసింది. పలువురు రష్యన్ బందీలు బుధవారం విడుదలయ్యే అవకాశం వుందని హమాస్ అధికారులు తెలిపారు. బ్రస్సెల్స్‌లో పత్రికా విలేకరుల సమావేశంలో అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ మాట్లాడుతూ, కాల్పుల విరమణను పొడిగించేందుకు చేయాల్సిందంతా చేస్తున్నామని చెప్పారు. ఈ ఘర్షణలు ఇతర ప్రాంతాలకు విస్తరించకుండా వుండేందుకు, గాజా నుండి అమెరికన్లు సహా ఇతర విదేశీ జాతీయులందరూ సురక్షితంగా బయటపడేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మరోవైపు హమాస్ పొలిటికల్ బ్యూరో సభ్యుడు ఘాజి హమద్ మాట్లాడుతూ, కాల్పుల విరమణ పొడిగింపు కోసం తాము తీవ్రంగా కృషి చేస్తున్నామని చెప్పారు. సద్దుబాటు కోసం మధ్యవర్తిత్వం జరుపుతున్న ఇతర దేశాలతో కలిసి హమాస్ పనిచేస్తోందన్నారు. కాల్పుల విరమణను పొడిగిస్తే మరింత మంది బందీలను విడుదల చేసేందుకు సిద్ధంగా వున్నమన్నారు. ఖతార్, ఈజిప్ట్‌ల్లోని తమ సోదరులతో నిత్యం సంబంధాలను కలిగివున్నామని చెప్పారు.

**సవాలుగా మారిన మృతదేహాల తొలగింపు**

గాజాలో ఇజ్రాయిల్ విచక్షణారహితంగా బాంబు దాడులు జరిపిన వారాల తర్వాత శిథిలాల గుట్టల్లో నుండి మృతదేహాలను తవ్వి వెలికితీయడం అత్యంత క్లిష్టంగా, పెను సవాలుగా మారిందని గాజా పౌర రక్షణ దళానికి చెందిన సభ్యుడు ఖలీల్ అబూ షమాలా వ్యాఖ్యానించారు. ఇలాంటి సంక్షోభ సమయాల్లో ఉపయోగించడానికి వీలుండే భారీ యంత్రాలు తమ వద్ద లేవని, అందువల్ల శిథిలాలను తొలగించి మృత దేహాలను వెలికితీయడమే అసాధ్యమైన పనిగా మారిందని ఆయన మీడియాతో వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ సమాజం వాస్తవికంగా ఇందులో జోక్యం చేసుకోకపోతే దీన్ని పూర్తి చేయడం కష్టమని అన్నారు. కనీసం7వేల మృతదేహాలు శిధిలాల్లో పడి వున్నాయని అంచనా.

**రెండు దేశాల ఏర్పాటు దిశగా కదలాలి**

ఈ ఘర్షణకు శాశ్వత పరిష్కారం కోసం రెండు దేశాల ఏర్పాటు దిశగా అంతర్జాతీయ సమాజం కదలాల్సి వుందని ఐక్యరాజ్య సమితి (ఐరాస)కోరింది. రెండు దేశాలకూ జెరూసలెమ్‌నే రాజధానిగా వుండాలని పేర్కొంది. ఐరాస తీర్మానాలు, అంతర్జాతీయ చట్టాలు ప్రాతిపదికగా ఈ చర్యలు తీసుకోవడం అవసరమని ఐరాస చీఫ్ ఆంటోనియో గుటెరస్ తరపున జెనీవాలోని యుఎన్ కార్యాలయం డైరెక్టర్ జనరల్ తాతియానా వాలోవయా చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. శాంతి భద్రతలతో ఇజ్రాయిల్, పాలస్తీనా పక్కపక్కనే మనుగడ సాగించాలని అభిలషించారు.

**యుద్ధ నేరాలపై స్వతంత్ర దర్యాప్తు జరగాలి**

**జెనీవా :** ఇజ్రాయిల్‌లో, ఆక్రమిత పాలస్తీనా భూభాగంలో జరుగుతున్న యుద్ధ నేరాల ఆరోపణలపై కచ్చితమైన, పారదర్శకమైన, స్వతంత్ర దర్యాప్తు చేపట్టాలని ఐక్యరాజ్య సమితి నిపుణులు బుధవారం పిలుపునిచ్చారు. ఈ సాయుధ ఘర్షణలో పౌరుల ప్రాణాలను కాపాడాలని, అంతర్జాతీయ చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని సంబంధిత పక్షాలను వారు కోరారు. స్వతంత్ర దర్యాప్తు చేపట్టే అధికారులకు అవసరమైన వనరులు అందచేయాలని, మద్దతునివ్వాలని, తద్వారా నిష్పాక్షికంగా, కూలంకషమైన దర్యాప్తులకు అవసరమైన వెసులుబాటు కల్పించాలని వారు కోరారు. ఈ దర్యాప్తులకు పూర్తిగా సహకరించాల్సిందిగా ఇజ్రాయిల్, పాలస్తీనా అథారిటీ, గాజాలోని డీ ఫ్యాక్టో అధికారులకు వారు విజ్ఞప్తి చేశారు.యుద్ధ నేరాలపై, మానవాళిపై జరుగుతున్న నేరాలు, హత్యలు, ఇతర రకాలైన హింసపై దర్యాప్తు చేయడమన్నది చట్టపరమైన ప్రాథమిక బాధ్యత అని వారు పేర్కొన్నారు.

# నేటి నుండే కాప్ 28

- వాతావరణ మార్పులపై నేతల చర్చలు
- గ్లోబల్ వార్మింగ్ అదుపే లక్ష్యం

**దుబాయ్ :** ఈనాడు భూగోళం ఎదుర్కొంటున్న అత్యంత తీవ్రమైన సవాళ్ళలో ఒకటైన గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పులను పరిష్కరించేందుకు చేపట్టాల్సిన చర్యలపై గురువారం నుండి రెండు వారాల పాటు ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో జరిగే కాప్ 28 సదస్సుకు ప్రపంచవ్యాప్తంగా 70వేల మందికి పైగా ప్రతినిధులు హాజరు కానున్నారు.

కాప్ 28 అంటే వాతావరణ మార్పులపై ఐక్యరాజ్య సమితి ఒప్పంద చట్రపరిధి (యుఎన్ఎఫ్‌సిసిసి)లోని పక్షాల 28వ సమావేశం. రియో సదస్సు జరిగి, యుఎన్ఎఫ్‌సిసిసి ప్రారంభించిన మూడు దశాబ్దాల కాలంలో ప్రతి ఏటా ఈ పక్షాలన్నీ సమావేశమై వాతావరణ మార్పులను పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, లక్ష్యాలపై చర్చిస్తుంది. గత సమావేశం ఈజిప్ట్‌లోని షర్మ్ ఎల్ షేక్‌లో జరిగింది. వాతావరణ మార్పుల వల్ల సంభవించే నష్టానికి పరిహారం చెల్లించే నిధి ఏర్పాటుకు ఆ సమావేశంలో అంగీకారం కుదిరింది. దాన్ని పెద్ద పురోగతిగా అభివర్ణించారు. 2015లో కాప్ 21 జరిగింది. అందులో పారిస్ ఒప్పందం కుదిరింది. గ్లోబల్ వార్మింగ్‌ను 1.5డిగ్రీలకు పరిమితం చేయాలని అందుకు సమిష్టిగా కార్యాచరణ చేపట్టాలని కోరుతున్న ఈ ఒప్పందం చారిత్రాత్మకమైనది. దుబాయ్‌లో నవంబరు 30 నుండి డిసెంబరు 12 వరకు కాప్ 28 సమావేశాలు జరుగుతున్నాయి. ప్రభుత్వాలు, వ్యాపారవేత్తలు, పౌర సంస్థల ప్రతినిధులు అందరూ సమావేశమై వాతావరణ మార్పులకు నిర్దిష్టమైన పరిష్కారాలను అన్వేషిస్తారు.

ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా పలు చోట్ల సంభవించిన వాతావరణ విపత్తులు చూస్తుంటే వాతావరణ మార్పులను పరిష్కరించడం ఎంత అత్యవసరమో స్పష్టమవుతోంది. జులై మాసం ప్రపంచంలోనే అత్యంత వేడిమి గల మాసంగా నమోదైంది. గ్లోబల్ వార్మింగ్ శకం ముగిసిందని, ఇక గ్లోబల్ బాయిలింగ్ శకం వచ్చేసిందని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుటెరస్ హెచ్చరించారు. పారిస్ ఒప్పందం పేర్కొంటున్న మేరకు, ప్రతి ఐదేళ్ళకోసారి దేశాలన్నీ సమావేశమై తాము తీసుకుంటున్న వాతావరణ చర్యలను చర్చించాల్సి వుంటుంది. ఈ చర్చల ఫలితాలు కొత్తగా నిర్ణయాలు తీసుకోవడానికి ప్రేరణ కలిగిస్తాయి.

గ్లోబల్ వార్మింగ్‌ను నిలువరించేందుకు ఇచ్చిన హామీలు, నిబద్ధతలను నెరవేర్చడం నుండి ఎంత మేరకు పక్కకు మళ్ళామో దుబాయ్ సమావేశంలో చర్చించనున్నారు. ఆ రకంగా తాము చేసిన తప్పులను దిద్దుకుని, మరింత సమర్ధవంతమైన కార్యాచరణను అమలు చేసేందుకు కాప్ 28 కీలకమైన అవకాశాలను కలిగిస్తుందని భావిస్తున్నారు.

దుబాయ్‌లోని ఎక్స్‌పో సిటీలో కాప్ 28 సదస్సు జరుగుతోంది. ప్రధానంగా బ్లూ జోన్, గ్రీన్ జోన్ అని రెండు వేదికలు ఏర్పాటు చేశారు. శిలాజ ఇంధనాలన నుండి పరిశుద్ధ ఇంధన వనరులకు ఎంత త్వరగా, సమర్ధవంతంగా మారిపోతామో దానిపై లక్ష్య సాధన ఆధారపడి వుంటుంది.కాప్-28 సదస్సుకు అమెరికా అధ్యక్షుడు బైడెన్ హాజరుకావడం లేదని వైట్ హౌస్ తెలియజేసింది. ఆయన బదులు ఉన్నతాధికార ప్రతినిధి బృందం హాజరవుతుందని పేర్కొంది. పశ్చిమాసియాలో పరిస్థితిపై దృష్టిసారించాల్సి ఉన్నందునే బైడెన్ ఈ సమావేశానికి హాజరు కావడం లేదని అది వివరణ ఇచ్చింది. నెతన్యాహు హాజరు కూడా అనుమానమేనని అంటున్నారు.

## సిరియన్ గోలన్ హైట్స్ నుండి ఇజ్రాయిల్ వైదొలగాలి

- ఐరాస జనరల్ అసెంబ్లీ తీర్మానానికి అనుకూలంగా భారత్ ఓటు

**న్యూయార్క్ :** సిరియన్ గోలన్ హైట్స్ నుండి ఇజ్రాయిల్ వైదొలగకపోవడం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ (యుఎన్‌జిఎ) రూపొందించిన ముసాయిదా తీర్మానానికి అనుకూలంగా భారత్ ఓటు వేసింది. సిరియాలోని వాయువ్య ప్రాంతమైన గోలన్ హైట్స్‌ను 1967లో ఆరు రోజుల పాటు జరిగిన యుద్ధంలో ఇజ్రాయిల్ ఆక్రమించుకుంది. మధ్య ప్రాచ్యంలో పరిస్థితి అన్న పేరుతో రూపొందించిన ఈ తీర్మానంపై మంగళవారం ఓటింగ్ జరిగింది. ఈజిప్ట్ దీన్ని ప్రవేశపెట్టగా 91 దేశాలు అనుకూలంగాను, 8 దేశాలు వ్యతిరేకంగాను ఓటు వేశాయి. మరో 62 దేశాలు గైర్హాజరయ్యాయి. భారత్‌తో పాటూ చైనా, రష్యా, దక్షిణాఫ్రికా సహా పలు దేశాలు అనుకూలంగా ఓటు వేశాయి. ఆస్ట్రేలియా, కెనడా, బ్రిటన్, అమెరికా, ఇజ్రాయిల్‌లు వ్యతిరేకంగా ఓటు వేశాయి. 1967 నుండి తన అదుపులో వున్న సిరియన్ గోలన్ ప్రాంతం నుండి ఇజ్రాయిల్ వైదొలగకపోవడం పట్ల తీర్మానం తీవ్ర ఆందోళన వెలిబుచ్చింది. భద్రతా మండలి, జనరల్ అసెంబ్లీ తీర్మానాలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని పేర్కొంది. ఆక్రమించిన సిరియన్ గోలన్ ప్రాంతంలో తన చట్టాలు అమలు చేసేందుకు ఇజ్రాయిల్ తీసుకున్న నిర్ణయం చెల్లదని గతంలోనే భద్రతా మండలి తీర్మానించిందని, దానికి అనుగుణంగా వ్యవహరించడంలో ఇజ్రాయిల్ విఫలమైందని విమర్శించింది. అక్కడ ఇజ్రాయిల్ అక్రమంగా నిర్మించిన కట్టడాలు కూడా చట్టవిరుద్ధమైనవేనని తీర్మానం స్పష్టం చేసింది. భద్రతా మండలి తీర్మానాలకు అనుగుణంగా ఆక్రమిత ప్రాంతం నుండి ఇజ్రాయిల్ తన బలగాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది.

## యుద్ధ్‌వీర్ సింగ్ అరెస్టు అక్రమం : ఎఐకెఎస్

**న్యూఢిల్లీ :** ఎస్‌కెఎం సీనియర్ నాయకులు, బికెయు ప్రధాన కార్యదర్శి యుద్ధ్‌వీర్ సింగ్‌ను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేయడాన్ని ఎఐకెఎస్ తీవ్రంగా ఖండించింది. బుధవారం తెల్లవారుజామున ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో యుద్ధ్‌వీర్ సింగ్‌ను అరెస్టు చేశారు. నేషనల్ ఇన్వెస్టిగేటింగ్ ఏజెన్సీ (ఎన్ఐఎ) యుధవీర్‌పై లుక్ అవుట్ నోటీసు జారీ చేసిందని, ఢిల్లీ రైతు ఉద్యమానికి సంబంధించి యుద్ధ్‌వీర్ సింగ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు. యుద్ధ్‌వీర్ సింగ్ అరెస్టుకు వ్యతిరేకంగా ఢిల్లీలోని టోల్‌ప్లాజాను రైతులు దిగ్బంధించడంతోపాటు, రైతు సంఘాల నుంచి తీవ్ర స్థాయిలో విమర్శలు రావడంతో ఆయన్ను ఢిల్లీ పోలీసులు కొన్ని గంటల తరువాత విడుదల చేశారు. విదేశాలకు వెళ్లడానికి అనుమతించారు.యుద్ధ్‌వీర్ సింగ్ అరెస్టును ఖండిస్తూ ఎఐకెస్ ఒక ప్రకటన విడుదల చేసింది. అసమ్మతి స్వరాలన్నీ అణిచివేయడానికి, ప్రజల ప్రతిఘటన ఉద్యమంపై ఉక్కు పాదం మోపడానికి కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం, ముఖ్యంగా హోం మంత్రిత్వ శాఖ చేస్తున్న హేయమైన ప్రయత్నాలు ఫలించవని ఎఐకెఎస్ ప్రకటనలో స్పష్టం చేసింది. ఈ అరెస్టు నరేంద్ర మోడీ పాలనలోని నిరంకుశ ధోరణికి తాజా ఉదాహరణ అని పేర్కొంది.

## శాంతి ఒప్పందంపై యుఎన్‌ఎల్‌ఎఫ్ సంతకం

**న్యూఢిల్లీ:** సుమారు ఆరు నెలల నుంచి హింసాకాండ కొనసాగుతున్న మణిపుర్‌లో శాంతి పునరుద్ధరణలో కీలక పరిణామం చోటుచేసుకుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా బుధవారం తెలిపారు. శాంతి ఒప్పందంపై యునైటెడ్ నేషనల్ లిబరేషన్ ఫ్రంట్ (యుఎన్ఎల్ఎఫ్) సంతకం చేసిందని వెల్లడిచారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన శాంతి చర్చలు ఫలప్రదంగా ముగిశాయని సోషల్ మీడియా వేదికగా అమిత్ షా ప్రకటించారు. బుధవారం ఢిల్లీలో యునైటెడ్ నేషనల్ లిబరేషన్ ఫ్రంట్ (యుఎన్ఎల్ఎఫ్) శాంతి ఒప్పందంపై సంతకం చేసిందని తెలిపారు. మణిపూర్‌లోని సాయుధ గ్రూపుగా వున్న యుఎన్ఎల్ఎఫ్ హింసను వీడి ప్రధాన స్రవంతిలోకి వచ్చేందుకు అంగీకారం తెలిపిందని చెప్పారు. వీరిని ప్రజాస్వామ్య ప్రక్రియలోకి స్వాగతిస్తున్నానని.. శాంతి, అభివృద్ధి మార్గంలో వీరి ప్రయాణం సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వారు తుపాకీలు వీడిన ఫొటోలను అమిత్ షా షేర్ చేసుకున్నారు. మే 3 నుంచి మణిపూర్‌లో హింసాకాండా రేగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఇటీవల ముఖ్యమంత్రి ఎన్.బీరెన్ సింగ్ తమ ప్రభుత్వం శాంతి చర్చలు జరుపుతోందని మీడియాకు వెల్లడించారు. అయితే మిగతా వివరాలను మాత్రం వెల్లడించలేదు.

## యుపిలో దళిత బాలుడి పట్ల అమానుషం!

- కొట్టి, బలవంతంగా మూత్రం తాగించారు
- ఆ పై లైంగిక వేధింపుల కేసులో ఇరికించారు
- అగ్రకుల పెత్తందారుల దాష్టీకం

**న్యూఢిల్లీ :** యుపిలో యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వ దన్నుతో అగ్రకుల పెత్తందారుల అకృత్యాలకు అడ్డు అదుపు లేకుండాపోతోంది. దళితులపై దాడులు నిత్యకృత్యంగా మారిపోయాయి. జాన్‌పూర్ జిల్లాలో 14ఏళ్ళ దళిత బాలుడితో బలవంతంగా మూత్రం తాగించిన ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. అగ్ర కులానికి చెందిన థాకూర్లు దళిత బాలుడిపై దాడి చేసి కొట్టడమే కాకుండా, బలవంతంగా మూత్రం తాగించారు. అంతటితో ఆగలేదు. లైంగిక వేధింపులకు పాల్పడ్డాడంటూ అతనిపై తప్పుడు కేసు బనాయించారు..

తమ కుమారుడిపై జరిగిన దారుణం గురించి ఫిర్యాదు ఇచ్చిన 33 నిముషాల వ్యవధిలోనే లైంగిక వేధింపుల అభియోగాలతో బాలుడిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారని ఆ బాలుడి తండ్రి మీడియా ముందు వాపోయాడు. కేసు పెట్టకుండా తమను అడ్డగించడానికే వారు ఇలా చేశారని చెప్పాడు. ఈ నెల 24న రాత్రి 7.30గంటల సమయంలో జాన్‌పూర్‌లోని సుజన్‌గంజ్ పోలీసు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. తన కుమారుడిపై తండ్రి కొడుకులు దాడి చేశారంటూ బ్రిజేష్ గౌతమ్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు. తన కుమారుడిని తీవ్రంగా కొడుతూ, కులం పేరుతో దుర్భాషలాడుతూ, ఒక గ్లాసులో పోసిన మూత్రాన్ని బలవంతంగా తాగించి, ఎడమ కనుబొమ్మను షేవ్ చేశారని గౌతమ్ తన ఫిర్యాదులో వివరించాడు, ట్రాక్టర్‌తో తొక్కించేస్తానంటూ బెదిరించారని తెలిపాడు. మారుమూల ప్రాంతానికి ఈడ్చుకెళ్ళి, బాగా కొట్టి, నీట్లో తల ముంచి, నోటినిండా బురదతో నింపేశారని, తర్వాత వారు మూత్రం పోసి దాన్ని తన బిడ్డతో తాగించారని బాలుడి తాత మేవలాల్ గౌతమ్ చెప్పారు.

## డ్వాక్రా గ్రూపులకు డ్రోన్లు

(మొదటి పేజీ తరువాయి)

వరకు అమలులో ఉంటాయి. 15వ ఆర్థిక సంఘం (2021-26) ఎన్‌కె సింగ్ అధ్యక్షతన జరిగింది.

**16వ ఫైనాన్స్ కమీషన్ రిఫరెన్స్ నిబంధనలు**

రాజ్యాంగంలోని అధ్యాయం 1, పార్ట్ 12 కింద వాటి మధ్య విభజించబడే పన్నుల నికర ఆదాయాల కేంద్రం, రాష్ట్రాల మధ్య పంపిణీ, అటువంటి రాబడి సంబంధిత వాటాల రాష్ట్రాల మధ్య కేటాయింపు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 275 ప్రకారం భారత కన్సాలిడేటెడ్ ఫండ్ నుండి రాష్ట్రాల ఆదాయాల గ్రాంట్స్-ఇన్-ఎయిడ్, రాష్ట్రాలకు వాటి ఆదాయాల గ్రాంట్స్-ఇన్-ఎయిడ్ తో చెల్లించాల్సిన మొత్తాలను నియంత్రించే సూత్రాలు ఆ ఆర్టికల్‌లోని క్లాజ్ (1)లోని నిబంధనలలో పేర్కొన్న వాటి కంటే ఇతర ప్రయోజనాల కోసం. రాష్ట్ర ఆర్థిక సంఘం చేసిన సిఫార్సుల ఆధారంగా రాష్ట్రంలోని పంచాయతీలు, మునిసిపాలిటీల వనరులకు అనుబంధంగా ఒక రాష్ట్రం ఏకీకృత నిధిని పెంచడానికి అవసరమైన చర్యలు. విపత్తు నిర్వహణ చట్టం- 2005 (53 ఆఫ్ 2005) కింద ఏర్పాటు చేసిన నిధులను సూచిస్తూ విపత్తు నిర్వహణ కార్యక్రమాలకు ఫైనాన్సింగ్‌పై ప్రస్తుత ఏర్పాట్లను కమిషన్ సమీక్షించవచ్చు. దానిపై తగిన సిఫార్సులు చేస్తుంది.

2026 ఏప్రిల్ 1 నుండి ప్రారంభమయ్యే ఐదేళ్ల కాలవ్యవధిని కవర్ చేస్తూ 2025 అక్టోబర్ 31 నాటికి కమిషన్ తన నివేదికను అందుబాటులో ఉంచనుంది. 16వ ఆర్థిక సంఘం విధివిధానాలపై కేంద్ర మంత్రివర్గం చర్చించింది. అయితే చైర్‌పర్సన్ మరియు సభ్యులను ఇంకా ఖరారు చేయలేదు.

**ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టుల పథకాన్ని మరో మూడేళ్లు పొడిగింపు**

కేంద్రీయ ప్రాయోజిత పథకం (సిఎస్ఎస్) అయిన ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టుల (ఎఫ్‌టిఎస్‌సి)ను 2023 ఏప్రిల్ 1 నుంచి 2026 మార్చి 31 వరకు కొనసాగించడానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపింది. దీనికి రూ.1,952.23 కోట్లు వ్యయం అవుతుంది. దీనిలో కేంద్రం వాటా రూ.1,207.24 కోట్లు, రాష్ట్రాల వాటా రూ.744.99 కోట్లు ఉంటుంది. కేంద్రం వాటాను నిర్భయ నిధి నుండి సమకూర్చడం జరుగుతుంది. ఈ పథకాన్ని 2019 అక్టోబరు 2న ప్రవేశపెట్టడమైంది. ఈ పథకాన్ని 30 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు అమలు చేస్తున్నాయి. 414 ప్రత్యేకించిన పోక్సో కోర్టులు సహా 761 ఎఫ్‌టిఎస్‌సిలు ప్రస్తుతం పని చేస్తున్నాయి. ఇవి 1,95,000కు పైగా కేసులను పరిష్కరించాయి.

**ప్రధాన మంత్రి జంజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్‌కు ఆమోదం**

ప్రధానమంత్రి జంజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ కు (పిఎం జన్మన్)కు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 9 మంత్రిత్వ శాఖలతో 11 ప్రధాన సమస్యలపై దృష్టి పెట్టడానికి మొత్తం రూ.24,104 కోట్లు (కేంద్ర వాటా రూ.15,336 కోట్లు, రాష్ట్ర వాటా రూ.8,768 కోట్లు)నిధుల మంజూరును ఆమోదించింది. ఖుంతి నుండి జంజాతీయ గౌరవ్ దివస్ నాడు ప్రధాన మంత్రి అభియాన్‌ను ప్రకటించారు. దేశంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 10.45 కోట్ల మంది ఎస్టీ జనాభా ఉన్నారు. వీటిలో 18 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతం అండమాన్, నికోబార్ దీవుల్లో ఉన్న 75 కమ్యూనిటీలు ప్రత్యేకించి దీన గిరిజన సమూహాలుగా (పివిటిజిలు) వర్గీకరించబడ్డాయి. పక్కా గృహాల మంజూరు (4.90 లక్షలు), అనుసంధాన రోడ్లు(8000 కిలో మీటర్లు), కుళాయి నీటి సరఫరా, కమ్యూనిటీ నీటి సరఫరా, ఔషధ ఖర్చుతో మొబైల్ మెడికల్ యూనిట్లు, హాస్టళ్ల నిర్మాణం (500), వృత్తి విద్య, నైపుణ్యం (60 ఆకాంక్ష పీవీటీజీలు బ్లాక్‌లు), అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం (2,500), మల్టీపర్పస్ సెంటర్ల నిర్మాణం (1,000), హెచ్‌హెచ్‌ల శక్తివంతం (లాస్ట్ మైల్ కనెక్టివిటీ) (57 వేల హెచ్‌హెచ్‌లు), 0.3 కే డబ్ల్యూ సోలార్ ఆఫ్-గ్రిడ్ వ్యవస్థను అందించడం (1,00,000 హెచ్‌హెచ్‌లు), వీధులు, ఎంపీసిలలో సోలార్ లైటింగ్ (1,500 యూనిట్లు), వీడీకేల ఏర్పాటు (500), మొబైల్ టవర్ల ఏర్పాటు (3 వేల గ్రామాలు) వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తారు.

## రెండేళ్లుగా బిల్లులను ఎందుకు తొక్కిపట్టారు?

(మొదటి పేజీ తరువాయి)

సుప్రీంకోర్టు ధర్మాసనం హెచ్చరించింది. ప్రస్తుత పిటిషన్‌లో అలాంటి జోక్యమేమీ కుదరదు కాబట్టి పిటిషన్‌కు అవసరమైన సవరణలు సమర్పించాలని కేరళను సుప్రీంకోర్టు ఆదేశించింది. నిబంధనలు పాటించకుండా గవర్నర్ బిల్లులను రాష్ట్రపతి పరిశీలనకు పంపారని, అందుకు ఎలాంటి కారణం కూడా చెప్పలేదని తెలిపారు. గవర్నరు తొక్కిపట్టినవాటిలో మనీ బిల్లు ఒకటి ఉందని కేకే వేణుగోపాల్ వివరించారు. దీంతో ఆ మనీ బిల్లుపై గవర్నరు వెంటనే నిర్ణయం తీసుకునేలా చూస్తానని అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి హామీ ఇచ్చారు. ఈ అంశాన్ని మధ్యంతర ఉత్తర్వుల్లో నమోదు చేస్తున్నట్లు సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది.

**మీ కోసం**

వన్నె తగ్గిన బంగారం, వెండి ఆభరణాలను విరిగిన పాలతో కడిగితే కొత్తవాటిలా మెరుస్తాయి.

**జీవన సౌరభం**

చేసిన సహాయం మరచిపోవాలి. పొందిన సహాయం గుర్తుంచుకోవాలి.

## అలసిపోని బాల్యం

అలసి పోని బాల్యంలో
చెరిగిపోని చిత్రాలెన్నో..!
పెరుగుతున్న ప్రాయంలో
మరుగున పడని జ్ఞాపకాలవి..!

ఊరంతా పచ్చి తిరుగుళ్ళు తిరిగి
రాత్రంతా దిగుళ్ళు లేని గాఢ నిద్ర..
తూనీగను పట్టే పని తొందరలో
అరికాలికి దిగిన కోరడా ముల్లు..

తుమ్మ జిగురుతో కమ్మగా చిరిగిన
పుస్తకం అట్టను అంటించిన బాల తెలివి
కోమటి కొసరుగా ఇచ్చిన గడ్డ
బెల్లాన్ని బుగ్గన పెట్టి ఊరించిన మూతి..!

చేతులకు గోరింటాకు పెట్టుకోగా
అమ్మ గోముగా అన్నం తినిపించిన మమకారం
పాఠం రాలేదని పిలక పంతులు గారు
గంట సేపు గోడ కుర్చీ వేయించిన తీరు

నాన్న జేబులోంచి రూపాయిని దొంగిలించి
సినిమాకు వెళ్ళిన తెలియని చిన్నతనం..
ఖాళీ సమయాల్లో వాటిని నెమరువేసుకుంటుంటే
డీలా పడిన మనసు డోలిలా ఊగుతుంది..!

– జి.సూర్యనారాయణ,
62817 25659.

### జత చేయండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని బొమ్మలు ఇచ్చాం. వాటి మధ్యలో కనిపించకుండా పోయిన భాగాలు కింద ఉన్నాయి. ఏ బొమ్మకి ఏ భాగమో మీరు జత చేయండి.



నేను గీసిన బొమ్మ

**పూజ,**
8వ తరగతి,
జడ్పీహెచ్‌యస్,
హవేళి ఘణపూర్, మెదక్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

# సాంస్కృతిక వైభవం కోసం...

ప్రతిభ ఒక్కొక్కరిలో ఒక్కోలా ఉంటుంది. అప్పుడే కళాశాలలో అడుగుపెట్టిన విద్యార్థుల నుంచి సీనియర్ విద్యార్థుల్లోని ప్రతిభను బాహ్య ప్రపంచానికి తెలియజేయటానికి దోహదపడేవి కళా ఉత్సవాలే..కృష్ణాతరంగ్ పేరుతో కృష్ణా విశ్వ విద్యాలయం గత 12 సంవత్సరాలుగా (కరోనా రెండేళ్లు మినహా) అలాంటి వేడుకలకు వేదిక అవుతోంది. ఇలాంటి వేడుకల్లో ఆర్ట్స్, సైన్స్, ఇంజనీరింగ్, ఫార్మశీ తదితర కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు చూపించే నైపుణ్యత, నటనా శైలీ అబ్బురమనాల్సిందే. సంప్రదాయ, వెస్టన్ డ్యాన్స్‌లతోపాటుగా విచిత్ర వేషధారణ, నాటిక ప్రదర్శనలు, నాటకాలు వంటివాటితో పాటుగా కళలు ప్రదర్శిస్తూ విద్యార్థినీ విద్యార్థులు అతిథులతో శబాష్ అని పించుకుంటున్నారు. సంప్రదాయ వస్త్రధారణలతోపాటుగా ర్యాంప్ వాక్‌లు చేసేస్తుంటారు. ప్రాచీన కూచిపూడి నృత్యాలు అలరిస్తాయి. ప్రతి అంశంలోనూ చక్కని అంగిక, వాచికాభినయాలు ప్రదర్శిస్తూ ప్రేక్షకులకు తన్మయత్వం కలిగేలా ప్రదర్శనలు ఇస్తుండటం అభినందనీయం. పల్లె జీవనం, సంస్కృతి, ఆహార, ఆచార వ్యవహారాలతోపాటుగా పండుగల సందర్భంగా పల్లె సీమల్లో కనిపించే కళారూపాల ప్రదర్శనలు ఆద్యంతం ఆకట్టుకుంటాయి. మహిషాసుర మర్ధిని, భామాకలాపం, దశావతారం తదితర నృత్యాంశాలు ఆకట్టుకుంటున్నాయి. తమ హాస్యోక్తులతో ప్రేక్షకులను నవ్వించే ఉదంతాలు కూడా అనేకం ఉంటాయి. సినిమాల్లో నాటి నుంచి నేటి వరకూ కొనసాగుతున్న ట్రెండ్స్‌పైనా పాటలు, కుర్రకారుని హుషారెత్తించే డ్యాన్సులు డీజేల్లో హోరెత్తాల్సిందే.

భిన్నత్వంలో ఏకత్వంతో అలరాలుతున్న దేశ ప్రజలను ఉన్నత స్థాయిలో నిలబెడుతోంది సాంస్కృతిక వైభవమే. ప్రాచీన కాలం నుంచి నేటికీ అదే వారసత్వాన్ని కొనసాగిస్తున్నాం. సమాజంలో అసమానతలు పోవాలంటే సమానత్వం సాధించాలి. అది అన్ని రంగాల్లో సాధించాల్సి వుంది. జన జీవనాడిని కదిపే, కదిలించే సాంస్కృతిక రంగంపైన కూడా ప్రభుత్వాలు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మరింత విస్తృతంగా, మరింత లోతుగా ఈ రంగాన్ని అభివృద్ధి చేసి ప్రోత్సహిస్తే సాహితీ రంగం, సాంస్కృతిక రంగాల్లో రెండు తెలుగు రాష్ట్రాలో ప్రపంచ ఖ్యాతిని పొందుతాయనటంలో ఎలాంటి సందేహం లేదు. ఇలాంటి కళా, సాంస్కృతిక వైభవం కోసం కృషిని కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని కృష్ణా విశ్వ విద్యాలయం గత 13 సంవత్సరాలుగా కొనసాగిస్తోంది. మచిలీపట్నంలో 2008లో కృష్ణా యూనివర్శిటీ ఏర్పాటైంది. తొలుత ఆంధ్ర జాతీయ కళాశాలలో ప్రారంభమైన ఈ విశ్వ విద్యాలయం అనంతరం మచిలీపట్నం మండలం రుద్రవరం గ్రామంలో నిర్మించిన కొత్త క్యాంపస్‌లోకి 2020 జనవరిలో మారింది. అప్పటి నుంచి ఏటేటా జాతీయ, అంతర్జాతీయ యూనివర్శిటీలతో సమన్వయంతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహిస్తోంది. వెబినార్లు వంటివి కొనసాగిస్తోంది. విద్యార్థుల్లో ఆల్‌రౌండ్ ప్రతిభను వెలికితీయటానికి అన్ని విభాగాలు తమ వంతుగా కృషిచేస్తున్నాయి.

### సాంస్కృతిక ప్రత్యేకతలు

తెలుగు నేలపై ఏ ప్రాంతానికి ఆ ప్రాంతపు సాంస్కృతిక ప్రత్యేకతలు ఉన్నాయి. భాష ఒక్కటే అయినా యాసలు చాలా ఉన్నాయి. మాండలికాలు ఉన్నాయి. సాధారణ సంప్రదాయాల తోపాటు ప్రతి ప్రాంతానికీ ప్రత్యేక ప్రత్యేకమైన సంప్రదాయాలు ఉన్నాయి. పెళ్ళిళ్లు, పండుగలు, ఆహారం, ఆహార్యాల్లో తేడాలున్నాయి. వాటికి విభిన్న, చారిత్రక నేపథ్యాలు ఉన్నాయి. అలాంటి ప్రదర్శనా కళారూపాలు కృష్ణాతరంగ్‌లో ఆత్యంతం ఉత్సాహాన్నిస్తుంటాయి.

–యడవల్లి శ్రీనివాసరావు

### విద్యార్థుల్లో నైపుణ్యం వెలికితీతకు దోహదం

యూనివర్శిటీ, అనుబంధ కళాశాలల్లో చదివే విద్యార్థినీ విద్యార్థుల్లో నిబిడీకృతమైన సృజనాత్మక, కళా, సాంస్కృతిక నైపుణ్యాలను వెలికితీయటానికిగాను మొత్తం 27 అంశాల్లో ప్రదర్శనలకు అవకాశం కల్పించాం. గురువారంనాడు ఉదయం 11 గంటలకు ప్రారంభసభకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి, కృష్ణా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సిలర్ ప్రొఫెసర్ కె.జ్ఞానమణి హాజరుకానున్నారు. గౌరవ అతిథులుగా మచిలీపట్నం పోర్ట్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ మేకతోటి దయాసాగర్ (ఐఆర్ఎస్ రిటైర్డ్), యూనివర్శిటీ రెక్టార్ ప్రొఫెసర్ డి.సూర్యచంద్రరావు, రిజిస్ట్రార్ (ఎఫ్ఎసి) డాక్టర్ వి.వీరబ్రహ్మాచారి హాజరుకానున్నారు. పరిపాలనా విభాగం ఎదురుగా ఉన్న యూనివర్శిటీ ప్రాంగణంలో ఉత్సవాలు వైభవంగా జరగటానికి అన్ని ఏర్పాట్లు చేశాం. కృష్ణాతరంగాలు మ్యాగజైన్‌కు చీఫ్ పాట్రన్‌గా విసి జి.జ్ఞానమణి, పాట్రన్‌గా రిజిస్ట్రార్ పి.వీరబ్రహ్మాచారి, చీఫ్ ఎడిటర్‌గా ప్రొఫెసర్ ఇ.దిలీప్ (ఇంగ్లీష్ విభాగం,యుసిఎఎస్), కో ఎడిటర్‌గా వై.ఎవిఎస్ఎన్ మారుతి (బయాలజికల్ సైన్స్, బయోటెక్నాలజీ, యుసిఎఎస్, ఎడిటోరియల్ బోర్డు సభ్యులుగా డాక్టర్ ఎ.శివశేషారెడ్డి (ఫిజిక్స్ విభాగం), కె.సుబ్బారావు (ఇంగ్లీషు విభాగం), డి.శాంతికృప (ఫార్మశీ విభాగం) వ్యవహరిస్తున్నారు.

–డాక్టర్ ఎం.కోటేశ్వరరావు, కన్వీనర్, కృష్ణాతరంగ్–2023

### సాంస్కృతిక వైభవం కోసమే

కృష్ణాతరంగ్–2023 యువజనోత్సవాలకు పెద్దఎత్తున ఏర్పాట్లు చేశాం. గురు, శుక్ర, శనివారాల్లో మూడురోజులపాటు ఈ ఉత్సవాలు కొనసాగుతాయి. 2000 మంది విద్యార్థినీ విద్యార్థులు హాజరవుతున్నారు. యూనివర్శిటీ ప్రాంగణంలో ఉత్సవాల కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశాం. 27 అంశాలతో జరిగే పోటీల్లో విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలల తరపున అన్ని కళాశాలలనుంచి విద్యార్థులు హాజరవుతున్నారు. యువజనోత్సవాల్లో పాల్గొనే విద్యార్థినీ విద్యార్థులకు పూర్తిస్థాయిలో వసతులు ఏర్పాటుచేశాం. ఇతర కళాశాలలకు చెందిన విద్యార్థులు, అధ్యాపకులు కూడా ఈ వేడుకల్లో పాల్గొంటున్నారు. మ్యూజిక్, డ్యాన్స్, లిటరరీ, థియేటర్ ఆర్ట్స్, ఫైన్ ఆర్ట్స్ వంటి కళలను ప్రదర్శించనున్నారు. యూనివర్శిటీ ప్రారంభం నుంచి నేటి వరకూ ఈ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. విద్యార్థుల్లో నిబిడీకృతమైన కళలు, సాహిత్యం, ఇతర నైపుణ్యాలను వెలికితీయటానికి ఈ కృష్ణాతరంగ్ ఎంతో దోహదపడుతుంది. ఇక్కడ జరిగే పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తాం. ఆ తర్వాత రాష్ట్రస్థాయిలో త్వరలో ఆంధ్రా యూనివర్శిటీలో జరిగే దక్షిణాది రాష్ట్రాల యూనివర్శిటీ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు పాల్గొంటారు. అక్కడ జరిగే ఉత్సవాలు జాతీయస్థాయిలో జరుగుతాయి.

–కె.జ్ఞానమణి,
యూనివర్శిటీ ఉపకులపతి, కృష్ణా



## 1న పల్లెగూటికి పండగొచ్చింది విడుదల

కె.ప్రవీణ్ సమర్పణలో ఈశ్వర్ మెమోరియల్ లక్ష్మి ఫిల్మ్ ప్రొడక్షన్ బ్యానర్‌పై రూపొందించిన చిత్రం 'పల్లె గూటికి పండగొచ్చింది'. రోహిత్‌కృష్ణ, సంతోష్, నిఖిత, హర్షిత హీరో హీరోయిన్లుగా నటించారు. కంచరాన రాజ్యలక్ష్మి నిర్మాత. కథ, మాటలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం కంచరాన తిరుమలరావు. సంగీతం సింధు కె.ప్రసాద్. డిపిఒ రవి కె మోహన్, ఎడిటర్ రాఘవేంద్రరెడ్డి పి. వ్యవహరించారు. ఈ సినిమా డిసెంబర్ ఒకటోతేదీన విడుదల కానుంది. హేమంత్ గుజ్జారు, సుమన్, సాయికుమార్, శాయాజీ షిండే, రఘుబాబు, అన్నపూర్ణ, జబర్దస్త్ రాజమౌళి, అప్పారావు, రఘు, గుండు మురళి, జగదీశ్వరి తదితరులు నటించారు.

## సీబీఐ ఆఫీస్‌కు వెళ్తానని అనుకోలేదు: విశాల్

'నాకు ఇది పూర్తిగా కొత్త అనుభవం. విచారించిన తీరుపై నేను సంతృప్తిగా ఉన్నాను. సీబీఐ కార్యాలయం ఎలా ఉండాలనే దానిపై కూడా వాళ్లు కొన్ని సూచనలు తీసుకున్నారు. నేను జీవితంలో సీబీఐ ఆఫీసుకు వెళ్తానని అసలు అనుకోలేదు. రీల్ లైఫ్‌లోనే కాదు..రియల్ లైఫ్‌లోనూ అవినీతిపై పోరాడాల్సిన అవసరం ఉంది' అని హీరో విశాల్ వ్యాఖ్యానించారు. సెంట్రల్ బోర్డు ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సిబిఎఫ్‌సి)పై ఆయన ఇటీవల ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. దీంతో సీబీఎఫ్‌సీ ముంబై శాఖ అధికారులపై సీబీఐ కేసు నమోదు చేసింది. ఆ కేసు విచారణలో భాగంగా తాజాగా విశాల్ సీబీఐ ఎదుట హాజరయ్యారు. ఈ విషయాన్ని ఆయన ఎక్స్‌లో వెల్లడించారు.

## ఆందోళనకరంగానే విజయ్‌కాంత్ ఆరోగ్యం

'విజయ్ కాంత్(71) ఆరోగ్యం కాస్త మెరుగుపడినా.. గత 24 గంటలుగా ఆయన పరిస్థితి విషమంగానే ఉంది. చికిత్సకు ఆయన శరీరం సహకరిస్తోంది. వైద్య నిపుణులు పల్మనరీ చికిత్సను సిఫార్సు చేశారు. ఆయన కోలుకోవడానికి మరో 14 రోజుల పాటు నిరంతర చికిత్స అవసరం అని డాక్టర్లు వెల్లడించారు' అని విజయ్‌కాంత్ ఆరోగ్యంపై ఎంఐఓటి హాస్పిటల్ యాజమాన్యం విడుదలచేసిన తాజా బులిటెన్‌లో తెలిపింది. విజయ్ కాంత్ ఆరోగ్యం క్షీణించడంతో ఈనెల 18న ఆసుపత్రిలో చేరారు. ఆయన కొంతకాలంగా డయాబెటిస్‌తో పాటు.. లివర్ సమస్యతో బాధపడుతున్నారు. వీటితో పాటు జలుబు, దగ్గు, గొంతునొప్పితో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్న ఆయనని కుటుంబ సభ్యులు హాస్పిటల్‌లో జాయిన్ చేశారు. ప్రత్యేక వైద్యుల బృందం ఆయనకు చికిత్స అందిస్తోంది. డయాబెటిస్ కారణంగా ఇప్పటికే డాక్టర్లు ఆయన కుడి కాలి మూడు వేళ్లను తొలగించారు.

## శ్రేయాంక పాటిల్ మ్యాజిక్

### ఉత్కంఠ పోరులో ఇంగ్లండ్–ఎపై మూడు పరుగుల తేడాతో భారత్–ఏ మహిళలజట్టు గెలుపు

**ముంబయి:** మహిళా యువ ఆల్ రౌండర్ శ్రేయాంక పాటిల్ స్పిన్ మ్యాజిక్‌తో ఇంగ్లండ్–ఏతో జరిగిన తొలి టి20లో భారత్–ఎ మహిళల జట్టు సంచలన విజయం సాధించింది. భారత్ నిర్దేశించిన 135 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఇంగ్లండ్ నిర్ణీత 20ఓవర్లలో 131 పరుగులకే పరిమితమైంది. ఆఖరి ఓవర్లో 12 పరుగులు చేయాల్సి ఉండగా శ్రేయాంక బౌలింగ్ మాయతో ఇంగ్లండ్ మూడు పరుగుల తేడాతో విజయానికి దూరమైంది. ఆఖరి ఓవర్లో పొదుపుగా బౌలింగ్ చేయడమే గాక రెండు వికెట్లు కూడా తీయడంతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు శ్రేయాంకకు వరించింది. ముంబయిలోని వాంఖడే స్టేడియం వేదికగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో మిన్ను మణి సారథ్యంలో బరిలోకి దిగిన భారత్.. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. ఓపెనర్ డి. వృంద(22), డి.డి. కసత్(25), దివ్య(22)లు రాణించడంతో భారత్ నిర్ణీత ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 134 పరుగులు చేసింది. అనంతరం ఛేదనకు దిగిన ఇంగ్లండ్.. హోలి అర్మిటేజ్(52, 41 బంతుల్లో 3ఫోర్లు, సిక్సర్), సెరెన్(31)లు రాణించడంతో సునాయాసంగా లక్ష్యాన్ని ఛేదించేలా కనిపించింది. అర్మిటేజ్‌ను 17వ ఓవర్లో మిన్ను మణి ఔట్ చేయడంతో మ్యాచ్ మలుపు తిరిగింది. ఆ మరుసటి ఓవర్లోనే సెరెన్‌ను కాశ్వీ గౌతమ్‌ను ఔట్ చేసింది. సెరెన్ నిష్క్రమించే సమయానికి ఇంగ్లండ్ 17.4 ఓవర్లలో 114 పరుగులు చేసింది. అదే ఓవర్లో ఇస్సీ వాంగ్ కూడా ఔట్ కావడంతో ఇంగ్లండ్ కష్టాలు మొదలయ్యాయి. కెప్టెన్ చార్లీ డీన్(10) క్రీజులో ఉన్నా.. ఆఖరి ఓవర్ వేసిన శ్రేయాంక మ్యాజిక్ చేసింది. తొలి నాలుగు బంతుల్లో 9 పరుగులిచ్చిన శ్రేయాంక.. తర్వాత వరుస బంతుల్లో రియానా మాక్‌డొనాల్డ్, చార్లీ డీన్‌ను ఔట్ చేయడంతో ఇంగ్లండ్‌కు పరాజయం తప్పలేదు. ఇరుజట్ల మధ్య జరుగుతు మూడు టి20ల సిరీస్‌లో భారత్–ఎ 1–0 ఆధిక్యతలో నిలువగా.. రెండో టి20 శుక్రవారం జరగనుంది.

## కోచ్, సహాయ సిబ్బంది కాంట్రాక్టులు పొడిగింపు

### బిసిసిఐ

**ముంబయి:** భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు(బిసిసిఐ) కీలక నిర్ణయం తీసుకుంది. టీమిండియా హెడ్‌కోచ్ రాహుల్ ద్రావిడ్‌తోపాటు సహాయ కోచ్, సిబ్బందిల కాంట్రాక్టులను పొడిగించింది. ఈ మేరకు బిసిసిఐ మంగళవారం ఓ ప్రకటనలో హెడ్ కోచ్ రాహుల్ ద్రావిడ్‌తో పాటు బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్, బౌలింగ్ కోచ్ పరాస్ మంబ్రే, ఫీల్డింగ్ కోచ్ టి. దిలీప్‌లతోపాటు సహాయ సభ్యుల కాంట్రాక్టులను పునరుద్ధరిస్తున్నట్లు ప్రనకటించింది. వాస్తవానికి వన్డే ప్రపంచకప్ తర్వాత ద్రావిడ్ రెండేళ్ల కాంట్రాక్టు ముగిసింది. ఆ కారణంగానే ఆస్ట్రేలియాతో టి20 సిరీస్‌కు వివిఎస్ లక్ష్మణ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు. వివిఎస్ లక్ష్మణ్‌కు ఇప్పటికే ఎన్‌సిఏ బాధ్యతలు ఉండగా నెహ్రా కూడా ఐపిఎల్‌తో పాటు ఇతర బాధ్యతలతో బిజీగా ఉన్న కారణంగా కారణంగా హెడ్‌కోచ్ పదవికి విముఖత చూపించడంతో ద్రావిడ్‌నే కొనసాగించేందుకు బిసిసిఐ అంగీకరించినట్లు సమాచారం.

## మంచి సమాజం కోసమే 'పోలీసు వారి హెచ్చరిక'

'మన పిల్లలకు, కుటుంబానికి పంచే ప్రేమలో కొంతైనా మన చుట్టూ వుండే అనాథ బాలలకు పంచకపోతే మన పిల్లల భవిష్యత్తు గురించి చేసే ఆలోచనలో, పడే తపనలో, తీసుకునే జాగ్రత్తలో కొంతైనా అనాథలు, అభాగ్యుల విషయంలో ప్రదర్శించకపోతే వారు సంఘ వ్యతిరేక శక్తుల చేతుల్లో చిక్కుకొని సమాజాన్ని నాశనం చేసే నేరస్థులుగా మారే ప్రమాదం వుంది' అని దర్శకుడు బాబ్జీ తెలిపారు. తూలికా తనిష్క్ క్రియేషన్స్ పతాకంపై బెల్లి జనార్ధన్ నిర్మిస్తున్న 'పోలీస్ వారి హెచ్చరిక' సినిమా షూటింగ్ దాదాపుగా పూర్తయ్యిందని బాబ్జీ వెల్లడించారు. దసరా రోజున ప్రారంభించామనీ, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో తీసిన షూటింగ్‌తో దాదాపుగా చిత్రీకరణ పూర్తయ్యిందన్నారు. త్వరలోనే విడుదలకు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.

## అభిమానుల రుణం తీర్చుకోలేను

బుల్లితెర నటుడు సుధీర్ హీరోగా నటించిన తాజా చిత్రం 'కాలింగ్ సహస్ర'. షాడో మీడియా ప్రొడక్షన్స్, రాధా ఆర్ట్స్ పతాకాలపై అరుణ్ విక్కిరాలా దర్శకత్వంలో విజేష్ తయాల్, చిరంజీవి పమిడి, వెంకటేశ్వర్లు కాటూరి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. డాలీషా హీరోయిన్‌గా నటిస్తున్నారు. డిసెంబర్ 1న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా బుధవారం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ ఈవెంట్‌కు జేడీ చక్రవర్తి, దర్శకుడు దశరథ్, బొమ్మరిల్లు భాస్కర్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. 'నాకు మంచి పాత్రను, సవాల్‌తో కూడుకున్న పాత్రను ఇచ్చిన అరుణ్ గారికి థాంక్స్. నాలోని ఇంకో కోణాన్ని చూపించే పాత్ర వచ్చింది. డాలీషాతో పని చేయడం ఆనందంగా ఉంది. గెటప్ శ్రీను అనే వాడు.. వేణు అన్న దగ్గరికి వెళ్లమని చెప్పకపోతే.. మల్లెమాల టీం, జబర్దస్త్ లేకపోతే.. మీ అభిమానం నాకు దక్కేది కాదు. వాళ్ల వల్లే మీ అభిమానం దొరికింది. మీ అందరికీ ఎప్పటికీ రుణపడి ఉంటాను. ఎన్ని జన్మలు ఎత్తినా ఆ రుణం తీర్చుకోలేను. ఇకపై కొత్త కంటెంట్, మంచి సినిమాలు తీస్తాను. కొత్త సినిమా, కొత్త ప్రయత్నం చేశాం. మీకు నచ్చితే పది మందికి చెప్పండి. 30వ తేదీ అందరూ ఓటు వేయండి.. 1వ తేదీ మా సినిమాను చూడండి' అని సుధీర్ ఈ కార్యక్రమంలో మాట్లాడారు.

## ఆంధ్రకు మరో ఓటమి

### రాజస్తాన్ చేతిలో 38పరుగుల తేడాతో పరాజయం

**ఛండీగడ్:** విజయ్ హజారే వన్డే టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు మరో ఓటమిని చవిచూసింది. మంగళవారం జరిగిన గ్రూప్–డి నాల్గో లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు 38పరుగుల తేడాతో రాజస్తాన్ చేతిలో ఓడింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన రాజస్తాన్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 290పరుగులకు ఆలౌటైంది. అభిజిత్ థోమర్(124) సెంచరీకి తోడు రామ్ మోహన్(52) అర్ధసెంచరీతో రాణించారు. తపస్వీకి నాలుగు, శశికాంత్, బి. కుమార్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో ఆంధ్ర జట్టు 4.4ఓవర్లలో 252పరుగులకు ఆలౌటైంది. అశ్విన్ హెబ్బర్(68), హనుమ విహారి(60) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. అనికిత్ చౌందరికి నాలుగు, రాహుల్ చాహర్, సుతార్‌కు మూడేసి వికెట్లు దక్కాయి.

**హైదరాబాద్ రెండో ఓటమి**

గ్రూప్–బిలో హైదరాబాద్ జట్టు మళ్లీ నిరాశపరి చింది. సర్వీసెస్ చేతిలో హైదరాబాద్ జట్టు 6వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ జట్టు 50 ఓవర్లలో 210పరుగులకే కుప్ప కూలగా.. ఆ లక్ష్యాన్ని సర్వీసెస్ జట్టు 40.5ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 211పరుగులు చేసి గెలిచింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68